
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-10-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 253 పేజీలు: 8 వెల: 6.50


జోయల్ మొకిర్ ఫిలిప్ అఘియాన్ పీటర్ హోవిట్

## ముగ్గురు ఆర్థికవేత్తలకు నోబెల్ 2లో

# దేశ ప్రగతిలో ఎపి కీలకం


సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం చంద్రబాబు

### అంతర్జాతీయ పెట్టుబడులకోసం నిర్వహిస్తున్న విశాఖ సమ్మిట్‌కు రండి: ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

### సదస్సుకు రానున్న 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది గ్లోబల్ సిఇఒలు, 40 దేశాల ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు

### సిఆర్‌డిఎ భవనం ప్రారంభం 2లో

**విజయవాడ,అక్టోబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడీని సిఎం చంద్రబాబు నాయుడు సోమవారం సాయంత్రం ఢిల్లీలో కలిసారు. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ప్రధానిని ఆహ్వానిస్తూ అధికారికంగా ఆహ్వానం అందజేశారు. దేశ ప్రగతిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేందుకు సన్నద్ధమవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. దేశ ఆర్థిక, సాంకేతిక అభివృద్ధిలో ఎపి అగ్రగామిగా నిలవాలని, దానికోసం అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ క్రమంలో పిఎం నరేంద్ర మోడీని కలుసుకుని విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ పార్టనర్షిప్ సమ్మిట్‌కు ముఖ్య >>2

# కల్తీ మద్యంలో జోగి రమేష్ పాత్ర!

### ములకలచెరువు కేసులోని నిందితుడు జనార్దన్ రావు ఆరోపణ


జోగి రమేష్

### ఆరోపణ పూర్తి నిరాధారం: రమేష్

**విజయవాడ, అక్టోబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో ములకల చెరువులో బయటపడిన నకిలీ మద్యం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏ1 నిందితుడుగా ఉన్న అద్దెపల్లి జనార్దన్ రావు తాజాగా సంచలనం సృష్టించారు. వైఎస్సార్సీ నేత జోగి రమేష్ చేసిన కుట్ర వల్లనే ఇదంతా జరిగిందని ఆయన ఓ వీడియోలో ఆరోపించారు. జోగి రమేష్ ఇచ్చిన రూ.3కోట్లుఆఫర్‌కు ఆశ >>2


జనార్దన్ రావు

## కల్తీ మద్యం కేసులో మరొకరి అరెస్టు 2లో

# ఇక తుపాకులు పేలవు..



### గాజాలో యుద్ధం ముగిసింది 2లో

### పాక్, అఫ్ఘాన్ ఉద్రిక్తతలూ తగ్గిస్తా

### యుద్ధాలు ఆపడంలో నిపుణుడిని..

### ఇజ్రాయెల్ పార్లమెంటులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీ

### అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు: హోంమంత్రి అనిత

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ లాంటి క్రీడా కార్యక్రమాలు పోలీస్ శాఖలోని క్రీడా సామర్థ్యాన్ని, శిక్షణను, పరస్పర సహకారాన్ని ప్రతిబింబించేందుకు గొప్ప వేదికగా నిలుస్తాయన్నారు. రెండవ ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025-26 పోటీలు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం 6వ బెటాలియన్, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ క్రీడా ప్రాంగణం. మంగళగిరిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత, విశిష్ట అతిథిగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీపీవోల నుంచి వచ్చిన 32 టీమ్ లు మార్చ్ ఫాస్ట్ చేసి ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం హోం మంత్రి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ జాతీయస్థాయి క్రీడా సమ్మేళనంలో వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, యోగా అంశాల్లో పురు >>2

# కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి

### హోంశాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక ట్రాన్స్‌జెండర్‌కు ఎస్ఐ ఉద్యోగ కల్పన విషయంలో పోలీసు ఉన్నత ఉద్యోగుల తీరును ఎపి హైకోర్టు తప్పుపట్టింది. గతంలోఒక ట్రాన్స్ జెండర్‌కు ఎస్ఐ ఉద్యోగ కల్పన విషయంలో జారీ చేసిన ఆదేశాల అమలు గురించి వివరణ ఇచ్చేందుకు ఈ నెల 27న జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌కు హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు జస్టిస్‌బట్టు దేవానంద్, >>2





కర్నూలులో ప్రధాని పర్యటన ఏర్పాట్లు సోమవారం పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, బిసి జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కిలారు రాజేష్, సత్యనారాయణరాజు, దాముర్ల సత్య, బివి వెంకట రాముడు తదితరులు

# ప్రధాని పర్యటనకు పకడ్బందీ భద్రత

## డ్రోన్ల ఎగురవేతపై నిషేధం: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన కర్నూలులో జరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనను దృష్టిలో ఉంచుకుని 7,500 మంది పోలీసులతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కర్నూలు పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని యూటీఆర్ కన్వెన్షన్ హాల్‌లో బందోబస్తు విధుల్లో పాల్గొననున్న అడిషనల్ ఎస్పీ నుండి ఎస్సై స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన ప్రాంతాల్లో 200 సిసి కెమెరాలతో నిఘా, డిజిపి కంట్రోల్ రూమ్ నుండి మానిటరింగ్, మరియు ఎయిర్‌పోర్ట్, సభా ప్రదేశం, పార్కింగ్ ప్రాంతాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని చెప్పారు. బహిరంగ సభ ప్రాంతానికి ఏడు మంది ఎస్పీ స్థాయి అధికారులను కేటాయించామని, అధికారులు సెక్టార్ ఇంచార్జ్‌ల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫోటోలు, వీడియోలు తీయరాదని బందోబస్తు సిబ్బందికి హెచ్చరిక జారీచేశారు. డ్రోన్ల వినియోగం పూర్తిగా నిషేధించబడిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుండి సుమారు 7,000 బస్సుల్లో ప్రజలు బహిరంగ సభకు రానున్నారు. ఇందులో 3,000 ఆర్టీసీ బస్సులు, 4,000ప్రైవేట్ బస్సులు ఉన్నాయనితెలిపారు. భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తున్నామని, ప్రజలు, అధికారులు అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు.

# కల్తీ మద్యంలో జోగి రమేష్ పాత్ర!

>> పడే ఐదంతా చేశారని జనార్ధన్‌రావు చెబుతున్నారు. వైఎస్సార్సీపీ హయాం లోనే పెద్ద ఎత్తున నకిలీ మద్యం వ్యాపారం చేశామని జనార్ధన్ రావు తెలిపారు. పోలీసులు పట్టుకుంటే బెయిల్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే వైఎస్సార్సీ ఓడిపోయిన తర్వాత నిఘా ఎక్కువవడంతో నకిలీ మద్యం తయారీ ఆపేశా మన్నారు. ఎన్డీఏలో జోగి రమేష్ మద్యం తయారీ ప్రారంభించాలని సూచించారని పోలీసులకు చెప్పారు. ఒక వేళ దొరికితే.. ప్రభుత్వంపై బురదచల్లవచ్చని.. తంబళ్లపల్లెనుంచే ప్రారంభించ చాలని సూచించారన్నారు. దొరికితే అన్ని విధాలుగా అండగా ఉంటాననిచెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆయన చెప్పారు. అద్దేపల్లి నర్సింగరావు స్టేట్‌మెంట్ సంచలనం సృష్టిస్తోంది. ఈ క్రమంలో ఎన్టీఆర్‌జిల్లా ఇబ్రహీంపట్నం సమీ పంలో జనార్ధన్‌రావు కాల్‌లిస్టు ఆధారంగా పలువురిని విచారి స్తున్నట్లు సమాచారం!

**పక్కా వ్యూహంతో బాబు కుట్ర: జోగి రమేష్**

మద్యం కేసులో డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తనను ఇరికించాలని సిఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు.అద్దేపల్లి జనార్ధన్‌తో ఆ కుట్రలో భాగంగానే ఆరోపణలు చేయిస్తున్నారన్నారు.ఈ మేరకు రమేష్ ఒక ప్రకటన విడుదల చేశారు.నకిలీ మద్యం పేరుతో కేసులో ఇరుక్కుపోయారన్నారు.ఈ విషయం నుంచి ప్రజల దృష్టి మరలించడానికి నానా పాట్లు పడుతున్నారన్నారు. నకిలీ మద్యం విషయంలో ప్రజలు ఇప్పటికే ఒక అవగాహనతో ఉన్నారన్నారు,లిక్కరు మంచిదా, నారావారి మార్కు మద్యమా అని ప్రశ్నిస్తున్నారన్నారు.

# కల్తీ మద్యం కేసులో మరొకరి అరెస్టు

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** కల్తీ మద్యం కేసులో దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో మరో అరెస్టు చోటుచేసుకుంది. పోలీసులు చైతన్యబాబు (ఎ22) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చైతన్యబాబు పెద్దతిప్ప సముద్రం మండలంలోని ఆంధ్రా వైన్స్‌లో పని చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. తంబళ్లపల్లె కోర్టులో చైతన్యను ఎక్సైజ్ పోలీసులు హాజరుపరిచారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధన్‌రావు సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ తాజా అరెస్టుతో కేసులో మొత్తం 14 మంది నిందితులు అయ్యారు.

**ప్రభుత్వం లక్ష్యం అసలైన నెట్ వర్కును బట్టబయలు చేయడం:**

నకిలీ మద్యం కేసు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడేలా అక్రమంగా మద్యం తయారీ, సరఫరా జరిగిందనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎవరినీ వదలకుండా, వాస్తవాలు వెలికి తీయాలని స్పష్టం చేసింది. మద్యం తయారీలో పాల్గొన్న సరఫరాదారులు, ఆర్థిక మద్దతుదారులు వంటి వారందరినీ గుర్తించాలన్నది సిట్ ప్రధాన లక్ష్యంగా ఉంది.

# ముగ్గురు ఆర్థికవేత్తలకు నోబెల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ పురస్కారం లభించింది. జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్‌లను 2025 సంవత్సరానికి గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ప్రకటించింది. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వృద్ధిని ఎలా నడిపిస్తాయో వివరించినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. నిరంతర వృద్ధికి కొత్త సాంకేతికత ఎలా దోహదం చేయగలదో వారు వివరించారని పేర్కొంది. గత రెండు శతాబ్దాల్లో చరిత్రలో మొదటిసారి ప్రపంచవ్యాప్తంగా నిరంతర వృద్ధి నమోదైనట్లు స్వీడిష్ అకాడమీ తెలిపింది. పెద్దసంఖ్యలో ప్రజలు పేదరికం నుంచి బయటపడటమే కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు పునాది వేసినట్లు పేర్కొంది. నూతన ఆవిష్కరణలు ప్రపంచ పురోగతికి ఎలా దోహదం చేస్తాయో జోయెల్ మోకిర్, ఫిలిప్, పీటర్ వివరించినట్లు స్వీడిష్ అకాడమీ తెలిపింది. మోకిర్, హోవిట్‌లు అమెరికాకు, అఘియాన్ బ్రిటన్‌కు చెందిన ఆర్థిక నిపుణులు. గత రెండు శతాబ్దాలుగా ప్రపంచం చూస్తున్న నిరంతర ఆర్థిక ప్రగతి వెనుక ఉన్న కీలక సూత్రాలను ఈ ముగ్గురు తమ పరిశోధనల ద్వారా వెలుగులోకి తెచ్చారు. మానవ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కొనసాగుతున్న ఈ వృద్ధి, కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేసి నేటి మన సంపదకు పునాది వేసింది. ఈ ప్రగతికి వెనుక ఆవిష్కరణల పాత్రను అర్థమయ్యేలా చెప్పడమే వీరి పరిశోధనల సారాంశం. ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్ కలిసి 'సృజనాత్మక విధ్వంసం' అనే సిద్ధాంతాన్ని రూపొందించారు. మార్కెట్‌లోకి ఒక కొత్త, మెరుగైన టెక్నాలజీ లేదా ఉత్పత్తి వచ్చినప్పుడు, పాత టెక్నాలజీపై ఆధారపడిన కంపెనీలు దెబ్బతింటాయని వీరు వివరించారు. ఈ ప్రక్రియ ఒకేసారి సృజనాత్మకంగా, అదే సమయంలో విధ్వంసకరంగా ఉంటుందని తెలిపారు. కొత్త ఆవిష్కరణ సమాజాన్ని ముందుకు తీసుకెళితే, పాత పద్ధతులు కనుమరుగవడం వల్ల జరిగే నష్టాన్ని 'విధ్వంసం'గా పేర్కొన్నారు. "ఆర్థిక వృద్ధిని తేలికగా తీసుకోలేమని ఈ విజేతల పరిశోధన స్పష్టం చేస్తోంది. మనం తిరిగి స్తబ్దతలోకి జారిపోకుండా ఉండాలంటే, సృజనాత్మక విధ్వంసానికి ఆధారమైన వ్యవస్థలను కాపాడుకోవాలి" అని ఎకనామిక్ సైన్సెస్ ప్రైజ్ కమిటీ ఛైర్మన్ జాన్ హాస్లర్ తెలిపారు.

# దేశ ప్రగతిలో ఎపి కీలకం

>> అతిథిగా ఆహ్వానించారు.సోమవారం జరిగిన ఈ సమావేశంలో సిఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్‌శేఖర్, అలాగే టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. మోడీతో భేటీకి ముందు ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ, వాణిజ్య శాఖ, సిఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ సిఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులను తీసుకురావడమే కాకుండా, ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెంచుకోవాలి. ఈ వేదిక సరికొత్త ఆలోచనలకు, ఇన్నోవేషన్ భాగస్వామ్యానికి దారితీయాలి" అని అన్నారు. ఈ సదస్సు టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్ నావిగేటింగ్ ది జియోఎకనామిక్ ఆర్డర్ అనే థీమ్‌తో జరగనుంది. మొత్తం 13 సెషన్లు జరుగుతాయి. ఇందులో 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది గ్లోబల్ సిఇఒలు, 40 దేశాల ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అమెరికా, యూరప్, మధ్యప్రాచ్యం, ఆసియా, పశ్చిమాసియా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈ సమ్మిట్ నవ్యాంధ్రప్రదేశ్‌లో నాలుగోసారి జరుగుతోంది. గతంలో 2016, 2017, 2018 సంవత్సరాల్లో విశాఖపట్నం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. ఇప్పుడు నాలుగోసారి అదే నగరంలో జరిగే ఈ సదస్సు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీస్తోంది. చంద్రబాబు అధికారులకు సూచిస్తూ, విశాఖను సుందరంగా తీర్చిదిద్దాలి, విదేశీ అతిథులకు అత్యుత్తమ ఆతిథ్యం ఇవ్వాలి. ఈ సదస్సు ద్వారా ఎపి పెట్టుబడుల గమ్యస్థానంగా నిలవాలి" అని ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఇన్నోవేషన్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా మారుతోందని చంద్రబాబు పేర్కొన్నారు. "గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వంటి గ్లోబల్ టెక్ దిగ్గజ సంస్థలు రాష్ట్రంపై దృష్టి సారిస్తున్నాయి. త్వరలోనే ఎపి కృత్రిమ మేధస్సు, ఇన్నోవేషన్ హబ్‌గా మారుతుంది" అని అన్నారు. సదస్సు ఏర్పాట్లకు సమయం తక్కువగా ఉండటంతో అధికారులు వేగంగా సన్నాహాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సిఐఐ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎపిని గ్లోబల్ ఎకానమిక్ మ్యాప్‌లో ముందుండే రాష్ట్రంగా మార్చాలన్నదే మా లక్ష్యం. టెక్నాలజీ, విశ్వాసం, వాణిజ్య భాగస్వామ్యం ఈ సదస్సు ప్రధాన సూత్రాలు అవుతాయి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సదస్సు రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శిగా, పెట్టుబడుల ప్రవాహానికి వేదికగా నిలుస్తుందని ఆయన నమ్మకంగా చెప్పారు.ఈ బేటీలో భాగంగా ప్రధాని మోడీని సిఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున దుశ్శాలువాతో సత్కరించి.,వెంకటేశ్వరస్వామి ప్రతిమను జ్ఞాపికగా అందజేసారు.

# కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి

>> జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశించింది. 2018 నవంబర్‌లో జారీ చేసిన ఎస్ఐ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో ట్రాన్స్ జెండర్లకు రిజర్వేషన్ కల్పన కాలమ్ లేదు. దీనిపై ట్రాన్స్ జెండర్ గంగాభవానీ 2019లో పిటిషన్ వేశారు. అప్లికేషన్‌లో స్త్రీ, పురుష కాలమ్స్ మాత్రమే ఉంటే, స్త్రీగా ఐచ్ఛికం తీసుకుని అప్లికేషన్ పెడితే రాతపరీక్షలో 35 శాతం మార్కులు సాధించినప్పటికీ తనను అనర్హురాలిగా ప్రకటించారనితెలిపారు. గంగా భవానీ పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టేయడంతో డివిజన్ బెంచ్ వద్ద 2022లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై గతేడాది బెంచ్ విచారించి, గంగాభవానీకి ఉద్యోగ కల్పనపైచర్యలు తీసుకోవాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గంగా భవానీకి ఉద్యోగ వ్యవహారంపై హోంశాఖ ముఖ్య కార్యదర్శి నివేదిక ఇవ్వకపోవడంతో హైకోర్టు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అదనపు ఎజి సాంబశివ ప్రతాప్ వాదిస్తూ, కుమార్ విశ్వజిత్ సెలవులో ఉన్నారని చెప్పారు. ఇన్‌ఛార్జి ముఖ్య కార్యదర్శిగా హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కుమార్ కోర్టుకు హాజరయ్యారని చెప్పారు. తదుపరి విచారణకు హాజరుకావాలని విశ్వజిత్‌ను ఆదేశించిన హైకోర్టు విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

# ఏడు రోజులుగా మార్చురీలోనే పూరన్ కుమార్ మృతదేహం

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** హరియాణాలో ఆత్మహత్యకు పాల్పడిన జైళ్ల శాఖ ఐజి ఎపికి చెందిన పూరన్ కుమార్ మృతదేహం ఏడు రోజులుగా ఛండీఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లోనే వుంది. తన భర్త ఆత్మహత్యకు కారణమైన మాజీ డిజిపి శతృజిత్ సింగ్ కపూర్, రోహ్‌తక్ ఎస్పి నరేంద్ర బిజ్రానియా సహా ఇతరులపై చర్యలు తీసుకునే వరకు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేందుకు అంగీకరించబోయని పూరన్ కుమార్ సతీమణి, సీనియర్ ఐఎఎస్ అధికారిణి అమ్నీత్ కుమార్ స్పష్టం చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఛండీఘడ్ పోలీసులు దీనిపై ఎటూ తేల్చుకోలేక పూరన్ కుమార్ మృతదేహాన్ని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లోనే భద్రపరిచారు. ఈ విషయంలో సర్కారు తదుపరి ఆదేశాల కోసం ఛండీఘడ్ పోలీసులు ఎదురు చూస్తున్నారు. ఈ నెల ఏడవ తేదీన తన సర్వీస్ రివాల్వర్‌తో ఛండీఘడ్‌లోని తన బావమరిది ఇంట్లో పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. పూరన్ కుమార్ ఆత్మహత్యపై స్పందించిన హరియాణా సర్కారు దీనిపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో డిజిపిగా వున్న శతృ జిత్ సింగ్ కపూర్‌ను, రోహ్‌తక్ ఎస్పి నరేంద్ర బిజ్రానియాలను తప్పించి ఇద్దరిని దీర్ఘకాలిక సెలవుపై పంపింది. పూరన్ కుమార్ సతీమణి చెబుతు న్నట్లుగా ఆయన ఆత్మహత్యకు కారకులైన అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తప్పించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే సర్కారు చర్యలపై పూరన్ కుమార్ సతీమణి అమ్నీత్ కుమార్ సంతోషంగా లేరు. వీరిని సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు తెలంగాణ డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క సోమవారం నాడు ఛండీఘడ్ వెళ్లి పూరన్ కుమార్ సతీమణి అమ్నీత్ కుమార్‌ను పరామర్శిం చారు. అనంతరం ఆయన ఛండీఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లో భద్రపరిచిన పూరన్ కుమార్ మృతదేహానికి నివాళులు అర్పించారు.

# సిఆర్‌డిఏ భవనం ప్రారంభం

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.సమీకరణ విధానాన్ని సక్సెస్ చేసిన చరిత్ర అమరావతి రైతులదేనన్నారు. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు.. మనమే ఈ విధానాన్ని తెచ్చాంసక్సెస్ చేశామన్నారు.రాజధాని అమరావతిలో సిఆర్‌డిఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని సిఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. మొదట పూర్ణకుంభం, వేదాశీర్వచనాలతో ఆయనకు వేద పండితులు స్వాగతం పలికారు. భూములిచ్చిన రైతులను సిఎం ఆత్మీయంగా పలకరించారు. భవనాన్ని ప్రారంభించినసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని అన్నారు. రైతుల అవస్థలు చూశానని, రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సిఆర్‌డిఏ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సిఎం మాట్లాడారు. అమరావతి పనుల రీస్టార్ట్‌తర్వాత మొదటిగా సిఆర్‌డిఏ బిల్డింగ్ ప్రారంభమైందన్నారు.ఇది నాకు సంతోషంగా ఉందన్నారు.అమరావతి మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు.అనేక ఉద్యమాలు చేశారన్నారు.రైతుల ఉద్యమానికి మద్ధతుగా నేను కూడా జోలె పట్టాను...ఉద్యమానికి అండగా నిలిచానన్నారు.వారు పడిన కష్టాలు మరిచిపోవద్దు. మీరు చేసిన త్యాగాల ఫలితాలను మీరే అనుభవించాలన్నారు.నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఫేజ్1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారు. భూములిచ్చినందుకు గత పాలకులు మిమ్మల్ని నానా హింసలు పెట్టారు.రాజధాని ఎడారి అన్నారు వేశ్యల రాజధాని అన్నారుఎంతో అపహాస్యం చేశారు.మీకు రెట్టింపు గౌరవం దక్కేలా...రెట్టింపు ఫలాలు అనుభవించేలా మేము చేస్తాం.హైటెక్ సిటీ నిర్మాణం మొదలు పెట్టే నాటికి అక్కడ ఎకరం రూ. లక్ష ఉండేది ఇప్పుడు రూ.177 కోట్లకు చేరింది. అమరావతి ప్రాజెక్టు సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో నిర్మిస్తున్నాం... విమర్శలు చేసే వారంతా ఈ విషయాన్ని గమనించాలన్నారు. అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడ దంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు అవసరమన్నారు. అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుంది.రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలుసాధిస్తారు.అమరావతి అభివృద్ధికి ఆటంకాలు లేవన్నారు.అమరావతిని క్వాంటంవ్యాలీ చేస్తున్నాం. అమరావతి రైతుల అభివృద్ధికి అండగా ఉంటాం. ఒకసారి జరిగిన తప్పుకు రైతులు, నేను, రాష్ట్రం ఎంత నష్టపోయిందో అందరికీ తెలుసు.మళ్లీ అలాంటి తప్పులు జరగకూడదు.కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి.పవన్ కల్యాణ్, బిజెపిలతో కలిసి ముందుకెళ్తున్నాం మీరంతా సహకరించాలి అన్నారు.



సోమవారం సిఆర్‌డిఏ భవనాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు

## వారం - వర్జ్యం

14-10-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
అష్టమి ఉ.11.13
పునర్వసు ఉ.11.58
వర్జ్యం : రా.7.59-9.36
దు.ఉ.8.22-9.09,
2) రా.10.31-11.18
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** అనుకూల ఫలితాలు అధికంగా ఉండటం వలన చెప్పుకోదగిన ఇబ్బందులు ఉండవు.

**వృషభం:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. సంబంధబాంధవ్యాలు మెరుగ్గా ఉంటాయి.

**మిథునం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు తొలగుతాయి. ప్రయాణాలు.

**కర్కాటకం :** అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాహనాలు, స్థలాలు కొనుగోలు.

**సింహం:** దూరపు బంధువులను కలుసుకొని ఉల్లాసంగా గడుపుతారు.

**కన్య :** సమస్యల నుండి బయటపడతారు. ఉద్యోగలకు బదిలీలు వుంటాయి.

**తుల :** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు.

**వృశ్చికం:** కుటుంబ పురోభివృద్ధి, సంఘంలో గౌరవమర్యాదలు పెంపొందుతాయి.

**ధనుస్సు:** స్పెక్యులేషన్ లాభించదు. వృత్తి ఉద్యోగ వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

**మకరం:** కార్యాలయంలో సెలవు కోసం మీరు చేసే యత్నాలు ఫలవంతం కాకపోవచ్చు.

**కుంభం:** మధ్యవర్తిత్వాలు చేయకండి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**మీనం :** ఇతరుల సలహాలు అతిగా స్వీకరిస్తారు. కానీ మీ మనస్సుకు తోచిన పనులనే చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం ఇజ్రాయెల్ పార్లమెంటులో ట్రంప్‌కు జయజయధ్వానాలు చేస్తున్న ఎంపీలు

# ఇక తుపాకులు పేలవు..

## మారణహోమం అంటూ పలువురు ఎంపీల నిరసన

## ట్రంప్‌కు అత్యున్నత పురస్కారాలు అందించిన ఇజ్రాయెల్, ఈజిప్టు

## 20 మంది బందీలను విడుదల చేసిన హమాస్

## ఇజ్రాయెల్ జైళ్లనుంచి 2 వేల మంది ఖైదీల విడుదల

**టెల్‌అవీవ్, అక్టోబర్ 13:** ఇజ్రాయెల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో తాము విజయం సాధించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న ఆయన ఆ దేశ చట్టసభలో మాట్లాడుతూ, "థ్యాంక్యూ వెరీమచ్ బేబీ, గొప్ప పని చేశావ్" అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రశంసించారు. మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఆరంభమవుతోందని, ఈ పవిత్ర భూమిలో శాంతి నెలకొనడంతో ఆకాశం నిర్మలంగా మారిందని అన్నారు. ఈ ప్రాంతంలో తుపాకులు మూగబోయాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైందని, బందీలు తిరిగి రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో తాము సమయం వృథా చేస్తున్నామని చాలామంది అభిప్రాయపడ్డారని, కానీ చివరకు విజయం సాధించామని ట్రంప్ అన్నారు. అమెరికా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఆయన భరోసా ఇచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, ఆయన సలహాదారు జేర్డ్ కుష్నర్ కీలక పాత్ర పోషించారని ట్రంప్ కొనియాడారు. ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. "మారణహోమం" అంటూ నినాదాలు చేయడంతో వారిని సభ నుంచి బయటకు పంపించేశారు. ఈ నిరసనలపై సభాపతి ట్రంప్‌కు క్షమాపణ చెప్పారు.

**ఈ ప్రపంచానికి మరింత మంది ట్రంప్‌లు కావాలి**

ఇజ్రాయెల్ చట్టసభ సభ్యులు లేచి నిలబడి, చప్పట్లు కొడుతూ, ట్రంప్‌నకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ట్రంప్ లాంటి నేతలు ఈ ప్రపంచానికి మరింత మంది కావాలని కొనియాడారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో స్పీకర్ అమీర్ ఒహానా డొనాల్డ్ ట్రంప్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. "జెరూసలేంకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు స్వాగతం. తాము ఈ రోజు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ట్రంప్ కేవలం మరొక అమెరికా అధ్యక్షుడు కాదు. ఆయన యూదుల చరిత్రలోనే ఒక గొప్ప దిగ్గజం. ఆయన సైరస్ ది గ్రేట్‌తో సమానం. నేటి ప్రపంచానికి కావాల్సింది ధైర్యవంతులు, బలవంతులు, దృఢ నిశ్చయం ఉన్న నాయకులు. అలాంటి లక్షణాలు ఉన్న వ్యక్తే ట్రంప్. ఆయన లాంటి నేతలు మరింత మంది ఈ ప్రపంచానికి అవసరం" అని ఇజ్రాయెల్ పార్లమెంట్ స్పీకర్ అమీర్ ఒహానా అన్నారు. దీనిపై ట్రంప్ తనదైన రీతిలో స్పందించారు. "ఇది నాకు దక్కిన గౌరవం" అని అన్నారు.

**డెడ్లీ వార్నింగ్‌తో...**

సుదీర్ఘకాలంగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య గాజా స్ట్రిప్‌లో యుద్ధంజరుగుతోంది. దీనిని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 21 సూత్రాలతో ఒక శాంతి సూత్రాన్ని రూపొందించారు. దీనిని భారత్, చైనా, రష్యాల సహా పలు ముస్లిం దేశాలు సమర్థించాయి. శాంతి ఒప్పందంలో భాగంగా హమాస్, తన చెరలోని బందీలు విడుదలచేయాలని, ఇజ్రాయెల్‌లో ఉన్న 2వేలకుపైగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేయా లని ట్రంప్ సూచించారు. అంతేకాదు నెతన్యాహూను ఈశాంతి ఒప్పందానికి అంగీకరించేలా చేశారు. మరో వైపు, హమాస్‌కుకూడా డెడ్లీవార్నింగ్ఇచ్చారు. ఒకవేళ ఈ ఒప్పందాన్నిఅంగీకరించకపోతే, హమాస్‌కు నరకం చూపిస్తానని దిమ్మదిరిగేలా బెదిరించారు. దీనితో హమాస్‌దిగివచ్చి, ఒప్పందానికి అంగీకారం తెలిపింది.

**ట్రంప్‌కు ఇజ్రాయెల్, ఈజిప్టు అత్యున్నత పౌర పురస్కారాలు**

గాజా శాంతి ఒప్పందం కుదిర్చి, బందీల విడుదలకు కృషి చేసినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇజ్రాయెల్, ఈజిప్టు దేశాలు అరుదైన గౌరవాన్ని అందించనున్నట్లు ప్రకటించాయి. ఇజ్రాయెల్ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన "ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఆనర్"ను అమెరికా అధ్యక్షుడికి ప్రదానం చేయనున్నట్లు మాస్కో అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ వెల్లడించారు. ఈజిప్టు 'ది ఆర్డర్ ఆఫ్ ది నైల్' అవార్డును ఇవ్వనున్నట్లు అధ్యక్ష కార్యాలయం పేర్కొంది. బందీల విడుదల, చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని సాధించడంలో చేసిన కృషికి గాను ఈ గౌరవాన్ని అందుకోవడానికి ట్రంప్ అర్హుడని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ తెలిపారు. రానున్న నెలల్లో సమయం, వేదిక నిర్ణయించి ఇస్తామని పేర్కొన్నారు.

**బందీలను విడుదల చేసిన హమాస్**

మరోవైపు 20 మంది ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేసింది. తొలి విడతగా ఏడుగురిని విడుదల చేసిన కొద్దిసేపటికే మరో 13మంది విడుదల చేసింది. హమాస్ విముక్తి కల్పించిన వారిని రెడ్‌క్రాస్‌కు చెందిన బస్సుల్లో ఇజ్రాయెల్ సరిహద్దుల వరకు తీసుకెళ్తుండగా అక్కడి నుంచి హెలికాప్టర్లలో ఇజ్రాయెల్ సైన్యం తమ దేశానికి తీసుకెళ్లి చికిత్స అందిస్తోంది. రెండేళ్లుగా నరకయాతన అనుభవించిన తమ వారు విడుదలవడంతో కుటుంబసభ్యులు, శ్రేయాభిలాషుల్లో సంతోషం నెలకొంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను మొత్తం 2వేల మంది బందీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది.

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీ

>> షుల మరియు మహిళల విభాగాల్లో పోటీలు జరుగుతాయి. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్ యూ) గుంటూరులోను, యోగా పోటీలు వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) అమరావతిలో జరుగుతాయి. 32 జట్లకు చెందిన 1010 మంది క్రీడాకారులు ఈ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ లో పాల్గొంటున్నారు.ఈ పోటీలు సందర్భంగా హోం మంత్రి శ్రీమతి అనిత మాట్లాడుతూ.ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం క్రీడలకు పెద్దపేట వేస్తుందన్నారు.అమరావతి కేంద్రంగా నిర్మిస్తున్న " స్పోర్ట్స్ సిటీ"కి ఈ పోటీలు స్ఫూర్తిగా నిలిచి, భవిష్యత్తుల్లో నిర్వహించబోయే జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలుస్తాయన్నారు. పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ లతో పాటు యోగాకు కూడా ఈ పోటీల్లో ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. ఇటీవల విశాఖలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 3,20,000 మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి గిన్నీస్ వరల్డ్ రికార్డు నెలకొల్పిందన్నారు. యోగ మన సంస్కృతిలో, దైనందిన జీవితంలో భాగమైందన్నారు. శారీరక దృఢత్వానికి మరియు మానసిక స్థైర్యానికి ప్రతీకలుగా నిలిచే వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ మరియు యోగా వంటి క్రీడలు పోలీసు శాఖలో స్ఫూర్తిని నింపే అంశాలన్నారు.

# గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు!

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ అడుగులు వేస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 1859ని విడుదల చేసింది. ఉద్యోగుల ప్రమోషన్లు, వారి సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించింది. మంత్రివర్గ ఉపసంఘంలో సభ్యులుగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, పయ్యావుల కేశవ్, పి నారాయణ, సత్యకుమార్ యాదవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, తదితరులు ఉన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VIZAG
"e" Procurement Tender Notice
No. 1/2025-26/SE(P)/EE-(PD-I)/DB/GVMC.10.10.2025
Number of works 02, Value of works Rs. 4.00 Crores
Tender Opening Dt. 13.10.2025, Closing Date. 28.10.2025
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE(PD-I) Cell No. 9848308824 For Commissioner,GVMC

VIZIANAGARAM MUNICIPAL CORPORATION
e-Proc.short NIT No.1269/34/E/TO/2025-26, Dt.10-10-2025
Engaging of Electrician, Helpers, Manning Operation and Maintanance of Mushidipalli Head Water works, Engaging of Van, CC Road, Engaging of Un-Skilled Labour, Security guards, Precast Prestressed Concrete Compound Walls under General funds Est Cost Rs. 248.54 Lakhs

| | |
|---|---|
| Download start date & time | Dt.14-10-2025 from 3.30 P.M. |
| Download end date & time | Dt.29-10-2025 upto 3.30 P.M. |
| Bid Submission Closing Date&Time | Dt.29-10-2025 upto 4.00 P.M. |
| Bid opening date & time | Dt.29-10-2025 upto 4.30 P.M. |

Contact Nos. 9849908295, 9849907020.
Further details can be seen at www.apeprocurement.gov.in
For COMMISSIONER



రైతులు,ఇతరులతో చంద్రబాబు సమూహ ఛాయా చిత్రం

# అమరావతి రైతుల త్యాగాలు మరువను :సిఎం చంద్రబాబు

## - రైతులను సత్కరించిన ముఖ్యమంత్రి

**విజయవాడ,అక్టోబరు 13,పభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబు అన్నారు. రైతుల అవస ్థలు చూశానని...రోడ్కెక్కి ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సిఎం మాట్లాడారు. 'ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం ప్రారభమైంది.'ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సిఆర్డీఏ భవనం ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ,ప్రైవేటు భవనాలు వస్తాయి.భూములిచ్చిన రైతులను ఆయన వేదికపై సత్కరించారు.వారితో సమూహ ఛాయా చిత్రం దిగారు.ఇదొక అనుభూతే కాదు,మీ త్యాగాలను భవిష్యత్తు తరలాలకు తెలిపే మహోన్నత చరిత్ర పుటల్లో నిలిచే సాక్ష్యమని చంద్రబాబు వ్యాఖ్యానించారు.రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితి రాజధాని ఎక ్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత ్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా...ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం.అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం.రాజధాని నిర్మాణానికి భూములు ఇచ ్చేందుకు రైతులు స్వచ్ఛంధంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది. ఒక్క అమరావతిలోనే గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారు' అని చంద్రబాబు అన్నారు. రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురికి చంద్రబాబు భాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,మంత్రి నారాయణ, ఎంఎల్ఏ శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సిఎం ఆదేశించారు. అమరావతిలోని సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయ భవనం ప్రతిష్టాత్మకమైన నెట్ జీరో ఎనర్జీ(డిజైన్) ధృవపత్రం సాధించింది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీ ఎస్) ప్రతినిథులు ఈ అవార్డును ఆదివారం ఏపీ సీఆర్డీఏ కమీషనర్ కన్నబాబుకు ప్రదానం చేశారు. అమరావతిలో ఈ తరహా గుర్తింపు పొందిన తొలి భవనంగా సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం నిలవడం విశేషం. వార్షిక విద్యుత్ అవసరాలన్నింటినీ పునరుత్పాదక శక్తి వనరుల ద్వారా సమకూర్చుకునేలా ఈ భవ నాన్ని రూ పొం దిం చా రు. దీని కోసం 540 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టంను అమర్చారు. మిగిలిన అవసరాల కోసం పునరుత్పాదక శక్తి వనరుల సమర్థ వినియోగం ద్వారా పూర్తి స్థాయిలో నెట్ జీరో ఎనర్జీ' సాధించింది. ఈ సందర్భంగా కమీషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ...ఈ గుర్తింపు పర్యావరణ

## 15 నుంచి హుబ్లీ - గుంతకల్లు మెమో పాసింజర్



**గుంతకల్లు రైల్వే , అక్టోబర్ 13, ప్రభాత వార్త:** ప్రస్తుతం హుబ్లీ గుంతకల్లు హుబ్లీ మధ్య తిరిగే పాసింజర్ రైలుకు ఈనెల 15 అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెమో బోగీలతో నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. ప్రతి రోజూ నైరుతి రైల్వే హుబ్లీదక్షణ మధ్య రైల్వే గుంతకల్లు మధ్య తిరిగే నెంబర్ 56911/12 పాసింజర్ రైలుకు ఈనెల 15 నుంచి అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెయిన్ లైన్ ఎలెక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (మెమో) బోగీలతో నడుపుతున్నట్లు తెలిపారు.

## సమాచార పౌర సంబంధాల సంచాలకుడుగా కె.ఎస్. విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం



**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులుగా కె.ఎస్. విశ్వనాథన్ బాధ్యతలు స్వీకరించారు.సోమవారం ఉదయం ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ లో గల సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సమాచార శాఖ సంచాలకులుగా ఉన్న హిమాన్షు శుక్లా శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా నెల్లూరు కలెక్టర్ గా ప్రభుత్వం బదిలీ చేసిన అనంతరం ప్రఖర్ జైన్ కు సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ గా ఉన్న కె.ఎస్. విశ్వనాథన్ ను సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతం లో ఆయన అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ గా, నరసాపురం సబ్ కలెక్టర్ గా, ప్రకాశం, విశాఖపట్టణం జిల్లాల జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్ కు సమాచార శాఖ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాఖ కార్యకలాపాలు, నిర్వర్తిస్తున్న విధులపై అధికారులతో నూతన సంచాలకులు

# గిరిజన విద్యార్థినిల మృతిపై ఎన్ హెచ్ ఆర్ సి కి ఫిర్యాదు

### అరకు ఎంపి ఆధ్వర్యంలో గిరిజన మాజీ ఎమ్మెల్యేలు

**కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా), అక్టోబర్ 13 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం కురుపాం కేంద్రంగా ఉన్న రెండు గిరిజన పాఠశాలల్లో పచ్చకామెర్ల వ్యాధితో ఇద్దరు మృతి చెంది వందల సంఖ్యలో వ్యాధితో గిరిజన విద్యార్థినిలు ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ మెరుగైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కనుక వెంటనే చర్యలు తీసుకోవాలని ఢిల్లీలో ఎన్ హెచ్ ఆర్ సి ఛైర్మన్‌కి ఫిర్యాదు చేశారు. సోమవారం ఢిల్లీలో గల నేషనల్ హ్యూమన్ రైట్స్ ఛైర్మన్‌కు అరకు ఎంపీ తనుజారాణి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ గిరిజన మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఉప ముఖ్యమంత్రిలు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లా కురుపాం మండలంలో గల గురుకుల పాఠ శాలలో కల్పన, అంజలి అనే గిరిజన విద్యార్థినిలు మృతి చెందారని, ఇప్పటికీ విశాఖ కేజి హెచ్, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్ర ఆస్ప త్రిలోనూ, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం లోనూ చికిత్స పొందుతున్నారని అన్నారు. అంతేకాకుండా గురుకుల సమీపంలో గల ఏకలవ్య పాఠశాలలో కూడా సుమారు 30 మంది వరకు వ్యాధి సోకి ఆసుపత్రి పాలయ్యారని అన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం చేయించటంలో చర్యలు చేపట్టలేదని వారు ఫిర్యాదుల పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి కాలుష్యం అవ్వడం, మలం నీరు కలవడం వలన వ్యాధి విద్యార్థులందరికీ వ్యాపిస్తుందని వారు పేర్కొన్నారు. చనిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు నష్టపరిహారమైనా చెల్లించలేదని వారు అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఛైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. విద్యార్థినిలకు ఇలా జరగడం దురదృష్టకరమని విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్ హెచ్ ఆర్ డి ఛైర్మన్ స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తనుజా రాణి, పుష్ప శ్రీవాణి, రాజన్నదొర, పార్వతీపురం మన్యం జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు పరీక్ష రాజ్, అరకు పార్లమెంట్ పరిధిలో గల ఎమ్మెల్యేలు, మాజీ గిరిజన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అమరావతి షాపింగ్ ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ,అక్టోబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ 2025 నేటి నుంచి 19వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ ్మశ కలెక్టర్ కార్యాలయంలో వివిధ మోటారు వాహనాల షోరూముల యజమానులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. షాపింగ్ ఫెస్టివల్ కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. జీఎస్టీ సంస్కరణల ఫలాలు ఇటు వినియోగదారులకు అటు వ్యాపార, వాణిజ్య సంస్థలకు అందేలా ప్రత్యేక ప్రచారంతో అవగాహన కార్యక్రమాలతో పాటు వివిధ వినూత్న కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ లో స్టాళ్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మోటార్ వాహనాలకు సంబంధించి తగ్గిన జీఎస్టీ వివరాలను స్టాళ్లలో ప్రదర్శించడంతోపాటు బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు.సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అలీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ లక్ష్మీ ్మశ.. కార్లు, బైకులు, ఆటోలు తదితర వాహనాల షోరూంల యజమానులు, ప్రతినిధులతో కలిసి గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమష్టి భాగస్వామ్యంతో ఫెస్ట్ ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీ ్మశ మాట్లాడుతూ వాణిజ్యం, వినోదానికి వేదికగా నిలిచే షాపింగ్ ఫెస్టివల్‌లో వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, హస్తకళాకారులు.. ఇలా వివిధ వర్గాలవారు తమ స్టాళ్లను ఏర్పాటుచేసుకొని బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు జీఎస్టీ ప్రయోజనాలు కల్పించడంతో పాటు దీపావళి పండగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, రాయితీలు ప్రకటిస్తాయన్నారు. మెగా లక్కీ డ్రాలతో పాటు ఉత్తమ స్టాళ్లకు అవార్డులు కూడా అందించనున్నట్లు వెల్లడించారు. దాదాపు 100 స్టాళ్లతో ఏర్పాటుచేసే ఈ ఫెస్ట్‌లో జీఎస్టీ సంస్కరణల ఫలాలపై మేధోమథన చర్చలు, సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ భాగస్వాములై ఈ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని, స్థానిక వ్యాపారులు, ప్రజలు ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీ ్మశ కోరారు...సూపర్ జీఎస్టీతో ప్రతి కుటుంబానికి రూ. 12 వేల వరకు ఆదా.. సూపర్ జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు దాదాపు రూ. 8 వేల కోట్లు, జిల్లా ప్రజలకు రూ. 250 కోట్లు రూ. 300 కోట్లు ఆదా అవుతుండగా ప్రతికుటుంబానికి నెలకు రూ. 6 వేలు నుంచి రూ. 12 వేల వరకు ఆదా అవుతుందని కలెక్టర్ లక్ష్మీ ్మశ వివరించారు. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉండగా జీఎస్టీ 2.0 సంస్కరణలతో అది 18 శాతానికి తగ్గిందన్నారు. సోలార్ వాటర్ హీటర్లు, కుట్టు మిషన్లు, వాకీటాకీలపై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ నేడు 5 శాతానికి తగ్గిందని.. అదేవిధంగా సబ్బులు, టూత్‌పేస్టులు, వంటనూనెలు, డిటర్జెంటులు వంటి నిత్యావసర ఎఫ్ఎంసీజీ వస్తువులపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా అది 5 శాతానికి తగ్గిందని వివరించారు. బీమా, ఆరోగ్య పాలసీలపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా అది నేడు సున్నా శాతం అయిందన్నారు. హస్తకళల ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్‌పై 12 శాతం ఉన్న జీఎస్టీ అయిదు శాతానికి తగ్గిందని.. మిక్సీలు, కుక్కర్లు, గ్రైండర్లు, ఫ్యాన్లు వంటి వస్తువులపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉంటే అది అయిదు

## ఖరీఫ్‌లో 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు లక్ష్యం

### : ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు

**సచివాలయం,అక్టోబర్ 13,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఈఏడాది ఖరీఫ్‌సీజన్‌లో భారత ప్రభుత్వం ద్వారా 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని భారత ఆహార సంస్థ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ ఛైర్మన్,పార్లమెంట్ సభ్యులు,లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు.నగరంలోని పటమట యనమలకుదురు రోడ్డులోని భారత ఆహార సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో భారత ఆహార సంస్థ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు పండించిన ప్రతిగింజను కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గత ఏడాది ఖరీఫ్‌లో 15.92లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సంస్థ ద్వారా కొనుగోలు చేశామన్నారు.ఈ ఏడాది ఖరీఫ్‌లో 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినట్లు తెలిపారు.ఎఫ్‌సీఐ నుంచి పంజాబ్ రాష్ట ్రం తర్వాత 14లక్షల టన్నుల బియ్యాన్ని 10శాతం బ్రోకెన్‌తో సేకరించడానికి అనుమతి ఉన్న రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు.రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయని దాంతో పంట దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందని,దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# రాష్ట్రంలో ట్రాన్స్‌కోను మరింత బలోపేతం చేయడమే లక్ష్యం

### నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం - జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

**విజయవాడ, అక్టోబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం నాణ్యమైన, నమ్మకమైన, నిరంతర విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపిట్రాన్స్‌కో) నిరంతర అభివృద్ధికి, సంస్థను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఏపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. ఏపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సోమవారం స్థానిక విద్యుత్ సౌధలో బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం కోసం ఏపిట్రాన్స్‌కో అనేక ఉత్తమ పద్ధతులను అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది అందరి సమిష్టి కృషితో ఏపిట్రాన్స్‌కో దేశంలోనే అగ్రభాగాన నిలుస్తుందని, ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,



ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్‌లు తనపై విశ్వాసం ఉంచి ఈ బృహత్తర బాధ్యతలు తనకు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇంధన రంగ లక్ష్యాలను సాధించేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఏపిట్రాన్స్‌కో అభివృద్ధికి ఉద్యోగులందరి సహకారం, టీమ్ వర్క్ ప్రధాన బలంగా ఉంటాయని ఆయన పేర్కొంటూ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది అందరూ సమిష్టిగా, కొత్త ఉత్సాహంతో కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ రంగంలో సేవ చేయడం ఒక గొప్ప అవకాశం గా భావిస్తున్నానని, రాష్ట్ర అభివృద్ధి కి అనుగుణంగా విద్యుత్ ప్రసార, మౌలిక సదుపాయాల పురోగతికి కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఏపిట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏ కె వీ భాస్కర్ , జె వీ రావు , ఎన్ వీ రమణ మూర్తి , ఏ పీ ట్రాన్స్కో అడిషనల్ సెక్రటరీ పెద్ది రోజా, విద్యుత్ సంస్థల సీనియర్ అధికారులు, సిబ్బంది ప్రవీణ్ చంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇక ప్రవీణ్ చంద్ 2019 బ్యాచ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) అధికారి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆయన ఐఐటీ పాట్నా నుండి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బాచిలర్ డిగ్రీ పొందారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష 2018లో ఆల్ ఇండియా 64వ ర్యాంక్ సాధించి 27 ఏళ్ల వయసులో ఐఏఎస్‌గా చేరారు. తన సర్వీస్ లో అనేక కీలక పదవులను నిర్వర్తించారు అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనింగ్ లో), మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ శాఖలో అండర్ సెక్రటరీ, విజయవాడ సబ్ కలెక్టర్, కడప మునిసిపల్ కమిషనర్, ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీసీఆర్డీఏ) అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ ఏపీ ట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గా నియమితులయ్యారు.

# తిరుమల సమాచారం

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.1.05కోట్ల విరాళం



**తిరుమల,అక్టోబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళా లందించి అవసరమైన వారికి సేవలందిం చేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఉచిత అన్నప్రసాదం ట్రస్ట్‌కు గుంటూరుకు చెందిన అభయహస్త ఫైనాన్స్ సర్వీసెస్ సిఎఫ్ఓ సింహాద్రి వెంకట శివప్రసాద్ 10,00,116 రూపాయలు విరాళాల డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. సోమవారం సాయంత్రం ఈ విరాళాలను టిటిడి బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, జంగా కృష్ణమూర్తితో కలసి దాత అందించారు. అలాగే టిటిడి ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన ఏడిఓ ఫౌండేషన్ ఎన్జీఓ సంస్థ 75లక్షల రూపాయలు డిడిని ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. టిటిడి బర్డ్ ట్రస్ట్‌కు బెంగుళూరుకు చెందిన ఎం. రాకేశ్‌రెడ్డి టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కలసి 10లక్షలు రూపాయలు డిడి అందజేశారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వేడివిజన్ సాధనసమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ ఎస్వీ విద్యాదానం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు చెక్కును అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా దాతల ఉదారతను టిటిడి అభినందించింది.

## 'తుంబురుతీర్థం'లో నిరంతర పుణ్యస్నానాలెప్పుడో?

### - సకల పాపాలు తొలగిపోతాయని విశ్వాసం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** శేషాచలంకొండల్లో వెలసిన కలియుగవైకుంఠం తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రంలో మూడున్నరకోట్ల పుణ్యతీర్థాల్లో తుంబురుతీర్థం పుణ్యస్నానాలకు సాధారణ రోజుల్లోనూ భక్తులను అనుమతించే విషయంపై చర్చ మొదలైంది. ఈ పుణ్యతీర్థం తిరుమల రిజర్వుఫారెస్ట్ పరిధిలో ఉండటంతో సాధారణ రోజుల్లో భక్తులను అనుమతించడంలేదు. సప్తగిరులపై ప్రకృతి సిద్ధంగా వెలసిన తీర్థాలలో ఏడుతీర్థాలు అత్యంత పవిత్రమైనవిగా ధర్మ,జ్ఞాన, భక్తి,వైరాగ్య ముక్తి ప్రదాయాన్ని కలిగిస్తాయని ప్రగాఢ విశ్వాసం. శ్రీవారిపుష్కరిణి, రామకృష్ణ తీర్థం, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, తుంబురుతీర్థం,పాండవతీర్థం ఈ పుణ్యతీర్థాల్లో ఏడాదికోసారి మాత్రమే కొన్ని పుణ్యఘడియలు ప్రవేశిస్తాయి. ఈ సమయాల్లో ఆయా తీర్థాల్లో ముక్కోటి ఉత్సవాలు నిర్వహించి ,భక్తులు స్నానాలాచరించేలా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తారు. తుంబురుతీర్థంలో స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగి ముక్తికలుగుతుందని భక్తుల విశ్వాసం. ఇదే ప్రగాఢనమ్మకంతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అటవీశాఖ అధికారులతో కలసి రెండునెలల ముందు తుంబురుతీర్థం పర్యటించారు. ఈ తీర్థంలో ఉన్న సదుపాయాలు, సాధారణ రోజుల్లోనూ భక్తులను అనుమతించి పుణ్యస్నానాలాచరించేలా చూస్తే ఎలా ఉంటుందనే కోణంలో ఆరా తీశారు. తుంబురుతీర్థ ముక్కోటి మార్చి,ఏప్రిల్ నెలల్లో పాల్గుణ పౌర్ణమి, చైత్ర పౌర్ణమి రోజుల్లోమాత్రమే అనుమతించడం వల్ల చాలామంది భక్తులు తుంబుతీర్థంను సందర్శించలేకపోతున్నారని తెలుసుకున్నారు. ఆ రెండుప్రత్యేక రోజుల్లో సుమారుగా 25వేల మంది వరకు భక్తులు ఈ తీర్థంలో పవిత్ర స్నానాలాచరిస్తారు. రిజర్వుఫారెస్ట్‌లో ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టిటిడి పెద్దఎత్తున ఏర్పాట్లుచేస్తుంది. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, మజ్జిగ,తాగునీరు, వైద్యశిబిరాలు వంటివి సౌకర్యాలు కల్పిస్తారు. తీర్థానికి చేరుకునేందుకు సులభంగా అవసరమైన నిచ్చెనలు,తాగునీటి కొళాయిలు ఏర్పాటుచేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులైన ఆస్తమా, స్థూలకాయం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారిని తీర్థానికి అనుమతించరు. ఈ నేపథ్యంలో తిరుమలలో పాపవినాశనం జలాశయాంలో ప్రతిరోజూ భక్తులు స్నానమాచరించినట్లే తుంబురుతీర్థంకు అనుమతించే విషయంపై స్వయంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో టిటిడి అధికారులు, అటవీశాఖ నుండి ఎలాంటి సహకారం, అనుమతులు లభిస్తాయనేది కూడా చూడాల్సి ఉంది. తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తరదిక్కున ఉన్న తుంబురుతీర్థంలో స్నానం చేయడం వల్ల పుణ్యం కలుగుతుందని విశ్వాసానికి టిటిడి సహకారం అందిస్తుందనే భక్తులు ఆశిస్తున్నారు.

## అందుబాటులోకి టిటిడి క్యాలెండర్లు, డైరీలు



**తిరుమల,అక్టోబర్ 13ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి సంబంధించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ముద్రించిన 2026 నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలు భక్తులకు అందు బాటులోకి వచ్చాయి. వీటిని గతనెల 24వతేదీ సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించిన విషయం విదితమే. ప్రస్తుతం తిరుమల,తిరుపతితోబాటు హైదరాబాద్, విజయవాడ,విశాఖపట్నం, హిమాయత్ నగర్, న్యూఢిల్లీ,ముంబై, బెంగుళూరు, వేలూరు,చెన్నైలతోబాటు ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరులోని టిటిడి కల్యాణమండపాల్లో టిటిడి నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. 12పేజీలు క్యాలండర్, ఆరపేజీల క్యాలండర్, టేబుల్ టాప్ క్యాలండర్, డీలక్స్‌డైరీలు, పెద్దడైరీలు ఇలా స్వామివారి ప్రతిమల క్యాలండర్లు కొనుగోలుచేసుకునే అవకాశం కలిగింది. టిటిడి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా భక్తులు బుక్‌చేసుకునే సదుపాయం టిటిడి కల్పించింది. ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకున్న వారికి తపాలశాఖ ద్వారా ఇంటివద్దే టిటిడి డైరీలు, క్యాలండర్లు అందజేయబడుతాయి. "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తిరుమల.ఓఆర్‌జి,టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

## చిరుతలొస్తున్నా పట్టించుకోవడం లేదు

### - బోనులు ఏర్పాటుచేయాలని విద్యార్థుల ఆందోళన

**తిరుపతి,అక్టోబర్13ప్రభాతవార్తప్రతినిధి:** అలిపిరి అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న తిరుపతిలోని శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయం, వేదవిశ్వవిద్యాలయం, స్విమ్స్ ఆస్పత్రి ప్రాంగణాల్లో తరచూ చిరుతపులుల సంచారం ఎక్కువైంది. చీకటిపడితే చిరుతపులులు రెండు మూడు సంచరిస్తున్నట్లు విశ్వవిద్యాలయాల విద్యార్థులు చెబుతూన్నారు. సిసికెమెరాల పుటేజీల్లో స్పష్టంగా చిరుతల జాడ కనిపిస్తున్నా అటవీశాఖ అధికారులుగానీ, విశ్వవిద్యాలయం భద్రత సిబ్బంది తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. గత రెండునెలల క్రిందట నుండి అలిపిరి -జూ పార్కు మార్గంలోని అడవినుండి చిరుత పులులు ఎస్వీయూనివర్సిటీ హాస్టల్స్ వద్ద, ఎస్వీఆరవింద్ కంటి ఆస్పత్రి పరిసరాల్లో, స్విమ్స్ ఆస్పత్రి పరిసరాల్లో, వేదవిశ్వవిద్యాలయం పరిసరాల్లో సంచరిస్తున్నాయి. అలిపిరి మార్గంలో ఇద్దరు టిటిడి ఉద్యోగులపై దాడికి ప్రయత్నించాయి. తృటిలో వాళ్ళు తప్పించుకోవడంతో ప్రాణాలుతో బయటపడ్డారు. ఇటీవల ఎస్వీయూ ప్రాంగణంలో బోన్లు ఏర్పాటుచేసి ఒక చిరుతను బంధించి అడవిలో వదలి పెట్టారు. మళ్లీ అదే చిరుత సంచరిస్తున్నదనే భయం విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
"e" Procurement Tender Notice
No. 1/2025-26/SE(P)/EE-(PD-I)/DB/GVMC.10.10.2025
Number of works 02, Value of works Rs. 4.00 Crores
Tender Opening Dt. 13.10.2025, Closing Date. 28.10.2025
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE(PD-I) Cell No. 9848308824 For Commissioner,GVMC

వార్త

నిరంతరం జీవిత క్రమంలో పాత విషయాలు మరిచి కొత్త విషయాలు గ్రహిస్తూ జీవించేవారికి మృత్యుభయం ఉండదు.

-రోజర్

# ఆరోగ్యశ్రీ సేవలకు అనారోగ్యం!


తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ లేదా ఆరోగ్యశ్రీ రోగుల సేవలకు ఆయా ఆరోగ్య సంస్థలు మొండికేస్తున్నాయి. ప్రభుత్వ ప్యాకేజీలకులోబడి తమకు గిట్టుబాటు కాకున్నా అన్ని ఆరోగ్యసేవలను సజావుగా చేస్తూ 'మేముసైతం' అనుకుంటున్న కార్పొరేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి బకాయిలు అందడం లేదు. తమవద్దకు నేరుగా వచ్చే రోగులకు తాము నిర్దేశించుకున్న మేరకు ఫీజులు, వైద్యసేవలు వగైరా ఎంతైనా తీసుకోవచ్చు. దాని మీద ఎలాంటి అదుపు లేదు. కానీ ప్రభుత్వం కేటాయించిన ఉద్యోగులకు, జర్నలిస్టులకు దారిద్ర్య రేఖకుదిగువనున్న కుటుంబాల కోసం ప్రత్యేకించి ప్రభుత్వం అందచేస్తున్న ఏరకమైన కార్డులైనా ప్రభుత్వ నిర్దేశిత ప్యాకేజీ మాత్రమే బిల్లింగ్ చేయాలి. అంతకన్నా పైసా ఎక్కువ వసూలు చేయరాదు. ఆ బిల్లులు అందచేసిన తర్వాత ఎప్పటికో కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయదు. దాంతో కార్పొరేట్ ఆస్పత్రులు నడిపేందుకు నిధుల్లేవని డీలా పడిపోతున్నాయి. చివరాఖరుకు తాము పేదల వైద్యానికి దూరమని తేల్చి చెప్పేస్తున్నాయి. వైద్య సేవలకు ఆరోగ్య శ్రీ ఎన్టీఆర్ వైద్యసేవ అని ఏ పేరిట అందిస్తున్నా చికిత్సల బిల్లుల విషయంలో 800 కార్పొరేట్ ఆస్పత్రులు ఇప్పుడు సత్వర వైద్యానికి 'నో' చెబుతున్నాయి. ఒకసారి బకాయిపడితే అధికార వర్గం కొంత కాలం వ్యవహారాన్ని సాగతీయడం, ఆపైన ఎంతో కొంత చెల్లింపుల కోసం నిధులు విడుదల చేస్తుంటాయి. ఈ విధమైన తాత్సారంతో కార్పొరేట్ ఆస్పత్రులు అడకత్తెరలో పోకచెక్క చందాన ఆర్థిక వెసులుబాటు లేక నలిగిపోతున్నాయి. ఆయా కార్డుల మీద రోగులకందించే వైద్యసహాయానికి ఆస్పత్రుల వారుబిల్లు అందించిన 45 రోజుల్లోగా ప్రభుత్వం బిల్లు పేమెంట్ చేయాలన్న ఒప్పందం ఉన్నా దాని ప్రకారం నిధులు అందించడంలో వెనుకడుగు వేస్తున్నందున ఇలాంటి సమస్య పుడుతోంది. ప్రభుత్వనిర్దేశిత ధరలకే వైద్య చికిత్సలు అందివ్వడంలో కూడా కార్పొరేట్ ఆసుపత్రులకు వచ్చే ఆర్థిక లబ్ధి ఏమీ ఉండదు. అయినా కారుణ్య భావంతోనూ, ప్రభుత్వ పథకాలకు చేయూతనందించడం ద్వారా తమ ఆస్పత్రుల ప్రాభవాన్ని పెంచుకోవాలని కొన్ని ఆస్పత్రులు ముందుకొస్తున్నాయి. కాగా ప్రభుత్వం కోరినప్పుడు మిగిలిన ఆసుపత్రులు కూడా ప్రజాసేవలో భాగంగా ప్రభుత్వానికి కలిసిరావాల్సిందే. స్టాఫ్ జీతాలు, మందులు, చికిత్సా పరికరాల ధరలు బాగా పెరిగినందున వాటిని భరించడం కష్టంగా ఉందని కార్పొరేట్ ఆస్పత్రులు ఆవేదనవ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు మొండికేసి సేవలు నిలిపివేస్తున్నప్పుడల్లా కొన్ని నిధులు ప్రభుత్వం నుండి వస్తుంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదేపద్ధతి అమలవుతోంది. కనీసం ఆపరేషన్ ఖర్చులు కూడా రావడం లేదని ఆస్పత్రి యాజమాన్యాలు ఆందోళనపడ్తున్నాయి. ప్రభుత్వ ఉచిత వైద్య సేవలుఆపి ప్రైవేట్ ఆస్పత్రులుగా నడుపుకుంటే ప్రభుత్వపర వైద్యసేవల అందుబాటుకు మరింత కష్టతరమవుతోంది. అయినా కార్పొరేట్ ఆస్పత్రులన్నీ తెగించి ప్రస్తుతం వైద్యసేవలను నిలిపివేశారు. తెలంగాణలో 477 ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ వైద్యం లభిస్తుంది. ఈమధ్యనే తెలంగాణలో 62ఆసుపత్రులు తాము తక్కువ ప్యాకేజీకికాదు. సకాలంలో బకాయిల్లేకుండా పూర్తిస్థాయిలో బిల్లులు సొమ్ము విడుదల చేయగలిగితేనే తాము వైద్యసేవల్ని కొనసాగిస్తామని అల్టిమేటం జారీ చేశాయి. దాంతో కొన్ని నిధులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయడంతో కాస్త ఉపశమనం కలిగింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులలో అనేక ప్రైవేట్, నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ ఔట్‌పేషంట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశాయి. కొన్ని ఆసుపత్రులు అత్యవసర కేసులను మాత్రమే చూస్తున్నాయి. ప్రభుత్వం నుంచి దాదాపు రూ. 1500 కోట్లకుపైగా బకాయిలుంటాయని లెక్క చెబుతున్నారు. ఒకవేళ ప్రభుత్వానికి పెట్టిన బిల్లుల మంజూరులో కూడా వ్యత్యాసాలున్నట్లు కొన్నిఆస్పత్రులు ఆరోపిస్తుంటాయి. రాష్ట్రమేదైనా ఆర్థిక సంబంధిత అంశాల్లోనే 'ఆరోగ్యశ్రీ' చికిత్సలు ఆగిపోతున్నాయి. ప్రభుత్వం తక్షణం నిధుల బకాయిలు విడుదల చేయలేకపోతోంది. ప్రయివేటు ఆస్పత్రులు వైద్యసేవలకు ముందుకురాలేకపోతున్నాయి. ఈ సమస్యలు ఎప్పటికప్పుడు తాత్కాలిక పరిష్కారానికే పరిమితమవడంతో తరచు ఇలాంటి విరామం వస్తోంది. రోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిల మొత్తంపై రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. సెంట్రలైజెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో రూ.674 కోట్ల మేరకు బకాయిలున్నట్లు చూపెడుతోంది. ఇవిగాక తాజాగా పేరుకున్న బకాయిలు 3వేల కోట్లకుపైగానే ఉన్నాయని తేల్చారు. ఒక నిర్దిష్టమైన పరిష్కారం లేకుంటే ఆరోగ్యశ్రీని నమ్ముకున్న రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఆయా ప్రభుత్వాలు తమకు ఉన్న ఆర్థిక లోటుతోనో, బడ్జెట్‌లోటుతోనో ముడిపెట్టకుండా ఏటా బడ్జెట్‌లలో ఆరోగ్యశ్రీ, తదితర వైద్యసేవలకు ప్రత్యేక కేటాయింపు చేసి ఆదుకోవాల్సిన అవసరముంది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ పథకం కింద పేద రోగులకు అందించే ఉచిత చికిత్స సేవలను గత 3 రోజులుగా ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులన్నిటా ఓపిడి సేవలు నిలిపివేయడం వల్ల గ్రామీణ రోగులు బాగా ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ పరిశీలనలో ఆసుపత్రులకు కేవలం రూ.2700కోట్ల బకాయిలే ఉన్నాయి. పెండింగ్ బకాయిలు కూడా ఇవ్వాల్సి ఉన్నందున ప్రభుత్వ ఆర్థిక భారాన్ని అత్యవసరంగా మోయగల పరిస్థితి లేదని ప్రభుత్వవర్గాల వివరణ. ప్రత్యామ్నాయం ఏర్పాట్లు లేకపోవడం అర్థాంతరంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం పేద రోగులకు అసౌకర్యం కలిగింది.

వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.



స్వామి వివేకానంద

సంతోషాన్ని ఇచ్చేది సంపద, లేదా వైభవం కాదు. ప్రశాంతమైన మనసు, వృత్తి మాత్రమే.



థామస్ జెఫర్సన్

# బిసిలకు ఇంకా అరకొర 'సంక్షేమ'మేనా?

**తెలంగాణాలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్నికల సమయంలో బిసిని ప్రకటించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా అగ్రవర్ణాల వ్యక్తిని నియమించారు. బిసిల పట్ల కాంగ్రెస్‌ను మించి చులకనభావం బిజెపి పెద్దలకు ఉన్నట్లు ఈ పరిణామాలన్నీ స్పష్టంగా తేటతెల్లం చేస్తున్నాయి. యస్.సి, యస్.టి, అగ్రవర్ణాల పేదలు వారి జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారు. కానీ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు మాత్రం ఇంకా కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. రాజ్యాంగ పరంగా ఫలాలు అందించినప్పుడే బిసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారు**



కెలసాని శివప్రసాద్

బిసి కులాల వారందరికీ చేతి వృత్తులే జీవనాధారం. కొద్ది కాలంగా చేతి వృత్తులు అంతరించిపోతూ ఉండడం, చేతివృత్తులలోకి వివిధ కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడంతో బిసిల బ్రతుకులు అగమ్యగోచరంగా మారాయి. నానాటికీ దిగజారిపోతున్న బిసిల బ్రతుకులు గాడిన పెట్టవలసిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పాటూ అన్ని రాజకీయ పార్టీలపై ఉందని కచ్చితంగా చెప్పవచ్చు. కానీ అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు బిసిలను ఓటర్లుగానే చూస్తున్నాయనేది నిర్వివాద అంశం. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలు బిసిలను స్మరిస్తూ వారి ఓట్ల కొరకూ అనేక అసాధారణ హామీలు రాజకీయ పార్టీలు ఇస్తూ ఉన్నాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే అధికారంలోకి వచ్చిన రాజకీయపార్టీలు ఎన్నికల సమయంలో బిసిలకు తాము ఇచ్చిన హామీలు అటకెక్కించడం, వాటి సాధన కొరకు బిసిలు రోడ్డెక్కడం పరిపాటిగా మారింది. ఆకోవలోకి చెందిందే ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రంలో చెలరేగిన బిసి రిజర్వేషన్ల దుమారం. 2023లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అదిష్టానం స్పష్టమైన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటివరకు బిసి రిజర్వేషన్ల పెంపు విషయంలో జరిగిన తంతు అంతాచాలా హాస్యాస్పదంగా, ఆశ్చర్యకరంగా కనిపిస్తూ ఉంది. వాస్తవంగా రాజ్యాంగ పరంగా షెడ్యూల్డ్ 9లో పొందుపరచినప్పుడే కుల రిజర్వేషన్లకు అధికారికంగా గుర్తింపు, రక్షణ, జీవం ఉంటాయనేది నిర్వివాద అంశం. అత్యున్నత న్యాయ స్థానాలలో ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల కులరిజర్వేషన్లపై వెలువడిన తీర్పులు అందుకు ఉదాహరణలుగా అనేకం కనిపిస్తూ ఉన్నాయి. యం.ఆర్. బాలాజీ, మైసూర్ స్టేట్ మధ్య 1962లో జరిగిన కేసులో మొట్టమొదటిగా రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తరువాత ఇంద్ర సాహ్ని, యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన కేసులో కూడా 1992లో 9మంది సుప్రీం కోర్టు న్యాయమూర్తుల బృందం అదే విధమైన తీర్పును వెలువరించింది. అదే తీర్పులో 50శాతం పరిమితి సంపూర్ణమైనది కాదని, అసాధారణ పరిస్థితులలో రిజర్వేషన్లు పెంచుకోవచ్చని కూడా పొందుపరిచారు. అసాధారణ పరిస్థితులలో రిజర్వేషన్లు పెంచుకోవచ్చు అనే వ్యాఖ్యలు ప్రామాణికంగా తీసుకుని అనేకరాష్ట్రాలు తమ రాష్ట్రాలలో 50శాతం మించి రిజర్వేషన్లను పెంచుకున్నాయి. కానీ వాటికి న్యాయ స్థానాలలో చుక్కెదురు కావడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో ఉన్న ఇదే కాంగ్రెస్ పార్టీ 2005లో ముస్లింలకు 5శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఆ అయిదు శాతం రిజర్వేషన్ల వలన రాష్ట్రంలో రిజర్వేషన్లు 50శాతం మించుతున్నాయని హైకోర్ట్ దానిని తిరస్కరించింది. అప్పటికే 46శాతం రిజర్వేషన్లు రాష్ట్రంలో మనుగడలో ఉన్నాయి. దాంతో 50శాతానికి కేవలం ఒకశాతం అధికంగా ఉన్నందువలన ఆ ఒక్క శాతం తగ్గించి4శాతం ముస్లిం రిజర్వేషన్లను అప్పటి ప్రభుత్వం అమలు చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం 2018లో మారాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఆ రిజర్వేషన్లను మహారాష్ట్ర హై కోర్ట్ కొట్టివేసింది. సుప్రీం కోర్ట్ కూడా ఆ రిజర్వేషన్లను 2021లో తిరస్కరించింది. కానీ 1994లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో పొందుపరచడం వలన తమిళనాడు రాష్ట్రంలో కొనసాగిస్తున్న 69 శాతం రిజర్వేషన్లకు ఎటువంటి ఇబ్బందిలేకుండా పోయింది. అదేవిధంగా అధికరణ 15(5),16(5)ప్రకారం 103 రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఇ.డబ్ల్యూ.యస్) 10శాతం రిజర్వేషన్లను 2022లో కేంద్ర



ప్రభుత్వం కల్పించింది. దాంతో ఈ రిజర్వేషన్ల మనుగడకు కూడా ఎటువంటి అడ్డంకులు కలగడం లేదు. తెలంగాణా రాష్ట్రప్రభుత్వంలోని అపార అనుభవం కలిగిన న్యాయవాదులకు, సుదీర్ఘపాలనా అనుభవంతోపాటూ విషయ పరిజ్ఞానం అన్నిరంగాలపై అత్యధికంగా ఉన్న బ్యూరోకాట్లకు, దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన పాలకులకు ఈ విషయాలన్నీ తెలియవు అంటే ఎవరైనా నమ్మగలరా? ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటూ యావత్తు భారతదేశంలో 55 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతి జాతులు (బిసి) స్వతంత్ర భారత్ ఆవిర్భవించి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇంకా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉండిపోవడంలో దోషులు ప్రాంతీయ, జాతీయ రాజకీయ పార్టీలే అయినా! ప్రధాన దోషులు మాత్రం ప్రధాన పార్టీలే అని కచ్చితంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యం లభించిన నాటి నుండి దాదాపు కాంగ్రెస్, బిజెపిలే కేంద్రంలో అధికారాన్ని అనుభవించాయి. ముఖ్యంగా స్వతంత్ర భారత్‌లో అత్యధిక కాలం కేంద్రాన్ని ఏలింది కాంగ్రెస్ పార్టీనే. కానీ కాంగ్రెస్ పార్టీ బిసిలకు చేసింది శూన్యమనే చెప్పాలి. జనతా పార్టీకి చెందిన మురార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న వెనుకబడిన తరగతి జాతుల(ఓబిసి)కు రాజ్యాంగం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా న్యాయం చేయాలనే సదుద్దేశ్యంతో 1979 జనవరి 1న మండల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ మండల్ కమీషన్ తమ రిపోర్టును 1980 డిసెంబర్ 31న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ సమయంలో జనతా పార్టీ సెక్యులర్‌కు చెందిన చరణ్ సింగ్ దేశ ప్రధానిగా ఉన్నా మండల్ కమీషన్ రిపోర్ట్ పైఏమీ చర్యలు తీసుకోలేకపోయారు. సుమారు దశాబ్దం పాటూ ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల నాయకత్వాలలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం అనుభవించింది. ఆ సమయంలో వారిరువురూ మండల కమీషన్ రిపోర్ట్‌ను అటకెక్కించారనే చెప్పాలి. తరువాత నేషనల్ ఫ్రంట్‌కు చెందిన వి.పి.సింగ్‌ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే1990 ఆగస్టులో మండల్ కమీషన్‌ను ఆమోదించి దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించారు. సుప్రీం కోర్టు కూడా ఓబిసి రిజర్వేషన్లు సమర్ధించి వాటిని అమలు చేయమని 1992 నవంబర్ 16న అప్పటి కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. 1993 నుంచి ఓబిసి రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ తారువాత దేశాన్ని ఎక్కువ కాలం పరిపాలించిన పార్టీ భారతీయ జనతా పార్టీ. దేశాన్ని ఎన్నో దశాబ్దాలు, శతాబ్దాల నుంచి పట్టి పీడిస్తున్న అనేక జటిల సమస్యలకు బిజెపి ప్రభుత్వం పరిష్కారం చూపింది. దేశంలో 15 శాతం ఉన్న అగ్రవర్ణాల వారికి 10 శాతం ఇడబ్ల్యూయస్ రిజర్వేషన్లు కల్పించింది. 15శాతం ఉన్న అగ్రవర్ణాల వారిలో ఇడబ్ల్యూయస్ రిజర్వేషన్లకు అర్హులైన పేదలు 8శాతం మించి ఉండరని అనేక గణాంకాలు తెలియచేస్తున్నాయి. అయినా బిజెపి ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు ఎందుకు కేటాయించిందో పాలకులకే తెలియాలి. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే మహిళా బిల్లును 2023లో బిజెపి ప్రభుత్వం సునాయాసంగా గట్టెక్కించింది. 50 శాతంఉన్న మహిళలకు చట్టసభల్లో 33.3శాతం రిజర్వేషన్లు కల్పించబడింది. ఈ మహిళా బిల్లులో యస్.సి, యస్.టిలకు రిజర్వేషన్లు కేటాయించి బిసిలను విస్మరించారు. అదేవిధంగా 55శాతం పైగాఉన్న బిసిలు తమకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించమని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ కేటాయించమని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించమని, ప్రభుత్వ ఉద్యోగాల ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించమని దశాబ్దాల నుంచి ప్రభుత్వాలను కోరుతున్నారు. వీటిపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నామమాత్రంగా నైనా స్పందించిన దాఖలాలు లేవు. తెలంగాణాలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్నికల సమయంలో బిసిని ప్రకటించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా అగ్రవర్ణాల వ్యక్తిని నియమించారు. బిసిల పట్ల కాంగ్రెస్‌ను మించి చులకనభావం బిజెపి పెద్దలకు ఉన్నట్లు ఈ పరిణామాలన్నీ స్పష్టంగా తేటతెల్లం చేస్తున్నాయి. యస్.సి, యస్.టి, అగ్రవర్ణాల పేదలు వారి జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారు. కానీ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు మాత్రం ఇంకా కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. రాజ్యాంగ పరంగా ఫలాలు అందించినప్పుడే బిసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారు. ●

# ప్రజావాక్కు



## పెరుగుతున్న వైద్యం ఖర్చులు

రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతి కుటుంబం ఏటా వేల కోట్ల రూపాయలు వైద్య చికిత్సలకే ఖర్చు చేస్తున్నాయనే గణాంకాలు తీవ్రఆందోళన కలిగిస్తున్నాయి. ఈఖర్చు ఎక్కువ శాతం నేరుగా ప్రజల జేబు నుండి వెళ్లిపోతుండడం, ప్రభుత్వ ఆరోగ్య సేవల లోపాన్ని స్పష్టంగా చూపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సదుపాయాల లేమి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణుల కొరత, మందుల లభ్యత లోపం వంటి అంశాలు ప్రజలను ఖరీదైన ప్రైవేట్ ఆసుపత్రుల వైపుమళ్లిస్తున్నాయి. ఈఆర్థికభారంతో అనేక కుటుంబాలు అప్పుల ఊబిలో పడుతూ, జీవన ప్రమాణం దిగజారుతున్నది. ప్రైవేట్ వైద్య రంగంపై అధికఆధారపడడం, ఆరోగ్యరంగంలో అసమానతలను మరింతగా పెంచుతోంది. ప్రజారోగ్యంపై సరైన పెట్టుబడులు లేకపోవడం, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు

పిల్లల జీవితంలో ప్రేమ, ప్రోత్సాహం, అర్థం చేసుకోవడం చాలా అవసరం. అయితే నేడు చాలా మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మంచి మార్కులు, ర్యాంకులు లేదా విజయాల కోసం పిల్లలపై అత్యధిక ఒత్తిడి తెస్తున్నారు. అది వారిలో భయం, ఆందోళన, నమ్మకం కోల్పోవడం వంటి ప్రతికూల భావాలను పెంచుతుంది. ప్రతి పిల్లవాడు తనదైనవేగం, తనదైన ప్రతిభతో ఎదుగుతాడు. అందుకే, వారిని ఇతరులతో పోల్చకూడదు తప్పులు చేసినా నేర్చుకునే అవకాశం ఇవ్వాలి. పిల్లల మనసులు సున్నితమైనవి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## విద్యా ప్రమాణాలు పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి. ఆధునిక పద్ధతిలో విద్యా బోధన జరపాలి. అలాగే స్మార్ట్ బోర్డులు, ప్రొజెక్టర్లు ఉపయోగించాలి. ప్రభుత్వ పాఠశాల్లో ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ముఖ్యంగా టాయిలెట్‌లు, బెంచీలు, ఉపాధ్యాయులకు కుర్చీలు, లైట్లు, మంచి నీరు, ధృడమైన పాఠశాల బిల్డింగ్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

## ఔషధ పరిశ్రమలో భద్రత ముఖ్యం

రసాయన ఔషధ పరిశ్రమలు, కర్మాగారాలలో పకడ్బందీగా భద్రత ప్రమాణాలు పాటించాలి. రసాయన ఔషధ పరిశ్రమలలో ఇటీవల తరచూ ప్రమాదాలు సంభవిస్తుండటంతో ప్రాణ నష్టం జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కార్మికులకు నిరంతరం భద్రతాపరమైన అంశాలపై శిక్షణకార్యక్రమాలు, మాక్‌డ్రిల్స్ నిర్వహించాలి. కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి పరిశ్రమలో భద్రత పట్ల యాజమాన్యం శిక్షణ తరగతులు నిర్వహించాలి. దాంతో చాలా వరకు ప్రమాదాలను నివారించొచ్చు. ప్రమాదాలు జరిగినప్పుడు ఇచ్చే నివేదికలు ముఖ్యం కాదని, జీరో ప్రమాదాల స్థాయికి చేరినప్పుడే పరిశ్రమ 100 శాతం అభివృద్ధి సాధించినట్టు లెక్క. నిబంధనలు ఉల్లంఘించినా, భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## తెలంగాణ విద్యకు కొత్త దిశ

తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ 160 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశీపర్యటనకు పంపించాలనేనిర్ణయం తీసుకోవడం విశేషంగా చెప్పుకోవాలి. ఈనిర్ణయం ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే కాకుండా, బోధనా పద్ధతుల్లో నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుంది. విదేశీ పర్యటనలద్వారా ఉపాధ్యాయులు ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా విధానాలను, ఆధునిక బోధనా సాంకేతికతలను సమీక్షించి నేర్చుకునే అవకాశం పొందుతారు. ఆ అనుభవాలను తమ పాఠశాలల్లో అమలు చేస్తే విద్యార్థులలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నేర్చుకునే తపన పెరుగుతుంది. ఇది విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## పి.ఇ.టిలకు ఎన్‌సీసీ డ్యూటీ!

తెలంగాణ రాష్ట్రంలోని వివిధవిద్యాసంస్థలలో, జూనియర్ కళాశాలలో, యూనివర్సిటీలలో, ఎన్.సీ.సీ. జాబ్‌చార్ట్, ఆటలు, పాటలు, క్రమశిక్షణ వంటి డ్యూటీలను, సంస్కృతిక కార్యక్రమాలు ఇకమీదట నిర్వహించడానికి గాను ఆ విధులను పని విధానం టీచింగ్ చేసేటీచర్స్, లెక్చరర్స్ నుండి బాధ్యతలు తీసివేసి పీఈటీలకు, ఫిజికల్ డైరెక్టర్లకు అప్పగించాలి. అందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక జీవో విడుదల చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రమాణాల ఆచరణపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

రామ కిష్టయ్య సంగన భట్ల

వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవుతున్న నేటి పరిస్థితులలో ప్రభుత్వాలు ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రపంచ లేదా అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 14న నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్‌ఫోర్స్ (ఐఈటీఎఫ్)వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగదారులు, నియంత్రకాలు పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం ఈ రోజు ఉద్దేశ్యం. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేస్తూ జరుపుకుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమావేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణిక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దానికి గుర్తుగా అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపబడుతుంది. ఒక సంవత్సరం తరువాత అంతర్జాతీయ ప్రమాణిక సంస్థ ఏర్పడినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపు కోలేదు. ప్రస్తుతం ఈసంస్థలో 125 సభ్యదేశాలున్నాయి. ప్రామాణీకరణ ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగదారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించింది. కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12 శుక్రవారం రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్ధమైనా సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్.ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది. 1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్‌కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా, మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. కాలక్రమంలో టెలి కమ్యూనికేషన్స్, టీకాలు, నూనె గింజలు, త్రాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడ కూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది. ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్రమాణాలు నిర్ణయించడానికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు ఈ రోజునే ప్రారంభించాయి. కనుక ఈ రోజున వరల్డ్ స్టాండర్స్‌డే గా జరుపుకుంటారు. ●

# ప్రపంచ ఆర్థిక రంగంలో భారత్ సరికొత్త అడుగు

డి జె మోహన రావు

ప్రపంచంలో అగ్ర ఆర్థికశక్తిగా ఎదగాలనే మనదేశ లక్ష్యంలో ఇప్పుడు ఒక కీలకమైన అడుగు పడింది. అదే విదేశీ ద్రవ్య పరిష్కార విధానం (ఫారిన్ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్- ఎఫ్‌సీఎస్ఎస్). దీనిని గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ అంటే గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీలో ప్రారంభించడం ఈ లక్ష్యసాధనలో భాగం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అక్టోబర్ 7, 2025 నాడు ఎఫ్‌సీఎస్ఎస్‌ను ప్రారంభించారు. ఇది కేవలం సాంప్రదాయ పద్ధతి స్థానంలో కొత్త టెక్నాలజీ తీసుకురావడం మాత్రమే కాదు, ప్రపంచ దేశాల మధ్య కరెన్సీ మార్చుకునే పద్ధతిలో మనదేశం తెచ్చిన ఒక వ్యవస్థాగత మార్పు. ఈ విధాన ముఖ్యలక్ష్యం విదేశీ లావాదేవీల్లోని అనవసరమైన ఆలస్యాన్ని, అధిక ఖర్చును, ఆ ప్రక్రియలో ఉన్న ప్రమాదాన్ని పూర్తిగా తొలగించడమే. ఎఫ్‌సీఎస్ఎస్ విజయవంతమైతే మన గిఫ్ట్ సిటీ అంతర్జాతీయంగా పేరుగాంచిన లండన్, న్యూయార్క్, సింగపూర్ వంటి అగ్ర ఆర్థిక కేంద్రాలకు సమానంగా ఎదగగలుగుతుంది. ముఖ్యంగా మన దేశీయ బ్యాంకులు ఇకపై విదేశీ కరెన్సీ చెల్లింపుల కోసం ఇతర దేశాల కరస్పాండెంట్ బ్యాంకుల సేవలకు, వాటి పని వేళలకు ఎక్కువగా ఎదురుచూడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. ఎఫ్‌సీఎస్ఎస్ ఆవశ్యకతను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, దాని రాకముందు విదేశీ లావాదేవీలు ఎలా జరిగేవో పరిశీలించాలి. సాంప్రదాయ పద్ధతిని ఒక చిన్న ఉదాహరణతో అర్థం చేసుకుందాం. గిఫ్ట్ సిటీలోని ఒక బ్యాంకు (దీనిని ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ యూనిట్ ఐబియు అంటారు) అమెరికన్ డాలర్లలో ఒక లావాదేవీ చేస్తే, ఆ డబ్బు నేరుగా చేరేది కాదు. ఆ లావాదేవీ పూర్తి కావడానికి డబ్బు అమెరికా, యూరప్‌లోని కరస్పాండెంట్ బ్యాంకులు సహా అనేక మధ్యవర్తి బ్యాంకుల సంక్లిష్టమైన గొలుసు గుండా ప్రయాణించాల్సి వచ్చేది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు 36 నుండి 48 గంటల సుదీర్ఘ సమయం పట్టేది. ఈ సుదీర్ఘ నిరీక్షణ కాలం అనేక తీవ్రమైన సమస్యలకు దారితీసేది. ఏదైనా ఒక బ్యాంకు దివాలా తీసినా లేదా డబ్బు చెల్లించడంలో రెండోది నిధులు వృథా అవడం. బ్యాంకులు ఎప్పుడూ విదేశీ ఖాతాలలో పెద్దమొత్తంలో డబ్బును నిల్వ చేసి ఉంచాలి. సిద్ధంగా ఉంచిన ఈ డబ్బు, తమ దేశీయ అవసరాలకోలేదా ఇతర పెట్టుబడులకో ఉపయోగపడేదికాదు. మూడవ సమస్య ఖర్చు పెరగడం. ప్రతి మధ్యవర్తి బ్యాంకు తమ సేవలకు తప్పకుండా ఫీజులు వసూలు చేయడంతో, చివరకు లావాదేవీ చేసే వారికి అయ్యేఖర్చు బాగా పెరిగిపోయేది. ఎఫ్‌సీ



ఎస్ఎస్ ఈ సమస్యలన్నింటికీ మూడు కీలకమైన పరిష్కారాలను చూపించింది. ఎఫ్‌సీఎస్ఎస్ ద్వారా విదేశీ కరెన్సీ లావాదేవీలు 'రియల్ టైమ్'లో అంటే తక్షణమే పరిష్కారం అవుతాయి. దీన్ని సాకారం చేయడానికి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ (ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ- ఐఎఫ్ఎస్సిఎ) ఒక ప్రత్యేకమైన 'స్థానిక సెటిల్‌మెంట్ బ్యాంకు'ని ఏర్పాటు చేసింది. గిఫ్ట్ సిటీలోని అన్ని బ్యాంకులు ఈ స్థానిక బ్యాంకులో విదేశీ కరెన్సీకి సంబంధించిన ఖాతాలను తెరుస్తాయి. దీనివల్ల ఒక బ్యాంకునుంచి మరొక బ్యాంకుకు డాలర్లు పంపాల్సివస్తే, ఆ డబ్బు అంతర్జాతీయ మార్గాల గుండా ప్రయాణించకుండా, కేవలం ఈ స్థానిక ఖాతాల మధ్యే క్షణాల్లో మార్పిడి జరుగుతుంది. దీనివల్ల బ్యాంకులు తమ నిధులు ఎప్పుడు, ఎంత అందుబాటులో ఉంటాయో అనే దానిపై ఖచ్చితమైన అంచనా వేయగలుగుతాయి. ప్రస్తుతం అమెరికన్ డాలర్స్ మాత్రమే ఈ పద్ధతిలో మార్పిడి చేస్తున్నారు. త్వరలోనే ఇతర ప్రముఖ అంతర్జాతీయ కరెన్సీలను కూడా ఈ విధానంలోచేరుస్తారు. అలాగే ఈ నూతన పద్ధతిలో సెటిల్‌మెంట్ ప్రమాదం పూర్తిగా తొలగిపోతుంది. ఎందుకంటే డబ్బు పంపడం, స్వీకరించడం అనే లావాదేవీలోని రెండు భాగాలు ఒకేచోట ఒకే సమయంలో పూర్తి అవుతాయి. దీనివల్ల మధ్యలో ఆగిపోయే అవకాశమే ఉండదు. అంతేకాకుండా, బ్యాంకులు తమ లావాదేవీల కోసం విదేశీ బ్యాంకుల్లో పెద్దమొత్తంలో నిధులు వృథాగా నిల్వచేయాల్సిన అవసరం ఉండదు. విముక్తి పొందిన ఈ నిధులు దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక కార్యకలాపాలలో పెట్టుబడిగా మారడానికి అవకాశం కల్పిస్తాయి. ఇది బ్యాంకుల వద్ద డబ్బు అందుబాటును అంటే ద్రవ్య లభ్యతను బలోపేతం చేస్తుంది. అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రాలప్రాధికార సంస్థ పర్యవేక్షణలో, భారతదేశంలోని చెల్లింపుల పరిష్కార వ్యవస్థల చట్టం 2007కింద పనిచేస్తుంది. ఈ చట్టబద్ధమైన, కట్టుదిట్టమైన వ్యవస్థ విదేశీ సంస్థలకు ఒక పెద్ద భద్రత ఇస్తుంది. ఇది చట్టపరమైన స్పష్టతను, ప్రమాద నివారణను, పూర్తి పారదర్శకతను అందిస్తుంది. దీనివల్ల విదేశీ పెట్టుబడిదారులు, పెద్ద అంతర్జాతీయ బ్యాంకులుఎటువంటి సందేహం లేకుండా మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి, గిఫ్ట్ సిటీలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి మరింత ఎక్కువగా ముందుకు వస్తారు. భారతదేశం తీసుకున్న చారిత్రాత్మక, వ్యూహాత్మక అడుగు. వేగవంతమైన, తక్కువఖర్చుతో కూడిన, నమ్మక మైన లావాదేవీల పరిష్కార వేదికగా గిఫ్ట్ సిటీని చూసి అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు తమగ్లోబల్ హబ్‌గా ఎంచుకుంటారు. దీని ద్వారా మన దేశం ప్రపంచ నిధుల కేంద్రంగా మారుతుంది. అలాగే అంతర్జాతీయవాణిజ్య లావాదేవీలలో ఆలస్యం, ఖర్చులు తగ్గడం వలన భారతీయ వ్యాపారాలు ప్రపంచవ్యాప్తంగా మరింత పోటీ పడగలుగుతాయి. ఇది దేశీయ ఎగుమతులు, దిగుమతులను పెంచిమొత్తం మీద దేశ ఆర్థికవృద్ధికి బాగా సహాయపడుతుంది. ఎఫ్‌సీఎస్ఎస్ అనేది కేవలం టెక్నాలజీ వ్యవస్థ మాత్రమే కాదు. ఇది ప్రపంచ ఆర్థికరంగాన్ని నడిపించే దేశాల సరసన మన దేశం మరింత స్థిరంగా, విశ్వాసంతో నిలబడగలుగుతుందని చాటే ఒక గట్టి ప్రకటన. ●

# భారత్‌లో తిష్టకు ఆఫ్రికన్ల కొత్త ఎత్తుగడలు

- నేరాలకు పాల్పడి, కాంట్రాక్టు పెళ్లిళ్లు చేసుకుని జైళ్లకు వెళుతున్న వైనం
- కేసులను కొలిక్కితెచ్చి బలవంతంగా వెనక్కి పంపేందుకు పోలీసుల ప్రయత్నాలు




**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** భారత్‌లో తిష్టవేసేందుకు ఆఫ్రికాదేశాలకు చెందినకొందరునేరగాళ్లు కొత్తఎత్తుగడలు వేస్తున్న తీరు పోలీసులను సైతం షాక్‌కు గురిచేస్తోంది. ఇక్కడ అక్రమంగా ఏళ్లతరబడి వుంటున్న అనేక మంది ఆఫ్రికన్ నేరగాళ్లు ఇందుకోసం చిన్నా చితక నేరాలతో పాటు, ఇతరులతో అనవసరంగా గొడవలు పడి పోలీసు కేసుల్లో అరెస్టయి జైళ్లకు వెళుతుండడంతో పాటు కాంట్రాక్ట్ వివాహాలు చేసుకుని అమ్మాయిలను మోసం చేస్తున్నారు. ఈ కారణాలవల్ల వీసా గడువుముగిసినా కోర్టులో కేసులుండడంవల్ల వీరిని పోలీసులు వెనక్కు పంపలేక పోతున్నారు. ఆఫ్రికా దేశాలలో బతుకు పోరాటం నరకంగా వుండడం వివిధ కారణాల చేత భారత్‌కు వస్తున్న ఆఫ్రికన్లలో అనేక మంది తిరిగి వెళ్లేందుకు మనస్సు అంగీకరించక ఇక్కడే తిష్ట వేస్తున్నట్లు పోలీసులుచెబుతున్నారు.

ఆఫ్రికా దేశాలకు చెందిన వందలాది మంది భారత్‌లో అక్రమంగా వుండడం, వీరిలో 90 శాతంమంది నేరచరిత్ర కలిగి వుండడం పోలీసులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. ఒకప్పుడు నైజీరియాకు చెందిన కొందరు నేరగాళ్లు మాత్రమే భారత్‌లో అక్రమంగా వుండగా ఇప్పుడు ఈ జాబితాలో ఉగాండ, జాంబియా, కెన్యా సహా మరికొన్ని దేశాలకు చెందిన వారు కూడా చేరారు. ఆఫ్రికా దేశాలలో అంతర్గత సంక్షోభ సమస్య అధికంగా వుండగా, తీవ్రమైన కరువు కాటకాలు మరింత కుంగదీస్తోంది. దీంతో పాటు ఉగ్రవాద సమస్య అక్కడి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీనికి తోడు జాతుల సమస్యలతో సాగుతున్న మారణకాండ అక్కడి ప్రజల బతుకులను మరింత దుర్భరంగా మారుస్తోంది. ఈ క్రమంలో భారత్ సహా అనేక దేశాలకు వలస వెళుతున్న ఆఫ్రికన్లు ఆతరువాత అక్కడే వుండేందుకు మక్కువ చూపుతున్నారు. ఇందులో భారత్ వుండేందుకు మరింత ఎక్కువ మంది ఇష్టపడుతున్నారని పోలీసుల గణాంకాలు చెబుతున్నాయి. ఇదంతా ఇలావుంటే ఆఫ్రికన్ల వల్ల భారత్‌లోని అనేక నగరాలలో డ్రగ్స్ కల్చర్ బాగా పెరిగిందని నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. ఆఫ్రికా దేశాల నుంచి తక్కువ ధరకు నాణ్యమైన కొకైన్ సహా హెరాయిన్, ఎల్ఎస్‌టి వంటి డ్రగ్స్‌ను భారత్‌కు తెస్తూ ఇక్కడ అధిక ధరలకు అమ్ముతూ అనేక మంది ఆఫ్రికన్లు జల్సా జీవితం గడుపుతు న్నారు. వీరంతా దక్షిణాదినగరాలైన హైదరా బాద్, బెంగళూరు, చెన్నైతో పాటు పశ్చిమాది నగరాలు ముంబాయి. గోవాలలో ఎక్కువగా తిష్ట వేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, బెంగళూరు, గోవా పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్ల వద్ద కోట్లాది రూపాయల ఆస్తులు వున్నట్లు తేలింది. ఇదంతా డ్రగ్స్ స్మగ్లింగ్ వల్లే వీరు సంపాదించి నట్లు వెల్లడయ్యింది. డ్రగ్స్ కేసుల్లో అరెస్టయిన వారిలో 90శాతం నేరగాళ్లు వీసా గడువు ముగి సినా ఇక్కడే వుండడంతో పాటు మరికొందరు తప్పుడు పత్రాలతో వుంటున్నట్లు తేలింది.

**కేసులను కొలిక్కితెచ్చి బలవంతంగా వెనక్కు పంపేందుకు పోలీసుల ప్రయత్నాలు**

ఇదిలావుండగా నిందితులుగావుంటూ ఏళ్లతరబడి భారత్‌లో అక్రమంగా వుంటున్న ఆఫ్రికన్లను బలవంతంగా వారిదేశాలకు పంపేందుకు కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. వీరిపై వున్న కేసులను వీలైనంత త్వరగా కొలిక్కి తెచ్చేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లుగా తెలిసింది. చిన్నాచితక కేసులను కోర్టులో వీలైనంత త్వరగా పరిష్కరించి ఇందులో నేరగాళ్లుగా వున్న ఆఫ్రికన్లను వారి దేశాలకు బలవంతంగా పంపేందుకు కేంద్రం చేబట్టిన చర్యలు కొంతమేర ఫలితాలు ఇస్తున్నాయి. హైదరాబాద్ సహా పలునగరాలలో అక్రమంగా వుంటున్న వంద మంది వరకు ఆఫ్రికన్ల కేసులను మూడు నెలల క్రితం ఆయా రాష్ట్రాల పోలీసులు ఓ కొలిక్కితెచ్చి వారిని వారి దేశాలకు పంపడం కొసమెరుపు.




# గూగుల్‌కు పోటీగా మ్యాపుల్స్

## యాప్ అద్భుతంగా ఉందన్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రపంచవ్యాప్తంగా నావిగేషన్ కోసం విరివిగా ఉపయోగించే గూగుల్ మ్యాప్స్‌కు గట్టి పోటీనిచ్చేలా ఓ స్వదేశీ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలిచింది. గూగుల్ కన్నా మెరుగైన ఫీచర్లతో భారతదేశంలో తయారైన మ్యాపుల్స్ నావిగేషన్ యాప్ అద్భుతంగా పనిచేస్తోందని కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కొనియాడారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ తప్పకుండా వాడాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. తాను స్వయంగా మ్యాపుల్స్ యాప్‌ను ఉపయోగిస్తున్న వీడియోను పంచుకున్నారు. ఈ యాప్‌లో ఫ్లైఓవర్లు, ఓవర్‌బ్రిడ్జిలను సులభంగా గుర్తించవచ్చని, అపార్ట్‌మెంట్‌లలో ఉండే దుకాణాల వివరాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయని ఆయన వివరించారు. ఇందులో 13 రకాల ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయని, ఇవి ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయని తెలిపారు. మంత్రి చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గామారింది. స్వదేశీ యాప్‌కు కేంద్రమంత్రి ప్రచారం కల్పించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మ్యాపుల్స్ యాప్‌ను మ్యాప్‌మైఇండియా సంస్థ అభివృద్ధి చేసింది. ఈ యాప్‌లో 3డి జంక్షన్ వ్యూ, లైవ్ ట్రాఫిక్ సిగ్నల్ టైమర్లు, భద్రతా హెచ్చరికలు, ప్రాంతీయ భాషల సపోర్ట్‌వంటి అనేక ఆధునిక సదుపాయాలు ఉన్నాయి. ముఖ్యంగా భారతీయ రోడ్లు, జంక్షన్ల పరిస్థితులకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దినట్లు సంస్థతెలిపింది. మంత్రి ట్వీట్‌కు స్పందించిన మ్యాప్ మై ఇండయా సంస్థ ఆయనకు కృతజ్ఞత తెలిపింది. భారత్‌లో డ్రైవింగ్‌ను మరింత సురక్షితంగా, సులభంగా మార్చడమే తమ లక్ష్యమనిపేర్కొంది. దేశ ప్రజలందరూ స్వదేశీ సాంకేతిక విప్లవంలో భాగస్వాములు కావాలని కోరింది. ఇప్పటి వరకు ఈ యాప్‌ను 3.5 కోట్ల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సంస్థ వెల్లడించింది.

# శ్రేసన్ ఫార్మాకు లైసెన్స్ రద్దు

**కోల్డ్‌రిఫ్ దగ్గుమందుతో పలు మరణాలు**

**కంపెనీ మూసివేతకు తమిళనాడు సర్కారు ఆదేశాలు**

**చెన్నై, అక్టోబరు 13:** 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికిపైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా అనుమతులు రద్దు చేసినట్లు సోమవారం తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే కంపెనీ మూసివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు పేర్కొంది. ఈ దగ్గు మందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలినట్లు అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. సరైన తయారీ పద్ధతులు అవలంబించడంలేదని, 300కు పైగా ఉల్లంఘనలను రికార్డు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటికే కంపెనీ యజమాని జి.రంగనాథన్‌ను అరెస్టు చేసింది. అలాగే సోమవారం ఉదయం ఫార్మా సంస్థకు చెందిన పలు ప్రాంగణాల్లో ఇడి తనిఖీలు నిర్వహించింది. దగ్గు మందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (సిడిఎస్‌సిఒ) గుర్తించినట్లు జాతీయమీడియా కథనాలు పేర్కొన్న సంగతితెలిసిందే. రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని పేర్కొన్నాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్‌లోకి ప్రవేశించిందని, ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి.

# ట్రేడ్ డీల్‌పై మలివిడత చర్చలు

## నేడో రేపో అమెరికాకు భారత్ బృందం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మలివిడత చర్చల కోసం భారత్ బృందం త్వరలో వాషింగ్టన్ వెళ్లనుంది. అధికార వర్గాల కథనం ప్రకారం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడం, ఒప్పందం తొలి దశను ఖరారు చేయడం లక్ష్యంగా మలి విడత చర్చల కోసం భారత ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి బృందం అమెరికా వెళ్లనుంది. అమెరికాతో చర్చలు సానుకూల మార్గంలో సాగుతున్నాయి. ద్వైపాక్షిక ఒప్పందం మొదటి దశ ఈ నెలాఖరు లోపు ముగుస్తుందని రెండు పక్షాలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నాయి. ట్రంప్ సుంకాల విధింపుతో వాణిజ్య ఒప్పందానికి బ్రేకులుపడ్డాయి. అయితే, పరస్పర సుంకాల వల్ల ఇరుదేశాలకు నష్టం వాటిల్లుతున్నందున సాధ్యమైనంత త్వరగా ట్రేడ్ డీల్‌కు రావాలని నిర్ణయించాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉభయదేశాలు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించాయి. దీనికి సంబంధించి తొలి దశ చర్చలను అక్టోబర్, నవంబర్‌లో పూర్తి చేయాలని షెడ్యూల్ కూడా చేశారు. ఇప్పటి వరకు ఐదు దశల్లో వాణిజ్య చర్చలు సాగాయి. ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వాణిజ్య చర్చల కోసం అధికార ప్రతినిధి బృందంతోకలిసి న్యూయార్క్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఇరుదేశాలమధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన వివిధ అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరిపారు. గోయెల్ అమెరికా పర్యటన అంతా సానుకూలంగాసాగింది. ఈ పర్యటనలో పీయూష్ గోయెల్ అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్, భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్జియో గోర్‌తోనూ సమావేశమై సమాలోచనలు జరిపిన విషయం తెలిసిందే.

## బీహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ..

# లాలూ కుటుంబంపై ఢిల్లీ కోర్టు అభియోగాలు



**పాట్నా, అక్టోబర్ 13:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి షాక్ తగిలింది. అవినీతి కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుతు తేజస్వీ యాదవ్‌పై సోమవారం ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. ఈ కేసులో వారు విచారణను ఎదుర్కోనున్నారు. లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులు కేటాయించడంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద రౌజ్ అవెన్యూ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు నమోదుచేసింది. రైల్వే మంత్రిగా తన పదవిని దుర్వినియోగం చేశారని ఈ సందర్భంగా న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తాము ఏ తప్పూ చేయలేదని లాలూ, తేజస్వి కోర్టుకు వెల్లడించగా అసలు ఇది తప్పుడు కేసు అని రబ్రీదేవి పేర్కొన్నారు. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందనేది ఆరోపణ. ఆ కాంట్రాక్టులను సుజాత హోటల్‌కు అప్పగించారు. ఆ ఒప్పందానికి బదులుగా లాలూయాదవ్ ఒక బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో మూడు ఎకరాల భూమిని పొందారని సిబిఐ పేర్కొంది. ఈ వ్యవహారంలో 2017లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

నిందితులపై అభియోగాలు మోపేందుకు తగిన సమాచారం ఉందని కోర్టులకు వెల్లడించింది. ఆ వాదనను లాలూ న్యాయవాది తోసిపుచ్చారు. ఇదిలా ఉంటే వచ్చే నెల బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్డీయే, లాలూ పార్టీ ఆర్జేడి నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్‌అధికారం కోసం హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ప్రత్యర్థులు తమ ప్రచారంలో ఈ కేసును ఎత్తి చూపే అవకాశం ఏర్పడింది. బీహార్‌లో అసెంబ్లీ స్థానాలకు నవంబరు 6,11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

# ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు గని ఎక్కడో తెలుసా?



**వాషింగ్టన్, అక్టోబరు 13:** బంగారం.. ఈపేరు వింటేనే చాలా మందిలో వైబ్రేషన్లు వస్తాయి. కారణమేమంటే దానిపై వారికి ఉంటే మక్కువ. ముఖ్యంగా మహిళలు బంగారం పేరు వినగానే అటెన్షన్ అవుతుంటారు. పసిడి కొనేందుకు ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం బంగారం ధర సామాన్యులకు అందనంత దూరంలో ఉంది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.25 లక్షలు దాటింది. కేవలం ఈ ఒక్క సంవత్సరంలోనే దాదాపు 50 శాతం ధర పెరిగింది. ఇదే సమయంలో కొందరికి విచిత్రమైన ప్రశ్నలు వస్తున్నాయి. అలాంటి వాటిల్లో ప్రపంచంలో అత్యధిక బంగారం ఎక్కడ ఉంది? ఏ దేశంలో ఎక్కువ ఉత్పత్తి అవుతుంది? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆ దేశం ఏమిటి? అక్కడ యేడానికి ఎంత బంగారాన్ని వెలికితీస్తారో తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. మరి ఆ వివరాలిలా ఉన్నాయి.

ప్రపంచంలో అతిపెద్ద బంగారు గని పేరు నెవాడా గోల్డ్‌మైన్. ఇది అమెరికాలోని నెవాడా రాష్ట్రంలో ఉంది. ఈ గనిలో యేటా టన్నుల కొద్దీ గోల్డ్‌ను వెలికితీస్తుంటారు. భూమిపైనే అతిపెద్ద బంగారు గనిగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ఈ బంగారు గనిని బారిక్ గోల్డ్, న్యూమెంట్ కార్పొరేషన్ అనే సంస్థలు కలిపి నడుపుతున్నాయి. ఈ గనిలో యేటా సుమారు వంద టన్నులు అంటే లక్షకిలోల గోల్డ్‌ను బయటకు తీస్తున్నారు. ప్రస్తుతం భూమిపై వినియోగంలో ఉన్న అతిపెద్ద బంగారు గని ఇదేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అగ్రరాజ్యమైన అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ బంగారు గని ఒక అక్షయపాత్రలా ఉపయోగపడుతుంది. ప్రస్తుతానికి ప్రపంచంలో ఎక్కువ బంగారం నిల్వలు ఉన్న దేశం కూడా యుఎస్ కావడం గమనార్హం. అంతలా అమెరికా బంగారాన్ని రిజర్వ్ చేయడానికి ఈ గని కూడా ఒక కారణమని అక్కడి మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇకపోతే మన దేశంలో కూడా బంగారు గనులు ఉన్నాయి. అయితే వాటి నుంచి లభించే బంగారం చాలా తక్కువ. ఇక్కడ బంగారు ఉత్పత్తికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి బంగారం ఇతర దేశాల నుంచే ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాం.

# సరిహద్దుల్లో భద్రత మరింత పెంపు

## కీలక మార్గాల మూసివేత



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఉగ్ర చొరబాట్ల కట్టడికి భారత సైన్యం కీలక చర్యలు తీసుకొనేందుకు సిద్ధమైంది. శీతాకాలం రాబోతున్న నేపథ్యంలో పాకిస్తాన్ సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ వెంబడి భద్రతను మరింత పెంచుతోంది. ఇందులో భాగంగా కీలక మార్గాలు మూసివేసింది. అదనపు బలగాలను మొహరించినట్లు తెలుస్తోంది. పహల్గాం దాడిని దృష్టిలో పెట్టుకుని సరిహద్దుల్లోని భద్రతను పునరుద్ధరిస్తోంది. ఈ మేరకు విశ్వసనీన వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనం వెల్లడించింది. సాధారణంగా కశ్మీర్ లోయలో శీతాకాల సమయంలో మంచు దట్టంగా కురుస్తుంది. ఆ సమయంలో కీలక మార్గాల్లో భద్రత పర్యవేక్షణ కష్టంగా మారుతుంది. ఎత్తైన ప్రాంతాల్లో నిఘాకు సవాళ్లు ఎదురవుతాయి. దీన్ని అవకాశంగా తీసుకుని చలికాలానికి ముందు ఉగ్ర చొరబాట్ల ఘటనలు పెరుగుతాయి. వీటిని నియంత్రించేందుకే సరిహద్దుల్లో ఆర్మీ భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కంచెను కట్టుదిట్టం చేయడంతో పాటు ఈ ప్రాంతంలో అదనపు దళాలను మోహరిస్తోంది. ఇక సరిహద్దులను ఆనుకుని ఉండే కొన్ని కీలక మార్గాలను మూసివేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, థర్మల్ ఇమేజర్లు, అధునాతన కెమెరాలు, చిన్న చిన్న డ్రోన్లతో చొరబాటు యత్నాలను తిప్పికొడుతున్నట్లు ఆర్మీ విశ్వసీన వర్గాలు వెల్లడించాయి. గతంలో ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి రద్దీ ప్రాంతాలకు దూరంగా ఒక రహస్యప్రాంతంలో దాక్కొన్న సందర్భాలున్నాయి. కానీ, ఇటీవల ఉగ్రవాదులు తమ పంథా మారుస్తున్నారు. రద్దీ ప్రదేశాలకు దగ్గరగా రెండు,మూడు రహస్య ప్రాంతాల్లో నక్కి తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఇక, భద్రతా సిబ్బంది నిఘా నుంచి తప్పించుకునేందుకు సామాన్య పౌరులవలే స్థానిక మొబైల్ నెట్‌వర్క్‌నువాడి కమ్యూనికేషన్ చేసుకుంటున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. దీంతో దేశంలోకి చొరబడిన తర్వాత వారిని పట్టుకోవడం సమస్యగా మారుతోంది. అందుకే వీరు దేశంలోకి రాకుండా చొరబాట్లను అడ్డుకుని సరిహద్దుల వద్దే పట్టుకోవాలని ఆర్మీ భావిస్తోంది.

# ఆట గెలిపించి.. అసువులు బాసి!

**క్రికెట్ మైదానంలో ఆడుతూనే ప్రాణాలు వదిలిన బౌలర్**

**లక్నో, అక్టోబరు 13:** ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో ఓ క్రికెట్ ఆటగాడు మైదానంలోనే మృతి చెందాడు. స్థానికంగా జరిగిన ఓ టోర్నమెంట్‌లో అద్భుతంగా బౌలింగ్‌చేసి తన జట్టును గెలిపించాడు కానీ.. జీవిత పోరాటంలో మాత్రం ఓడిపోయాడు. చివరి బంతి వేసిన తర్వాత ఆ బౌలర్ అకస్మాత్తుగా మరణించాడు. ఈ ఘటనతో అందరూ షాక్‌అయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియోఒకటి వైరల్‌అయింది. మొరాదాబాద్‌లోని బిలారి బ్లాక్‌లో ఉత్తరప్రదేశ్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఓ టోర్నమెంట్‌ను నిర్వహించింది. బిలారిలోని చక్కెర మిల్లు మైదానంలో ఆదివారం మొరాదాబాద్, సంభాల్ జట్లు తలపడ్డాయి. మొరాబాద్ మొదటబ్యాటింగ్ చేసింది. ఛేదనలో సంభాల్ విజయానికి చివరి నాలుగు బంతుల్లో 14 పరుగులు అవసరం అయ్యాయి. మొరాదాబాద్ ఫాస్ట్ బౌలర్ అహ్మద్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో.. సంభాల్ జట్టు 11 పరుగుల తేడాతో ఓడిపోయింది. చివరి బంతి పడగానే మొరాదాబాద్ ప్లేయర్లు సంబరాల్లో మునిగిపోయారు అహ్మద్ మాత్రం తీవ్ర అస్వస్థతతో మైదానంలో కుప్పకూలాడు.

అహ్మద్‌ఖాన్ శ్వాసతీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడ్డాడు. భయాందోళనకు గురైన మొరాదాబాద్ ఆటగాళ్లు వెంటనే చికిత్స అందించారు. అక్కడే ఉన్న వైద్యుడు మైదానంలో అతడికి సిపిఆర్ చేశాడు. దాంతో అహ్మద్ కాస్త కుదుటపడ్డాడు. ఆ తర్వాత అతన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో వైద్యుడు పరిశీలిం చగా.. అహ్మద్ అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనలో మ్యాచ్ గెలిచిన ఆనందం శోకసం ద్రంగా మారింది. అహ్మద్ స్థానిక మొరాదాబాద్ జట్టుకు సీనియర్ బౌలర్ అని, చాలా యేళ్లుగా క్రికెట్‌లో చురుగ్గా పాల్గొంటున్నాడని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు.

## రాజకీయ అంశాలు

# కోర్టులకెందుకు?

**రాహుల్ వ్యాఖ్యలపై దాఖలైన పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్'అనే నినాదంతో 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బిజెపి, ఎన్నికల సంఘంపైన 'ఓటు చోరీ' వ్యాఖ్యలు చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ రాజకీయ అంశాలకు కోర్టులోను వేదిక చేసుకోవద్దు. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. బిజెపి, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధాన మంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని, బీహార్‌లో మాత్రం బిజెపి, ఇసిని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు బిజెపి నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు.

## సంక్షిప్తంగా..

### కరూర్ తొక్కిసలాటపై సిబిఐ దర్యాప్తు: సుప్రీం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** కరూర్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సిబిఐ విచారణకు ఆదేశించింది. సిబిఐ దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసింది. గత నెల 27న టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టివికె పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సిట్ దర్యాప్తును దేశ అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. తమ పార్టీ పట్ల సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. 41 మంది మృతి చెందిన తొక్కిసలాట ఘటన దేశాన్ని కదిలించిందని పేర్కొంది. ఈ మేరకు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. నిస్సందేహంగా.. న్యాయసమ్మతమైన, పక్షపాతరహిత విచారణ అనేది పౌరుల హక్కు అని వ్యాఖ్యానించింది.

### పదవి నుంచి తప్పకుంటా: కేంద్రమంత్రి సురేష్ గోపి



**తిరువనంతపురం, అక్టోబరు 13:** మళ్లీ యాక్టింగ్ వైపు మళ్లే యోచనలో ఉన్నట్లు కేంద్రమంత్రి, బిజెపి ఎంపి సురేశ్ గోపి తెలిపారు. కేరళలోని కన్నూర్‌లో రాజ్యసభ ఎంపి సదానందన్ మాస్టర్ అధికారిక కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన ఆదాయం బాగా తగ్గిపోయిందని అన్నారు. దాదాపుగా నిలిచిపోయిందని అన్నారు. ఆదాయంకోసం మళ్లీ నటనపై దృష్టి పెట్టాలని అనుకుంటున్నట్లు తెలిపారు. తన స్థానంలో రాజ్యసభ ఎంపి సదానందన్‌ను నియమించాలని కూడా ప్రతిపాదించానని ఆయన అన్నారు. పార్టీలోతానే అత్యంత పిన్నవయస్కుడినని తెలిపారు. 2008లో పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు ఎన్నుకున్నతనను కేంద్రమంత్రిని చేయాలని పార్టీ భావించినట్లు తెలిపారు. మలయాళం సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడైన సురేశ్ గోపి త్రిసూర్ నియోజకవర్గం నుంచి బిజెపితరఫున పోటీచేసి ఎంపిగాఎన్నికయ్యారు. రాష్ట్రంలో తొలి బిజెపిఎంపిగా రికార్డు సృష్టించారు.

### పుణేలో చిరుత దాడి: చిన్నారి మృతి

**ముంబయి, అక్టోబరు13:** పొలంలో పనిచేస్తున్న అయిదేళ్ల చిన్నారిపై చిరుత పులి దాడి చేసిన ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పింపార్ఖేడ్ గ్రామంలో తమ ఇంటి సమీంపలోని పొలంలో పనిచేస్తున్న తాతకు మంచినీళ్లు ఇవ్వడానికి శివన్యశైలేష్ బొంబే అనే అయిదేళ్ల చిన్నారి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే నక్కి ఉన్న చిరుతపులి ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేసి పొలాల్లోకి ఈడ్చుకుపోయింది. అక్కడే పనిచేస్తున్న వ్యక్తుల అది గమనించి కర్రలతో చిరుతను తరమడంతో కొద్ది దూరంలో చిన్నారిని వదిలి వెళ్లిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చిన్నారి మెడకు తీవ్ర గాయాలవడంతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చిరుతపులిని గుర్తించేందుకు కెమెరా ట్రాప్‌లను, థర్మల్ డ్రోన్‌లను ఉపయోగించామని, 10 బోన్లు ఏర్పాటు చేశామని ఫారెస్ట్ డివిజన్ అధికారి పేర్కొన్నారు. సోమవారం చిరుత బోనుకు చిక్కిందని అటవీశాఖ అధికారులుపేర్కొన్నారు.

### పాకిస్థాన్‌లో ఆందోళనల అగ్గి

**ఇస్లామాబాద్, అక్టోబరు 13:** గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ (టిఎల్‌పి) కార్యకర్తలు చేస్తోన్న ఆందోళనలతో పాకిస్థాన్ భగ్గుమంటోంది. గత వారం మొదలైన ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. దాంతో ఒక అధికారి సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో లాహోర్‌లో రోజువారీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. గాజా యుద్ధం ముగింపుపై పాలస్తీనా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే.. పాక్ హింసాత్మకంగా మారడం గమనార్హం. ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకటించిన తర్వాత ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ ముట్టడికి ప్లాన్ చేసింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు చేస్తోన్న ప్రయత్నాలు హింసాత్మకంగా మారుతున్నాయి.

# కడపలో విషాదం - ఒకే కుటుంబంలో నలుగురు మృతి

## - భార్య భర్తలతో పాటు యేడాది చిన్నారి మృతి - వారి మరణవార్త విని నాయనమ్మ మృతి

**కడప క్రైం, అక్టోబరు 13, ప్రభాతవార్త:** కడప నరంలోని శంకరాపురానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు కొన్ని గంటల కాలవ్యధిలోనే నలుగురు నిండు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఇద్దరు భార్యభర్తలు, వారికి చెందిన పసి కందుతో పాటు మృతుని నాయనమ్మ గుండెపోటుతో మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. కుటఉంబ సభ్యులలో వృద్ధురాలి మనవడు, మనవరాలు, మునిమనవడితో సహా కడప రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కడప నగరంలోని శంకరాపురంలో శ్రీరాములు(27), అతని భార్య వెంకట సుబ్బమ్మలు వృద్ధ దంపతులు. వీరి కుమారుడు రామకృష్ణ, పద్మావతిలకు రవలి, శ్రీరాములు అనే ఇద్దరు సంతానం ఉన్నారు. శ్రీరాములుకు మూడేళ్ల క్రితం నగరానికి చెందిన శిరీషతో వివాహం జరిగింది. వీరికి రుత్విక్(1) కుమారుడు ఉన్నాడు. శ్రీరాములుస్థానిక చెన్నూరు బస్టాండు సమీపంలోని ఓ వైద్యురాలి వద్ద ఫార్మశీ విభాగంలో విధులు చేసఉ్తన్నాడు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో విధులు ముగించుకొచ్చాడు. ఆ సమయంలో మద్యం సేవించి శ్రీరాములు ఇంటికి వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీరాములును మందలించారు. దీంతో ఆయన ఆయన కుటుంబంతో ఆటోలో బయటకు వెళ్లాడు. అదే వీదిలో చివరలోని స్నేహితుడు పలకరించగా రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నామన్నాడు. సదరు వ్యక్తి ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న వెంకట సుబ్బమ్మ ఆకస్మిక మృతి చెందింది. వైద్యులను పిలిపించి పరిశీలించగా మృతి చెందినట్లు తెలుస్తోంది. శ్రీరాములు(23), శిరీష(21), రుత్విక్‌లు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రైల్వే స్టేషన్ నుంచి కమలాపురం వైపు నడుచుకుంటూ రైల్వే ట్రాక్‌పై గూడ్సు రైలు రాగానే పట్టాలపై పడుకొని మూకుమ్మడిగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ముగ్గురు మృతి చెందడం విషాధం నింపింది. ఒకే కుటుంబంలో 4 మరణాలు గంటల వ్యవధిలో జరగడంతో శంకరాపురంలో విషాధచాయలు అలుము కున్నాయి. సమాచారం తెలుసుకున్న బంధు వులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు.

కడప రైల్వే ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ కు తర లించారు. ఆత్మహత్యకు గల కారణాలను లోతు గా దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. కేవలం మద్యం సేవించి రోజూ ఇంటికి వస్తున్నాడన్న కారణంగా చోటు చేస ుకున్న మనస్పర్థలతో ఆ కుటుంబం మృతి చెందడంతో ఒక్కసారిగా కుటుంబం చిన్నాభిన్నం అయింది.



# అమ్మాయి ఆత్మస్థైర్యంతో ఎదిగేలా చూసే బాధ్యత తల్లిదండ్రులదే

## - రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛ, ఎదిగే శక్తిని పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులదేనని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. ఈ మేరకు డాక్టర్ రాయపాటి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిల చదువు, ఉద్యోగ అవకాశాలను ప్రోత్స హించాలన్నారు. ఆర్థిక అవగాహన ఉండాలని, ఆర్థిక స్వేచ్ఛ కలిగిన అమ్మాయిలు తమ జీవితాన్ని స్వయంగా నిర్ణయించుకునే శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని పొందు తారని రాయపాటి శైలజ చెప్పారు. తల్లిదండ్రుల ఆదర్శాలు, ఆశయాలు నిలబెట్టే ఆడపిల్లనూ వారసురాలిగా సమాజం గుర్తించాలని ఆమె కోరారు. బాలికలకు చదువు అవసరంతో పాటు వారు ఎదిగిన తర్వాత ఆర్థిక స్వేచ్ఛ ఉండా లన్నారు. ఇంటిలో ఆడపిల్లలతో తల్లిదండ్రులు కేటాయించే సమయం పెరగాలని, వారి ఆలోచనలను ఎప్పటికప్పుడు పంచుకున్నప్పుడే మూడో వ్యక్తుల ప్రమేయం తగ్గుతుందనేది అందరూ తెలుసుకోవాలన్నారు. శారీరక, మానసి కంగా ధృఢంగా ఉన్నప్పుడే మహిళ అన్ని రంగాలలో ఎదగగలదని చెప్పారు. అమ్మాయిలు ఇళ్ళల్లో చిన్నచిన్న విషయాలకు కాకుండా తమ రక్షణకు, ఎదుగుదలకు మొండితనం చూప డంలో తప్పేమీలేదన్నారు. నేటి సమాజంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సి న అవసరం ఉందన్నారు. ఆన్లైన్ పరిచయాల పట్ల బాలికలు స్వయం నియంత్రణతో మెలగాలన్నారు. సోషల్ మీడియా ఎంత అవసరమో అంతే వాడు కోవాలని, శృతిమించితే సమస్యలు వస్తాయని రాయపాటి శైలజ హెచ్చరించారు. బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడే వారి చర్యలకు భయపడి మానసిక వత్తిడికి గురికాకుండా తల్లిదండ్రుల సహకారం కోరాలని ఆమె పిలుపునిచ్చారు.

# భక్తులకు సంతృప్తికర దర్శనమే లక్ష్యం: ఇఒ

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 13, ప్రభాతవార్త** దుర్గమ్మవారిని దర్శించుకోటానికి వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తికరంగా దర్శనం చేసుకునేలా ప్రతి ఉద్యోగి చర్యలు తీసుకోవాలని ఇఒ వికె శీనా నాయక్ అన్నారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా ఉత్స వాల్లో సిబ్బంది శ్రద్ధ, పనితీరు ప్రతిఒక్కరు గమనించారని, ఇదే విధంగారాబోయే కార్తీకమాసం, భవానీ దీక్షల కు సంబంధించిన ఏర్పాట్లపై అందరూ దృష్టిసారించి భక్తులకు సేవలందించాలన్నారు. ధర్మకర్తలమండలి దేవస్థానం యంత్రాంగం అంతా కలిసి కట్టుగా భక్తులకు మరింత సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా 66 అంశాలపై చర్చించి గడువులోగా పనులు పూర్తి చేయాలని ఇఒ అన్నారు. కార్యక్రమంలో ఇఇ రాంబాబు, అసిస్టెంట్ కమీషనర్ రంగారావు, ఎఇఒలు చంద్రశేఖర్, రమేష్‌బాబు, సుధారాణి, గంగాధర్, తిరుమలేశ్వరరావు, శ్రీనివాస్, వైదిక కమిటీసభ్యులు ఆంజనేయ ఘనాపాఠి, శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొ న్నారు. - దుర్గమ్మవారి సేవలో రాష్ట్ర సమా చార పౌరసంబంధాల శాఖ సంచాలకులు : దుర్గమ్మ సోమవారం రాష్ట్ర సమాచార పౌర తుమ్మల చంద్రశేఖర్‌రావు కుటుంబం పేరిట రు.1,01,116 ల విరాళాని ్న సోమవారం అందిం చారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందిం చారు. వేదాశీర్వచనాలు పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ



సమాచార పౌరసంబంధాల సంచాలకులువిశ్వ నాథన్‌కు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

# వర్తమాన సమస్యలకు ప్రతిబింబంగా కవిత్వం

## - కలువల కొలను ఆవిష్కరణ సభలో వక్తలు

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాత వార్తప్రతి నిధి:** ఎంతో విలువైన సమాచారాన్ని మనకు అందించగల కళలు, సాహిత్యం పట్ల నేటియువతరం ఆశక్తి చూపకపోవడం ప్రమాద సంకేతం అని సుప్రసిద్ధ కవి, నవలా రచయిత సాగర్ శ్రీరామకవచం అన్నారు. ఎక్స్ రే.. సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో ..విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్.. లో ప్రముఖ కవి కారంచేటి విజయ కుమార్(తెనాలి) రచించిన ..కలువల కొలను.. కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. పుస్తక ఆవిష్కరణ చేసిన శ్రీరామకవచం ప్రసంగం కొనసాగిస్తూ స్థితప్రజ్ఞతా వాచకం కలువల కొలను కవితా సంపుటి అంటూ మంచి సాహిత్య అధ్యయనం మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దుతుంది, వీరు ఈ కవితా సంపుటి ద్వారా సమకాలీన సమస్యలను ప్రతిబింబింప చేసారు అని అభినందించారు. సభకు ముఖ్య అతిధిగా జిఆర్కె పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు ప్రసంగిస్తూ ప్రజల్ని చైతన్యపరచి అభ్యుదయ పధంలో నడిపేదే కవిత్వం అన్నారు. నేటి యువత సేల్ ఫోన్లకు అంకితమై విలువైన భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారు అని నారాయణ రావు అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథాన్ని సమీక్షి స్తూ విజయ కుమార్ కవిత్వం సరళమైన భాషలో అందరికి అర్థమయ్యేలా ఉందని ప్రశంసించారు. నేటి పరిస్థితులపై సరైన అవగాహనతో విజయకుమార్ రచన ..కలువల కొలను.. సాగుతుందని సాంబశివరావు అన్నారు. ..ఎక్స్ రే.. ఉపాధ్యక్షులు కందికొండ రవికిరణ్ సభాధ్యక్షుడుగా మాట్లాడతూ తమ సంస్థ లో కవిత్వ రచనలో అక్షరాలు దిద్ది నేడు గ్రంధ రచయిత స్థాయికి ఎదగిన విజయకుమార్ కృషి అభినందనీయం అన్నారు. గ్రంధ రచయిత కారంచేటి విజయకుమార్ కు సత్కారం జరిగింది. విజయకుమార్ గ్రంధ రచన నేపథ్యాన్ని వివరించి, తనను ప్రోత్స హించిన అందరికి ధన్యవాదములు తెలిపారు. తొలుత సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య స్వాగతం పలికి, చివరగా వందన సమర్పణ చేసారు. సంస్థ సభ్యులు గోపు రాము, డాక్టరు బి వసంత కుమార్, పొత్తూరి సీతారామారావు, గుర్రం ఏడుకొండలు, సామినేని శైలజ, విమలావతి, హారిక, వేణుగోపాల్ కార్యక్రమాన్ని పర్యవేక్షి ంచారు. పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.



కలువల కొలను కవితా సంపుటి ఆవిష్కరణ దృశ్యం

# నాణ్యతతో కూడిన నిరంతర విద్యుత్

## - సోలార్ ఎనర్జీ పై ప్రత్యేక దృష్టి

## - ఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్

**తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** నాణ్యత కూడిన నిరంతర విద్యుత్తును, సోలార్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు నూతన ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ వెల్లడించారు. సోమవారం ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొట్టమొదటగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందించడంతో పాటు ఉద్యోగులు, సబ్ స్టేషన్లు, వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం సైనికుల పనిచేయనున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా విద్యుత్ అవసరమైన చోట స్టేజీలు మార్చుకుంటూ ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. విద్యుత్తు శాఖలోని అన్ని విభాగాలను ఒక్క త్రాటిపై నడిపి ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భవిష్యత్తు తరాలకు బాసటగా నిలుస్తానని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల, డిస్కం సూచనలను సలహాలను నిరంతరం ఎప్పటికప్పుడు వినియోగదారులకు ఉద్యోగులకు తెలియజేస్తూ వారిలో అవగాహన పెంచడంతోపాటు విద్యుత్ శాఖ పనితీరును మెరుగు పరచడం జరుగుతుందన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిలో నియమించిన సీఎం చంద్రబాబుకి, విద్యుత్ శాఖ మంత్రికి, డిప్యూటీ సీఎం పవన్‌కు,మంత్రి లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన వై డి రామారావు



**విజయవాడ, అక్టోబరు 13,ప్రభాత వార్తప్రతినిధి:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు ఈరోజు రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో దక్షి ణ భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తు ఎన్నికయ్యారు. భారత ప్రభుత్వ ఆరోగ్య,. కుటుంబ సంక్షేమ శాఖ కేంద్రమంత్రి జె.పి. నడ్డా అధ్యక్షతన ఈ జాతీయ మేనేజింగ్ కమిటీ పనిచేస్తుంది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లోని 28 రాష్ట్ర మరియు కేంద్రపాలిత ప్రాంతాల శాఖల నుండి రెండు సంవత్సరాల పదవీకాలానికి పన్నెండు రాష్ట్రాల సభ్యులు ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా శాఖ చైర్మన్‌గా, ఆయన అనేక మానవతా మరియు సమాజ సేవా ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు, ఈ ప్రాంతంలో రెడ్ క్రాస్ ఉద్యమాన్ని గణనీయంగా బలోపేతం చేశారు. రెడ్ క్రాస్‌కు ఆయన చేసిన అత్యుత్తమ కృషికి గుర్తింపుగా, ఆయనకు 2018-19 సంవత్సరానికి రాష్ట్రపతి బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. జాతీయ మేనేజింగ్ బాడీలోకి ఆయన చేరిక దక్షి ణ భారతదేశం అంతటా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ క్రాస్ సేవా ప్రాజెక్టుల పరిధి మరియు ప్రభావాన్ని మరింత

# నెల్లూరు నగర శివార్లలో రోడ్డు ప్రమాదం

## - ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** నెల్లూరు నగర శివార్లలోని ప్రశాంతి నగర్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. కోవూరు పట్టణ పరిధిలోని ఇంద్రలోక్ అవెన్యూలో షేక్ మస్తాన్ వలి డ్రై క్లీనర్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రముఖ హాస్పిటళ్లు, హోటళ్లలోని దుప్పట్లు, బెడ్ షీట్లు ఇతర దుస్తులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకొని శుభ్రపరచి తిరిగి అందజేస్తుంటారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం మస్తాన్ వలీ కుమారుడు షేక్ మన్సూర్ (28), తమ వద్ద వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్న విడవలూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి (49), తమ వద్ద పనిచేసే అనిల్, షమీమ్, అన్సార్ అనే వారిని వెంటబెట్టుకుని శుభ్రం చేసిన దుస్తులను తమ వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు బయలుదేరారు.

ఈ క్రమంలో జాతీయ రహదారిపై పెన్నా వంతెన దాటగానే మూడవ మైలుకు వెళ్లే సర్కిల్ సర్కిల్ వద్ద వెనుక నుండి వస్తున్న లారీ వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుండి బలంగా ఢీ కొట్టింది. దీంతో వీరి వాహన ముందు ఉన్న మరో లారీని వెనుక నుండి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న సురేష్ రెడ్డి, అతని పక్కన సీటులో కూర్చున్న మన్సూర్‌లు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం ట్రక్కులో కూర్చున్న అన్సార్, షమీమ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ బలరామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని శతకాత్రులను అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం వలన జాతీయ రహదారిపై స్తంభించిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# రైతుకు కనీస మద్దతు ధర అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

## - కేంద్ర ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, ఎంపి లావు శ్రీ కృష్ణ దేవరాయలు

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో భారత ప్రభుత్వం ద్వారా 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు తెలిపారు. నగరంలోని పటమట యనమల కుదురు రోడ్డులోని భారత ఆహార సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని చైర్మన్, పార్లమెంట్ సభ్యులు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ లావు శ్రీ కృష్ణ దేవరాయలు పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష ్యమన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రైతుకు అందించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ఏడాది ఖరీఫ్ లో 15.92 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ ద్వారా కొనుగోలు చేసామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. ఎఫ్ సీఐ నుంచి పంజాబ్ రాష్ట్రం తర్వాత 14 లక్షల టన్నుల బియ్యాన్ని 10 బ్రోకెన్ తో సేకరించడానికి అనుమతి ఉన్న రెండవ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని ధాన్యం కొనుగోలు పెంచాలని కోరటం జరిగిందని, దానికి అనుగుణంగా కేంద్ర ప్రభ ుత్వం లక్ష్యాన్ని పెంచిందన్నారు. గత రబీ సీజ్ లో 9.93 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది రబీలో కొనుగోలు లక్ష్యాన్ని పెంచే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసాయని దాంతో పంట గిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పల్నాడు జిల్లాల్లో గిడ్డంగుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం మంజూరు చేస్తే కొత్త వాటిని భారత ఆహార సంస్థ నిర్మించేందుకు తమ సంసిద్ధతను తెలియజేసిందన్నారు. భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో సోలార్ విద్యుత్ కు 45 మెగా వాట్స్ ఉత్పత్తి సామర్ధం కలిగిన ప్లానెల్స్ పెట్టుకోగల అవకాశం కలిగి ఉందని వివరించారు. పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ: భారత ఆహార సంస్థ ద్వారా ప్రతి నెలా 1.54 లక్షల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ అవుతుందన్నారు. ఫోర్టిఫైడ్ రైస్ ను రాష్ట్రంలో 24.47 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం క్రింద, మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని 55,746 అంగన్వాడీ కేంద్రాలకు ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తొలుత నిర్వహించిన సమీక్షా సమావేశంలో భారత ఆహార సంస్థ కొనుగోలు, నిల్వ, పంపిణీ కార్యకలాపాలపై కమిటీ సభ్యులు, అధికారులతో చైర్మన్ చర్చించారు. రైతులకు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర (లీలీశి) ప్రయోజనం కల్పించేలా, ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రయోజనం చేకూర్చే విధంగాను సమీక్షి ంచారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, భారత ఆహార సంస్థ ఏపీ రీజనల్ జనరల్ మేనేజర్ విజయ కుమార్ యాదవ్, సివిల్ సప్లైస్ అధికారులు, భారత ఆహార సంస్థ అధికారులు, భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి అనుచరుడు మృతి

**బిట్రగుంట (నెల్లూరు), అక్టోబర్ 13, ప్రభాతవార్త :** బోగోలు మండలం ముంగమూరు క్రాస్ రోడ్ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధనరెడ్డి ముఖ్య అనుచరుడు పాలవెల్లి. పద్మనాభరెడ్డి (59) మృతిచెందారు. కావలి నార్త్ జనతాపేటకు చెందిన పద్మనాభరెడ్డి తమ నేత విష్ణువర్ధనరెడ్డి అల్లూరుకు వచ్చి ఉన్నాడని తెలుసుకొని ఆయనను కలిసేందుకు మోటార్సైకిల్ పైన కావలి నుండి బయలుదేరి మార్గమధ్యంలో పెట్రోల్ పట్టించుకునేందుకు రోడ్డు క్రాస్ చేస్తున్నప్పుడు కావలి నుండి నెల్లూరు వైపు వెళ్లే కారు వెనుకనుండి మోటార్సైకిల్ ను డీకొనడంతో తీవ్రగాయలు అయినాయి. ప్రమాదంజరిగినవెంటనే మెరుగైన చికిత్స కోసం నెల్లూరు లోని ఓప్రైవేట్ వైద్యశాలకు తరలిస్తుండటంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటనతో విష్ణు అనుచరులు తీవ్ర కలత చెందారు. కేసును బిట్రగుంట ఎస్ఐ ప్రభాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీశైలంలో నూతన బోర్డు ప్రమాణస్వీకారం

## పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**శ్రీశైలం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** శ్రీశైలం దేవస్థానంలో నూతనంగా ప్రభుత్వం ప్రకటించిన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం అట్టహాసంగా ప్రారంభమైంది స్థానిక చంద్రవతి కళ్యాణ మండపంలో శ్రీస్వామి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి కర్పూరహారతులిచ్చి అనంతరం పాలక మండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు,సభ్యులు మొత్తంగా 17 మందితో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు అట్టహాసంగా ప్రారంభమైన ట్రస్ట్ బోర్డ్ ప్రమాణస్వీకారంలో ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు బోర్డ్ సభ్యులలో ఇద్దరు సభ్యులు గైర్హాజరు అయ్యారు అయితే నేడు ప్రమాణస్వీకారం చేసిన చైర్మన్, సభ్యులు రెండు సంవత్సరాల పాటు దేవస్థానం ధర్మకర్తల మండలిగా కొనసాగనుంది.

# టపాసులు ఐదు కిలోలకు మించితే పోలీసు అనుమతి తప్పనిసరి

## దుకాణాలు, గోదాములు వద్ద తగిన భద్రత

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాత వార్త:** టపాసుల దుకాణాలకు, గోదాములకు పోలీ సు, ఫైర్ సర్వీస్ శాఖలు అనుమతులు ఇస్తుండడం తెలిసిందే. అయితే ఈసారి కొత్తగా టపాసులు కొనేవారు భారీగా అంటే ఐదు కిలోలు అంతకు మించి ఎవరైనా ఖరీదు చేసి, తమ ఇళ్లలో నిలువచేస్తే పోలీసు, ఫైర్ సర్వీస్ శాఖల నుంచి అనుమతులు తీసుకో వాల్సి వుంటుంది. దీనిపై పోలీసులు టపాసుల దుకాణాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

# 2030 నాటికి అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక స్థానంగా ఎపి

## - పర్యాటక మంత్రి కందుల దుర్గేష్



విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి: దేశంలో పర్యాటక రంగం అభివృద్ధికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ 202526 ప్రకటనల అమలుపై రాష్ట్ర విజన్‌ను సమర్పించేందుకు అక్టోబర్ 14, 15 తేదీల్లో రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్‌లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన జరుగనున్న జాతీయ మిషన్ లో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట పాల్గొననున్నారు. దేశంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల 50 పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల కల్పన కోసం ఉద్దేశించిన జాతీయ మిషన్ పై చర్చించేందుకు ఏపీ ప్రభుత్వం తరపున ప్రతినిధిగా మంత్రి కందుల దుర్గేష్ బృందం హాజరుకానుంది. ఈ సందర్భంగా జాతీయ మిషన్ క్రింద ఆంధ్రప్రదేశ్ తరపున పర్యాటక ప్రతిపాదనలను మంత్రి దుర్గేష్ వివరించనున్నారు. ఈ చారిత్రాత్మక సమావేశంలో జాతీయ మిషన్ లక్ష్యాల సాధనకు చేయనున్న కృషి, ప్రైవేట్ పెట్టుబడులు, స్థానిక ఆర్థిక వృద్ధికి అందించే ప్రోత్సాహం, యువతకు ఉపాధి కల్పన, రాష్ట్ర పర్యాటక శాఖలో అవలంభిస్తున్న విధానాలు, పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లకు అందిస్తున్న ప్రోత్సాహకాలు తదితర అంశాలపై కూటమి ప్రభుత్వం తీసుకోనున్న చర్యలను వెల్లడించనున్నారు. అంతేకాదు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం, పర్యాటకులకు అద్భుత అనుభవాలను కల్పించే లక్ష ్యంతో ఏపీ ప్రభుత్వం పని చేస్తున్న తీరుపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. 2030 నాటికి ఆసియాలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానాలలో ఏపీని ఒకటిగా నిలిపేందుకు తీసుకోనున్న చర్యలను సమావేశంలో వివరించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో ఎంపిక చేసిన ప్రధాన పర్యాటక గమ్యస్థానాలను రాష్ట్రాల భాగస్వామ్యంతో ఖఛాలెంజ్ మోడ్ఖ లో కేంద్రం అభివృద్ధి చేయనుంది. పర్యాటక సౌకర్యాలు, పరిశుభ్రత, మార్కెటింగ్ ప్రయత్నాలతో సహా సమర్థవంతమైన గమ్యస్థాన నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు అందించనుంది. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల మౌలిక సదుపాయాల నిర్మాణానికి అవసరమైన భూమిని రాష్ట్రాలు అందించాల్సి ఉంటుంది.

# విశాఖ సదస్సు లక్ష్యం పెట్టుబడుదారుల ఆకర్షించడమే!

## - సిఐఐ భాగస్వామ్య సదస్సు సన్నాహకాలపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకట్టుకోవడం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడంతో పాటు సరికొత్త ఆలోచనలకు సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదిక కావాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను భారత ఆర్థిక, సాంకేతిక ప్రగతిలో అగ్రగామిగా ప్రతిష్ఠించడమే లక్ష ్యమని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ సన్నాహకాలపై సచివాలయంలో సోమవారం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సీఐఐ సదస్సుకు ముఖ్య అతిధిగా ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాలని నిర్ణయించినట్టు సీఎం తెలిపారు. అలాగే వివిధ దేశాల వాణిజ్య మంత్రులను, లీడింగ్‌గ్లోబల్ సీఈవోలను ఆహ్వానించాలని నిర్దేశించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పాలసీ థింకర్లు, అకడమిక్స్‌కు సదస్సులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్లోబల్ టెక్ ట్రాన్స్ ఫర్మేషన్, గ్లోబల్ ట్రస్ట్ పెంచుకోవడం, గ్లోబల్ ట్రేడ్‌లో దేశం వాటా పెరగడం సదస్సు లక్ష ్యంగా ఉండాలని సూచించారు. అతిథులకు అన్ని సౌకర్యాలతో ఆతిథ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని, విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. అలాగే గూగుల్ వంటి అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి.

రాష్ట్రం త్వరలోనే కృత్రిమ మేధస్సు, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుంది. సదస్సులో ఈ అంశాలు, రాష్ట్ర ఆకాంక్షలు ప్రతిబింబించాలి. సదస్సు ఏర్పాట్లకు సమయం తక్కువ ఉన్నందున... వేగంగా పనులు పూర్తి చేయాలి. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు నవ్యాంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం ఇది 4వ సారి. గతంలో 2016, 2017, 2018లో మూడు సార్లు విశాఖలోనే నిర్వహించారు. ఇప్పుడు విశాఖనే సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈసారి సీఐఐ సదస్సు టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్‌నావిగేటింగ్ ది జియోఎకనామిక్ ఆర్డర్ థీమ్‌తో మొత్తం 13 సెషన్లుగా జరగనుంది. 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది దేశ, విదేశీ సీఈవోలు, 40 దేశాల నుంచి ప్రతినిధులు, అలాగే 13మంది కేంద్ర మంత్రులు ఈ సదస్సుకు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. జీ20 దేశాలు, మిడిల్ ఈస్ట్, యూరప్, ఆసియా, పశ్చిమాసియా తదితర ప్రాంతాల నుంచి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది.

ట్రేడ్, జియోఎకనామిక్ ఫ్రేమ్ వర్క్, టెక్నాజజీఇన్నోవేషన్, డిఫెన్స్, ఏరోస్పేస్, హెల్త్ కేర్, బయోటెక్నాలజీ, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్ సప్లయ్ చైన్, సస్టెయినబిలిటీక్లీన్ ఎనర్జీ, లెవరేజింగ్ టెక్నాలజీ అంశాలపై సెషన్లు జరుగుతాయి.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 14 - అక్టోబర్ - 2025



## జీవన ఎరువుల వినియోగంతో భూసారం పెంపొందించవచ్చు : ఏరువాక కో-ఆర్డినేటర్ డాక్టర్ నందకిషోర్



**అంబాజీపేట, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
వరి సాగులో జీవన ఎరువుల వినియోగంతో 25 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవడంతో పాటు భూసారం పాడవకుండా కాపాడుకోవచ్చని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా ఏరువాక కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ తెలిపారు. మండలంలోని పుల్లేటికుర్రు గ్రామ సచివాలయం వద్ద జీవన ఎరువులు-వినియోగం పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచి జల్లి బాలరాజు అధ్యక్షతన జరిగిన అవగాహన సమావేశంలో డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ ఈనెల 13 నుండి 17 వరకు జీవన ఎరువులు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని,దీనిలో భాగంగా పుల్లేటికుర్రులో స్థానిక రైతులతో అవగాహన సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. జీవన ఎరువులు అంటే ఏమిటి, అవి ఎన్ని రకాలు, వాటిని ఎలా వృద్ధి చేసుకొని పొలంలో ఎంత మోతాదులో వాడుకోవాలి, వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. జీవన ఎరువుల్లో ముఖ్యంగా అజ స్పైరిల్లమ్, అజోల్లా అజాటోబాక్టర్, సూడోమోనాస్, పాస్పేట్ సాల్ బ్లూ లైజింగ్ బ్యాక్టీరియా, పొటాస్ సాల్ బ్లూ లైజింగ్ బ్యాక్టీరియా మొదలగు వాటి గురించి రైతులకు వివరించారు.

జీవన ఎరువులు కావలసిన వారికి అమలాపురం ఏరువాక కేంద్రంలో అందుబాటులో ఉంచామని డాక్టర్ నందకిషోర్ తెలిపారు. ' గ్రామీణ వ్యవసాయ పని అనుభవం కార్యక్రమం' ( రావేప్) లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు జాబేజ్ శాస్త్రి, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అంబాజీపేట విద్యార్థి



**అంబాజీపేట, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అంబాజీపేట విద్యార్థి ఎంపికైనట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థిని పలువురు సోమవారం అభినందించారు. ఈ నెల 10 నుంచి 12 వరకు బాపట్ల జిల్లా పేటేరు జెడ్పీ హైస్కూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ లో 20 కేజీల విభాగంలో కుడుపూడి కావ్య సుందరి హరిప్రియ మొదటి స్థానం సాధించగా, 24 కేజీల విభాగంలో ఎరుబండి ఇషా నాగ శ్రీనిజ రెండవ స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చిన కుడుపూడి కావ్య సుందరి హరిప్రియ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయిందని సీనియర్ కోచ్ త్రిమూర్తులు తెలిపారు. త్వరలో పంజాబ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పాల్గొంటుందని తెలిపారు.జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కావ్య సుందరి హరిప్రియను, కోచ్ లు త్రిమూర్తులతో పాటు పితాని భార్గవి శ్రీకళ, నారాయణలను పలువురు అభినందించారు.

## ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ ను సత్కరించిన సూర్యకిరణ్



**శంఖవరం, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
సాంకేతిక నిర్వహణ సంస్థ కమిటీ( ఆత్మ) వైస్ ఛైర్మన్ గా నియమింపబడిన కరణం సుబ్రహ్మణ్యం నో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ ఘనంగా సత్కరించారు . మండలంలోని కత్తిపూడి లో గల బాబి స్వగృహంలో సోమవారం ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ ను కమిటీ మెంబర్లు గా నియమించబడిన తుమ్మల సత్యేంద్ర నాధ్ పల్లా శ్రీను ని మరియు జిల్లా దిశ కమిటీ మెంబర్ గా నియమించబడిన జర్త సరస్వతి ని చిరు సన్మానం చేసి శుభాభినందనలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ వ్యవసాయ దారులకు ఆత్మ సంస్థ చేదోడు వాదోడుగా ఉండాలని రైతుల అవసరాలను గుర్తించి వాటికి అవసరమైన ప్రణాళికలను అమలు చేయాలని కోరారు తనకి పదవి కల్పించిన ప్రత్తిపాడు శాసనసభ్యులు వరుపుల సత్య ప్రభ కు కూటమి నేతలకు సుబ్రమణ్యం కృతజ్ఞతలు తెలియజేశారు రైతుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు

## ఎమ్మెల్యే బండారు కి ఆహ్వానపత్రిక ను అందజేసిన ఉప కమీషనర్, నల్లం సూర్య చక్రదరరావు, చైర్మన్, ముదునూరి వెంకటరాజు



**ఆత్రేయపురం, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త )**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాడపాలెం గ్రామంలోని కొత్తపేట ఎమ్మెల్యే, బండారు సత్యానందరావు నివాసంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.నియోజకవర్గ వ్యాప్తంగా సాయంత్రం 6 గంటల నుంచి ప్రతి గ్రామం నుండి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

## శ్రీ భావనారాయణ స్వామి హుండీ లెక్కింపు



**కాకినాడ రూరల్, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
సర్పవరం శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానంలో సోమవారం దేవదాయ శాఖ అధికారులు వి ఫణింద్ర కుమార్, ఎం ఎం వీరభద్రరావు, కె వి వి వేణుగోపాలరావు పర్యవేక్షణ లో హుండీ లెక్కింపు చేపట్టారు. గడిచిన ఏడు నెలలకు గాను రూ. 6,07,574లు ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో పారాయణం సిబ్బంది, గ్రామస్తులు అర్చకులు పాల్గొన్నారు. ఈవో మాట్లాడుతూ దేవస్థానంలో నిత్యాన్నదానం ఏర్పాటు చేయుటకు , ఆలయ గోసాలలో గోవుల సంరక్షణకు భక్తులు విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు.

# ఈ నెల 17న రాజోలు లో డి.సి.ఎం పవన్ కళ్యాణ్ పర్యటన

## ఏర్పాట్లపై ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష



**కోనసీమ బ్యూరో, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
ఈనెల 17న రాజోలు నియోజకవర్గం లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ పల్లె పండుగ 2.0 పనులను ప్రారంభించ నున్నా రని రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులతో ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రాథమిక స్థాయి సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ మొట్టమొదటి సారిగా రాజోలు నియోజక వర్గం పర్యటనకు వస్తున్నందున పక్కాగా ఏర్పాట్లుచేసి విజయవంతం చేయాలని జిల్లా స్థాయి అధికారులను ఆయన కోరారు. శంకరగుప్తం మురుగు కాలువ విధ్వంసం మూలంగా 15 గ్రామాల్లో ఉప్పు నీరు పైకి రావడం డ్రైనేజీ పూడిక తీయకపోవ డంతో సుమారు అర్థ కిలోమీటర్ పొడవునా డ్రైనేజీ నీరు పైకి పొంగి ప్రవహించడంతో సుమారు లక్ష కొబ్బరి చెట్లు చనిపోయి రైతులు తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొన్నారన్నారు. ఇటీవలనే శంకర్ గుప్తం డ్రైన్ ను రాష్ట్ర జలవన రుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించి పూడికతీత కొరకు 9 కోట్ల 7 లక్షలు గ్రాంట్ ఇప్పిస్తానని అదే విధంగా గట్లు బలోపేతానికి 6 కోట్లు నిధులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నా రు. ఇదే విషయమై శాసనసభ సమా వేశాలలో ఉప ముఖ్య మంత్రితో చర్చించడం జరిగిందని ఈ మేరకు ఆయన స్వయంగా పరిశీలనకు రావాలని ఆహ్వానిం చడం జరిగిందని అదే విధంగా పల్లె పండుగ 2.0 పనులను ప్రారం భిం చేందుకు సి ఎస్ ఆర్ నేషనల్ గ్రీన్ ట్రిబునల్ నరేగా అనుసంధానంతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపనలు నిర్వహించేందుకు వస్తున్నట్లు వెల్లడించారు. ఉప ముఖ్య మంత్రి తొలుత కేసనపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్కు చేరుకొని బ్రిడ్జ్ వ్యూపాయింట్ నుండి డామేజీ నీ పరిశీలించి అనంతరం సుమారు 200 మంది రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారని చిన్న ప్రెస్ బ్రీఫ్ ఇస్తారని తెలి పారు. అనంతరం ముల్కీపల్లి సెంటర్ చేరుకొని కాట్రేనిపాడు లంక వద్ద 7 గ్రామాలకు రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదేవి ధంగా నరేగా అనుసంధానంతో జిల్లా కలెక్టర్ ప్రతిపాదించిన పనులకు శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమాలు నిర్వ హిస్తారన్నారు. రూ 3.4 కోట్లతో గుడిమేల్లంక రాపిడ్ పిల్లర్, ఎన్జీటీ నిధులతో రూ 7.5 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ పైప్లైన్ పనులకు శంకుస్థా పన చేస్తారన్నారు. పల్లె పండుగ 2.0 లో పూర్తి చేసిన 117 పనులను ప్రారంభిస్తారన్నా రు. ఆర్ అండ్ బి ద్వారా సు మారు రూ 7 కోట్లతో ఆరు పనులు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం సుమారు పదివేల మంది పాల్గొనేలా శివకోడు జాతీయ రహదారి సమీపంలో ఏర్పా టుచేసిన బహిరంగ సభలో పాల్గొని పల్లె పండుగ 2.0 గురించి ప్రసంగిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఆర్డిఓ రామచంద్రపురం కేసనపల్లి హెలిప్యాడ్ వద్ద,ఆర్డీవో కొత్తపేట వేదిక ఏర్పాటు, జిల్లా ఎస్పీ బహిరంగ వేదిక వద్ద శాంతి భద్రతల పర్యవే క్షణ, ఆర్డిఓ అమలాపురం మొత్తం కార్య క్రమం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏపీ ఈపీడీసీఎల్ పర్యటన ప్రదేశాలలో విద్యుత్ సరఫ రాను అందించాలన్నారు. వేదిక వద్ద త్రాగునీటి ఏర్పా ట్లు ఆర్డబ్ల్యూఎస్ విభాగం చేప ట్టాలన్నారు. కాన్వాయ్ ఏర్పాట్లు అదనపు ఎస్పి జిల్లా రవాణా అధికారి చేపట్టాలన్నారు. సిపిఓ నివేదిక తయారు చేయాలని జిల్లా పౌర సమాచార శాఖ మీడియా కోఆర్డి నేషన్ చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్,జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, డిఆర్ఓ కే మాధవి జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఈదరాడ ఎస్సీ పేటలకు రోడ్డు సదుపాయం కల్పించాలి




**మామిడికుదురు, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
మండల పరిధిలోని ఈదరాడ గ్రామంలోని కమ్మవారిలంక,కళింగుల పేటలకు రోడ్డు సదుపాయం కల్పించాలని కోరుతూ ఎంఆర్పిఎస్ నాయకులు సోమవారం అమలాపురం లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు.

2006 లో ఈ పేటలకు గ్రావెల్ రోడ్డు వేశారన్నారు. ప్రతీరోజూ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులు ఈరోడ్డు మార్గం ద్వారానే రావల్సి ఉందన్నారు. 500 మీటర్ల పొడవున్న ఈ ఐదు గ్రామాలకు అనుసంధానమై ఉన్న ఈ రోడ్డును సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ నిశాంతి కి వినతిపత్రం అందజేశారు.

ఎంఎస్ పి జిల్లా అధ్యక్షుడు నూటుకుర్తి సత్యనారాయణ,యార్లగడ్డ రవి,నామవరపు చిన సత్యనారాయణ,ముస్కుడి బాలాజీ,చింద్రిపు రాధాకృష్ణ తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు

## వ్యవసాయ రంగ అనుబంధ ఉత్పత్తుల వ్యాపారాలపై యువత మొక్కువ పెంచుకోవాలి : ఎమ్మెల్యే సత్య ప్రభ



**ప్రత్తిపాడు , అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
యువత వ్యవసాయ అనుబంధ సంస్థల వ్యాపారాలను నిర్వహించుకునీ, ఉపాధిని పొందుతూ ప్రభుత్వంపై ఆధారపడకుండా ముందుకు అడుగు వేయాలని స్తానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు..మండలంలోని ఒమ్మంగి గ్రామంలో టీడీపీ యువ నాయకుడు సుంకర భవాని నూతనంగా ఏర్పాటు చేసుకున్న సంఘం డైరీ పాల ఉత్పత్తుల కేంద్రాన్ని ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ యువత ఉన్నత చదువులు చదివినా కొలువుల కోసం ఎదురుచూడటం లేదని వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. ఎంచుకున్న లక్ష్యం కోసం అహర్నిశలు కష్ట పడుతున్నారని సొంతూళ్లలో చిరు వ్యాపారాలు చేస్తూ స్వయం ఉపాధి పొందంపై ఆసక్తి కనబర్చడం హర్షణీయమనారు. ఈ సందర్భంగా డైరీ నిర్వాహకుడు సుంకర భవాని మాట్లాడుతూ తమ కేంద్రం ద్వారా పాల ఉత్పత్తులు స్వీట్స్, రాగి జొన్న లడ్డూలు మల్టై లడ్డు, లస్సి తదితర నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని ఒమ్మంగి పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అమ రాధి వెంకటరావు, ఒమ్మంగి పిఎసిఎస్ చైర్మన్ సత్యం శెట్టి సీతారామం , రామిశెట్టి సీతారామయ్య (మున సబు) , వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకర సోమరాజు,శ్రీ భారతి విద్యాసంస్థల అధినేత సుంకర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ లో సందడి చేసిన హీరో కిరణ్ అబ్బవరం

### -"కె-రాంప్" సినిమాను ఆదరించాలని కోరిన కిరణ్



**గండేపల్లి , అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో "కె-రాంప్" సినీ హీరో కిరణ్ అబ్బవరం,యుక్తి తరేజా జంటగా నటించిన ఈ సినిమా ను జైన్స్ నాని దర్శకత్వం వహించారు, ఈ చిత్రం అక్టోబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది.సాయి కుమార్, వెన్నెల కిషోర్ చంద్రికా రవి వంటివారు నటించిన ఈ చిత్రం ప్రమోషన్ లో భాగంగా ఆదిత్య యూనివర్సిటీ కి వచ్చిన కిరణ్ అబ్బవరం కు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి పుష్పగుచ్ఛము అందించి సాదర స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన హీరో ఆదిత్య తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని ఆదిత్య అంటే తన సొంత సంస్థగా భావిస్తానని అన్నారు. ఈ నెల 18 న థియేటర్ లలో సందడి చేయనున్న తన "కె-రాంప్" మూవీ అందరూ థియేటర్ లోనే చూసి అఖండ విజయం అందించాలని కోరారు.

గత వైవిధ్య భరితమైన చిత్రాలవలె ఈ చిత్రం కూడా అందరికీ నచ్చుతుందని అన్నారు. ఆదిత్య ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆదిత్య యూనివర్సిటీ లో చిత్ర ప్రమోషన్ కు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

హీరో ను ఆనందంలో విద్యార్థులు ఉత్సాహంగా సెల్ఫీ లకు, ఫోటోలకు ఎగబడటం తో క్యాంపస్ లో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో డీన్ లు డాక్టర్ డి. కిషోర్,ప్రో. వి.సత్యనారాయణ, హాస్టల్ ఇంచార్జ్ జి. హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీ విజేతలుగా ఆర్మ్డ్ రిజర్వ్ టీమ్

### - రన్నర్ గా కాకినాడ సబ్ డివిజన్ , ఎస్పీ చేతుల మీదుగా మెడల్స్ , మెమెంటోలు అందజేత



**కాకినాడ రూరల్, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
విధి నిర్వహణలో నిత్యము శ్రమిస్తున్న పోలీస్ సిబ్బందికి ఆటవిడుపుగా ఫిట్ ఇండియా లో భాగంగా ఆరోగ్య పరిరక్షణలో కొత్త ఉత్సాహం కోసం ప్రజా భద్రతకై సేవలందిస్తున్న పోలీసు సిబ్బందికి ఆటవిడుపుగా, శారీరక దృఢత్వం పెంపొందించాలనే లక్ష్యంతో కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఎస్పీ క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీ - 2025"ఫైనల్ మ్యాచ్ లో విజేతలుగా ఏ అర్ టీమ్ మెడల్స్ సాధించారు. గత వారం రోజులుగా ఉత్సాహభరితంగా కాకినాడ ఆర్ఎంసి గ్రౌండ్లో కొనసాగినా లీగ్ మ్యాచ్ లలో కాకినాడ సబ్ డివిజన్, పెద్దాపురం సబ్ డివిజన్ , ఏఆర్ (ఆర్మ్డ్ రిజర్వ్) ,హోమ్ గార్డ్స్ జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. లీగ్ మ్యాచ్‌లలో ప్రదర్శన ఆధారంగా కాకినాడ సబ్ డివిజన్ టీం , ఏఆర్ టీం ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఫైనల్ మ్యాచ్ కాకినాడ ఆర్ఎంసీ గ్రౌండ్ లో ఉత్కంఠభరితంగా జరిగింది. అద్భుత ప్రదర్శనతో ఏఆర్ టీం విజేతగా నిలవగా, కాకినాడ సబ్ డివిజన్ క్రికెట్ టీం రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ అనంతరం విన్నర్, రన్నర్ లకు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, విజేతలకు ట్రోఫీ, మెమెంటోలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరక దృఢత్వం కలిగి ఉండటం అత్యవసరం అని, క్రమం తప్పకుండా క్రీడా కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అలాగే టీమ్ స్పిరిట్, సమన్వయం, మానసిక ప్రశాంతత పెంపొందించుకోవాలని సూచించారు. ఏ ఆర్ అదనపు ఎస్పీ యస్. శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, ఏ ఆర్ డీఎస్పీ వి. శ్రీహరి రావు, పెద్దాపురం సబ్ డివిజన్ అధికారి డి. శ్రీహరిరాజు, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ నాగ దుర్గారావు, ఏ ఆర్ ఆర్ఐ మూర్తి ఎస్ఐలు, కానిస్టేబుళు ,, హోమ్ గార్డ్స్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్ లో ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : ఎస్పీ బిందు మాధవ్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :**
కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ లో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పాల్గొని భూతగాదాలు, కుటుంబ కలహాలు, ఇతర విభాగాలకు చెందిన 65 ఫిర్యాదులను నేరుగా బాధితుల నుండి స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి ఏడు రోజులలోపు విచారణ చేపట్టి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు న్యాయం అందించడమే పోలీసులు కర్తవ్యం అని ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించి పోలీసులు పూర్తి కట్టుబాటుతో పనిచేస్తున్నారని అన్నారు.

# తొలిరోజు పది నామినేషన్లు దాఖలు

## రిక్షా తొక్కుతూ వచ్చి నామినేషన్ దాఖలు చేసిన టీఆర్‌పీఎస్ అభ్యర్థి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్),అక్టోబరు 13, ప్రభాత వార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా తొలి రోజైన సోమవారం పదిమంది అభ్యర్థులు నామి నేషన్లను దాఖలు చేశారు. పది మంది అభ్యర్థులు మొత్తం 11 సెట్ల నామినేషన్లను షేక్‌పేట మం డల కార్యాలయంలోని ఎన్నికల నామినేషన్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి పి. సాయి రాంకు తమ నామినేషన్లను అందించారు. ఇం దులో 8మంది స్వతంత్ర అభ్యర్థులు కాగా, ఇద్దరు పార్టీల నుంచి తమ నామినేషన్లను అందిం చారు. శ్రీకాంత్ సిలివేరు, పెసరికాయల పరీ క్షిత్‌రెడ్డి, చంద్రశేఖర్, సవవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీంఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్‌ఖాన్‌లు స్వతంత్రులుగా నామినేషన్లను దాఖలు చేయగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ సమితి(టీఆర్‌పీఎస్) నుండి పూస శ్రీనివాస్, నవతరం పార్టీ నుంచి అరవల్లి శ్రీనివాస్ రావులు దాఖలు చేశారు. టీఆర్‌పీఎస్ అభ్యర్థి రిక్షా తొక్కుతూ తనతోపాటు వచ్చిన ఇద్దరు డప్పు కళాకారులు మరో ఇద్దరు మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేసి వెళ్లారు. సల్మాన్‌ఖాన్ బోరబండ ప్రాంతం నుంచి భారీ ర్యాలీగా తరలివచ్చి నామి నేషన్‌ను దాఖలు చేశారు.

శ్రీకాంత్ సిలివేరు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా మిగిలిన అభ్య ర్థులు ఒక్కో నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా పోలీసు నోడల్ అధికారి, పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కృష్ణ, బంజారాహిల్స్ ఏసీపీ వెం కటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఇక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వంద మీటర్ల దూరంలోనే ర్యాలీలను నిలిపివేశారు.



సోమవారం ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు హరీష్‌రావు, తలసాని తదితరులు

# కారు కావాలా, బుల్డోజర్ కావాలా!

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు.

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), అక్టోబరు 13, ప్రభాతవార్త:** కారు కావాలా బుల్డోజర్ కావాలా అనేది జూబ్లీహిల్స్ ఓటర్లు నిర్ణయించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజక వర్గం లోని రహమత్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్‌లో నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీష్ రావు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే షకీల్, పి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ చీఫ్ విప్ దాశ్యం వినయ్ భాస్కర్, కార్పొరే టర్లు దేదిప్యా విజయ్‌కుమార్, రాజ్‌కుమార్ పటేల్‌లు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లా డుతూ రాష్ట్రంలో రైతులు, మహిళలు ఇబ్బం దులు పడుతున్నారని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడగొడితే ప్రతి పథకం రాష్ట్ర వ్యాప్తంగా అమలు అవుతాయని అన్నారు. హైడ్రా పేరుతో పెద్దోళ్ల ఇళ్లను కూల్చకుండా పేదోళ్ళ ఇళ్లను కూలుస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక్క ఇంట్లో 43 దొంగ ఓట్లు కాంగ్రెస్ నాయకులు రాయించారని ప్రజలు ప్రతీది గమనిస్తున్నారన్నారు. మాగంటి గోపినాథ్ రుణం తీర్చుకోవాలంటే నియోజకవర్గంలోని ఓటర్లు మాగంటి సునీత కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఒకప్పుడు తెలంగాణ అంటే పరిశ్రమలకు నిలయమని నేడు కాంగ్రెస్ పాలనలో తెలంగాణ దివాలా తీసిందని నవంబర్ 11న జరగనున్న ఉప ఎన్నికల్లో మాగంటి సునీ తాను గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందని కలిసికట్టుగా పనిచేయాలని ఏ కార్యకర్తకి ఎలాంటి సమస్య వచ్చినా తాము అందుబాటులో ఉండి అందర్ని ఆదు కుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని డివిజన్ల ఇంచార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కారు పాలన వద్దని కంటోన్మెంట్‌లోనే తేల్చారు

## హరీష్ రావుకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్

**హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త:** కారు పాలన వద్దని ప్రజలు కంటోన్మెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఎలా గెలిపించారో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు అలా గెలిపిస్తారని ఎమ్మెల్సీ దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం మాట్లాడుతూ తెలంగాణలో విధ్వసం సృష్టించింది బిఆర్ఎస్ కారు మాత్రమే అని ఆయన విమ ర్శించారు. మీ బామ్మర్ది, నువ్వు సెంటిమెంట్ తో ఎంత చేసినా ఉపయోగం లేదు హరీష్‌రావుకు హితవు చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారని ఆయన అన్నారు. మీ విధ్వంస, బుల్డోజర్ పాలనను తెలం గాణ ప్రజలు కోరుకోరని తెలిపారు. మీరు ప్రతి పక్షం లో లేరు, అసలు ఉనికిలోనే లేరు అని ఆయన చెప్పారు. మీరు ఇంకా గెలుస్తామని భ్రమల్లోనే ఉన్నారని ఎద్దేవా చేశారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 300నామినేషన్లు వేస్తాం

## తెలంగాణ మాలసంఘాల జెఎసి

**హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త:** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక కోసం జిల్లాల వారీగా 300 మంది మాలలు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలంగాణ మాల సంఘాల జేఏసీ ప్రకటించింది. రాష్ట్రంలో ఆరు నెలలుగా జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఎస్సీల్లోని 58 కులాలకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొంది. కాంగ్రెస్‌ను ఓడించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ ఛైర్మన్ మందాల భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్లో వారు మాట్లాడారు. ఎంపెరికల్ డేటా తీసు కుని, అన్ని వర్గాలతో చర్చించి వర్గీకరణ చేస్తామన్నారు. అవేవీ చేయకుండానే వర్గీకరణ చేసి 58కులాల గొంతుకోశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని జేఏసీ నేతలు తెలిపారు.




సోమవారం గన్‌పార్కు వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, నారగోని, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

# 18న జరిగే బిసిల బంద్‌ను విజయవంతం చేయాలి

## అన్ని వర్గాలకు పిలుపు నిచ్చిన తెలంగాణ బిసి జెఎసి

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 13 ప్రభా తవార్త:** బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన స్టేని నిరసిస్తూ ఈ నెల 18వ తేదీన నిర్వహించతలపెట్టిన 'తెలంగాణ రాష్ట్ర వ్యాప్త బంద్'ను విజయవంతం చేయాలని తెలం గాణ బిసి జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమ వారం గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బిసి జెఎసి ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, వైస్–ఛైర్మన్ వి.జి.ఆర్.నారగోని, వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌లు విదా , ఉద్యోగ, రాజకీయ రంగాలలో సాధించడానికి 18వ తేదీన నిర్వహిం చతలపెట్టిన బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. బిసిలు బిచ్చగాళ్ళు కాదని, రిజర్వేషన్‌లు తమ హక్కుని స్పష్టం చేశారు. రిజర్వేషన్‌లు సాధిం చేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు గుజ్జ కృష్ణ,గుజ్జసత్యం, రాజారామ్‌యాదవ్, ఎం. భాగ్యలక్ష్మి,నీల వెంకటేష్, సి.రాజేందర్, గణేషా చారి,జిల్లపల్లి అంజి, కుల్కచర్ల శ్రీనివాస్, వేము ల రామకృష్ణ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిపి పోస్టుల భర్తీకి డిసెంబర్ 14న రాత పరీక్ష

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు శాఖలో భర్తీ చేయనున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) పోస్టులకు వచ్చే డిసెంబర్ 14వ తేదీన రాత పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు జంట నగరాలతో పాటు శివార్లలో ఎంపిక చేసిన కేంద్రాలలో వుంటుందని పోలీసు ని యామక మండలి సోమవారం వెల్లడించింది. ఈ పోస్టులకు 3132 దరఖాస్తులు రాగా ఇం దులో 1908పురుష అభ్యర్థులవి, 1224 మహిళా అభ్యర్థులవిగా నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం అభ్య ర్థుల్లో 18శాతం ఓసి కేటగిరి, 47 శాతం బిసి కేటగిరి,26శాతం ఎస్‌సి కేటగిరి, తొమ్మిది శాతం ఎస్‌టికేటగిరి వారు వున్నారని ఆయన తెలిపారు. కాగా అభ్యర్థులకు ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు మూడుగంటల పాటు మొ దటి దఫాగా ఎంసిక్యూ టైప్‌లో 200 ఆప్‌జెక్టివ్ ప్రశ్నలువుంటాయి.

# హ్యామ్‌రోడ్ విధానంలో ఎన్‌హెచ్ నిర్మాణానికి కేంద్రం సమ్మతి

**హైదరాబాద్, అక్టోబరు13,ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలు జాతీయ రహదారులను హ్యామ్ విధానంలో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సమ్మతి తెలిపింది. అంతేకాదు దేశవ్యాప్తంగా పలు జాతీయ రహదారుల పనులు హ్యామ్ విధానంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.25,661 కోట్ల నిధులను జాతీయ రహదారులకు కేటాయిం చింది. రాష్ట్ర వ్యాప్తంగా 431 కిలోమీటర్ల మేర రహదారులను హ్యామ్ పద్ధతిలో నిర్మించేందుకు అంచనాలు రూపొందించారు. హ్యామ్ విధానంలో ఎన్ హెచ్‌ఎఐ నిర్మించే రహదారులను కేంద్ర ప్రభుత్వం, నిర్మాణ సంస్థలు 40:60 నిష్పత్తిలో నిధులు వ్యయాలను పంచుకొంటారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జాతీయ స్థాయిలో 124 జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. రూ.3,45,466 కోట్లతో 6,376 కిలోమీటర్ల మేర నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. రూ.500 కోట్ల కంటే ఎక్కువ ఖర్చు చేసి చేపట్టే ఈ రహదారుల నిర్మాణాల తాత్కాలిక జాబితాలో రాష్ట్రానికి చెందిన ఐదు జాతీయ రహదారులకు చోటు దక్కింది.ఆర్మూర్–జగిత్యాల, జగిత్యాల–మంచి ర్యాల్ కారిడార్లో భాగమైన జాతీయ రహదారిని నాలుగు లేన్లకు విస్తరించనున్నారు. అంతే కాకుండా జగిత్యాల– కరీంనగర్ మధ్యలో కూడా రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు. హైదరాబాద్ ట్రిపుల్ ఆర్, హైదరాబాద్–పనాజీ సెక్షన్ పరిధిలోని మహబూబ్ నగర్ నుంచి రాయచూర్ ఎన్.హెచ్ 167 రహదారి పనులు చేపట్టేందుకు మొత్తం రూ.25,661 కోట్ల నిధులు మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపా దించిన జాతీయ రహదారుల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు 160 కిలోమీ టర్ల రహదారి నిర్మాణానికి రూ.15,627 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీనిని జాతీయ రహ దారిగా గుర్తించి ఎన్.హెచ్161ఏఏ నెంబరును కూడా ఖరారు చేసింది.హైదరాబాద్‌పనాజీ సెక్షన్ పరిధిలోని మహబూబ్ నగర్ నుంచి రాయచూర్ ఎన్.హెచ్167 వెళ్లే రహదారి, మహబూబ్ నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడెబల్లూర్ (రాయచూరుకు సమీపంలో)వరకు ఉన్న 80కి.మీ డబుల్ రోడ్డును రూ.2,662 కోట్ల అంచనాతో ఫోర్ లైన్‌గా విస్తరించనున్నారు. జగిత్యాల–మం చిర్యాల్ జాతీయ రహదారి విస్తరణ పనులకు రూ.2,550 కోట్ల వ్యయంతో 68 కిలోమీటర్ల మేరపనులు చేపట్టనున్నారు. ఆర్మూర్‌జగిత్యాల 64కిలోమీటర్ల జాతీయరహదారి నిర్మాణానికి రూ.2,338కోట్లు మంజూరు చేశారు.జగిత్యాల కరీంనగర్59కిలోమీటర్ల జాతీయరహదారి నిర్మాణ పనులకు రూ.2,384కోట్లు మంజూరు చేశారు.

# నవంబర్ 19 నుంచి ఉచిత చీరెల పంపిణీ

**హైదరాబాద్,అక్టోబరు 13, ప్రభాతవార్త :** బతుకమ్మ కానుకగా ఇందిరా మహిళా శక్తి పేరుతో ఆడపడుచులకు చీరలు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పండుగ నాటికి చీరలు సిద్ధం కాకపోవడంతో పంపిణీ వాయిదా పడింది. వీటిని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఎట్టిపరిస్థితుల్లోనూ నవంబర్ 15 వరకు చీరల తయారీ పూర్తి చేసి.. పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పూల పండుగ బతుకమ్మ కానుకగా.. రాష్ట్ర మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.ఇందిరా మహిళా శక్తి పేరుతో చీరలు పంపిణీ చేయాలనుకుంది. కానీ అది సాధ్య పడలేదు. దీంతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసింది. పండుగ తర్వాత పంపిణీ చేస్తామని ప్రకటించింది. అయితే ఈ చీరల పంపిణీని దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి రోజున (నవంబర్ 19న) ప్రారంభిం చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేం కు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18,848 స్వయం సహాయకం బృందాల్లో (ఎస్‌హెచ్‌జీ) 1.94లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఈ గ్రూపుల్లో ఉన్న వారందరికీ.. ఒక్కో చీర చొప్పున ప్రభుత్వం పంపిణీ చేయనుంది. అంటే మొత్తం 1.94 లక్షల చీరలు అవసరం అవుతాయి. అయితే ఇందులో జిల్లాలకు 50 శాతం చీరలు మాత్రమే సరఫరా అయ్యాయి.వాటిని గోదాముల్లో భద్రపరిచారు. మిగతా 50శాతం చీరలు త్వరలో జిల్లాలకు సర ఫరా కానున్నాయి. చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు,కమిషనర్ శైలజా రామ య్యర్ చీరల తయారీ, పంపిణీ గురించి అది కారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# మంత్రి సీతక్కను కలిసిన బ్రాక్ ప్రతినిధులు

**హైదరాబాద్,అక్టోబరు 13, ప్రభాతవార్త:** సచివాల యంలో సోమవారం పంచాయతీ రాజ్, గ్రామీ ణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను బ్రాక్ ప్రతిని ధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలోని అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచే లక్ష్యంతో అమలవుతున్న తెలంగాణ ఇన్ క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రామ్ (టిజిఐఎల్‌పి)అమలు ప్రగతిపై ఈ సందర్భంగా వారు మంత్రికి నివేదిక అందజేశారు. బ్రాక్ సంస్థ సెర్ప్ కలిసి ఆదివాసీలు, జోగినీలు, ఇతర పేద కుటుంబాల ఆర్థిక సాధికారత కోసం పలు కార్యక్రమాలు చేపడుతోంది.ఎంపిక చేసిన పేద కుటుంబాలకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ప్రోత్సాహకాలు, లోన్లు, రాయితీలు అందించి, స్వయం ఆదాయ వసరులు సృష్టించేందుకు టిజిఐఎల్‌పి లక్ష్యంగా పెట్టుకుంది.ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 3554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, మండల మహిళా సమాఖ్య ద్వారా 108 మంది నిపుణులను నియమించి దీర్ఘకాలిక ఆదాయం మార్గాలు కల్పించి వారిని ఆర్థికం స్వాలంబన దిశగా తీసుకెళ్తున్నామని వారు వివరించారు. ఈ సమావేశంలో బ్రాక్‌ప్రతినిధులు గ్రెగరీ చెన్, శ్వే తా బెనర్జీ,ఉషారాణి, వి.రమేష్, అభిషేక్ ,సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎప్ సెట్ బైపిసి మొదటి ఫేజ్ కౌన్సెలింగ్‌లో

# 10,012 మందికి సీట్ల కేటాయింపు

## నేడు ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

## 51 కాలేజీల్లో 100 శాతం సీట్ల కేటాయింపు

## ఈడబ్ల్యూఎస్‌లో 462 మందికి సీట్లు

## సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 13:** ఇంటర్మీడి యట్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు ఎప్ సెట్–2025 ద్వారా.. బి ఫార్మసీ, పార్మా–డి, బైయో టెక్నాలజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాసూటికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి నిర్వహించే కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి విడత సీట్ల కేటాయింపును సోమవారం చేశారు. 10,708 సీట్లకి గానూ 10,012 సీట్లను మొదటి విడతలోనే కేటాయించారు. సీటు పొందిన విద్యార్థులు నేడు(మంగళవారం) ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని లేకపోతే సీటు రద్దవుతుందని సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. 71,309 మంది ఎప్‌సెట్–2025లో అర్హత సాధించగా వారిలో 15,775 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. వారిలో 15,192 మంది 3,90,122 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 10,012 మందికి సీట్ల కేటాయింపు చేయగా.. మరో 696 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 93.5 శాతం సీట్లను కేటాయించారు. మొదటి ఫేజ్‌లో 462 మంది ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లను కేటాయించారు. 51 కాలేజీల్లో 100 శాతం సీట్లను కేటాయించారు. వాటిలో 7 యూనివర్సిటీ కాలేజీలుండగా, ఒకటి గవర్నమెంట్ కాలేజీ ఉంది. మరో 43 ప్రైవేటు కాలేజీల్లో 100 శాతం సీట్లను కేటాయించారు. బి ఫార్మసీలో 122 కాలేజీల్లో 8686 సీట్లు అందుబాటులో ఉంటే.. అందులో 8017 సీట్ల(92.2శాతం)ను కేటాయించగా మరో 669 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఫార్మా డీలో 74 కాలేజీల్లో 1657 సీట్లు ఉంటే వాటిల్లో 1637 సీట్ల(98.7శాతం)ను కేటాయించారు. మరో 20 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. బయో మెడికల్ ఇంజనీరింగ్‌లో 2 కాలేజీల్లో 48 సీట్లు ఉంటే మొత్తం సీట్లను కేటాయించారు. బయో టెక్నాలజీలో 5 కాలేజీల్లో 202 సీట్లు ఉండగా వాటిలో కూడా 202 సీట్లను కేటాయించారు. మొత్తం 10,708 సీట్లకు గానూ 10,012 సీట్ల(93.5శాతం)ను కేటాయించగా మరో 696 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

# రూ.1,000 కోట్ల రుణానికి ఇండెంట్

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్ర సర్కార్ మరో 1,000 కోట్ల రూపా యల మేర రుణం కావాలని రిజర్వ్ బ్యాం క్‌కు ఇండెంట్ పెట్టింది. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ వేలం ద్వారా ఈ మొత్తం తీసుకుంటామని ప్రతిపాదించింది. ఇందుకు ప్రభుత్వం సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టనుంది. రిజర్వ్ బ్యాంక్ ఈ నెల 14న నిర్వహించే బహిరంగ వేలంలో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి 26 ఏండ్ల కాలానికి 1,000 కోట్ల రూపాయలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థికశాఖ ఇండెంట్ పెట్టినట్టు ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ఇప్పటికే ఈ ఏడాది ఒక్క ఆర్బీఐ నుంచే రాష్ట్ర ప్రభుత్వం 50 వేల కోట్ల రూపాయల రుణ సమీకరణ చేసింది. ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద 54,009 కోట్ల రూపాయలు సమీకరిస్తామని అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని రెండు త్రైమాసికా ల్లోనే 49,900 కోట్ల రూపాయల చొప్పున రుణాలను సేకరించింది. ఈ నేపథ్యంలో అదనపు రుణ సమీకరణ కోసం మూడో త్రైమాసికం కింద తమకు రూ.9,600 కోట్లకు ప్రతిపాదనలు పంపించినట్టు ఆర్బీఐ క్యూ3 క్యాలెండర్‌లో వెల్లడించింది.

# మాదక ద్రవ్య రహితంగా దేశం మారాలి

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 13:** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సోమవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఈ ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీలో యూనివర్సిటీ వైస్‌చాన్స్ లర్(విసి) ప్రొఫెసర్ సూర్య ధనుంజయ ముఖ్య అతిథిగా పాల్గొన్నాద. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లోకపావని, ఆంటీ డ్రగ్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ మాధురి ఠాగూర్‌తోపాటు యూనివర్సిటీ అధ్యా పక బృందంతో పాటు విద్యార్థినులు ఉత్సా హంతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విసి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ మాదక ద్రవ్య రహితంగా తమ యూనివర్సిటీతోపాటు తెలం గాణ రాష్ట్రం, మొత్తం దేశం కూడా మాదకద్రవ్య




మహిళా విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

రహితంగా మారాలని.. ఆ విధంగా విద్యార్థుల కృషి ఉండాలన్నారు. ఉత్తమ పౌరులుగా మారా లంటే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సమావేశానికి ఆత్మీయ అథితులుగా సుల్తాన్ బజార్ ఇన్స్పెక్టర్ కె. నరసింహా విద్యార్థుల ఉద్దేశించి ఉపన్యసిస్తూ యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ విషయాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు ఈ సమాజాన్ని ఏ విధంగా పట్టిపీడిస్తున్నాయో, అవి ఏ, ఏ రూపాలలో డ్రగ్స్‌గా విద్యార్థులకు అందుతున్నాయో ఇన్స్పెక్టర్ వివరించారు. ఇటువంటి ప్రమాదకరమైన డ్రగ్స్ తమను చేర కుండా ఎలా జాగ్రత్తతో ఉండాలో ఎస్ఐ సాయి రాం విద్యార్థినులకు వివరించారు. ర్యాలీ అనం తరం విద్యార్థినులచే ఇన్స్పెక్టర్ డ్రగ్స్‌కు వ్యతిరే కంగా ప్రమాణాన్ని చేయించారు.

# కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్,అక్టోబరు 13, ప్రభాతవార్త:** కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖ లైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశాడు, ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలు రుసుంపెట్టారని, పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశాడు.లాటరీలో షాపు దక్కక పోతే రూ.3లక్షలు ఆబ్కారీశాఖకే వెళ్తాయని, ఈ డబ్బును తిరిగిచ్చేలా ఆశాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశాడు, లిక్కర్ పాలసీపై జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరాడు.దీనిపై ఆబ్కారిశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

# ఎక్సైజ్ శాఖకు 97 మంది ఎస్సైలు

## వరంగల్ జిల్లాకు 63, హైదరాబాద్‌కు 34 మంది కేటాయింపు

**హైదరాబాద్,అక్టోబరు 13, ప్రభాతవార్త :** గ్రూపు 2 ద్వారా ఎక్సైజ్ ఎస్సైలుగా ఎంపికైన 97 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలిం చాలని ఇచ్చిన ఎక్సైజ్ శాఖకు అదేశాలు ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో గ్రూపు 2 ద్వారా వచ్చిన అభ్యర్థుల సరిఫికెట్ల పరిశీలిన చేపట్టారు. హైదరాబాద్‌కు 34 మందిని గ్రూపు 2 ద్వారా ఎస్సైలుగా ఎంపిక చేయగా సరిఫికెట్ల వేరిఫ కేషన్ కోసం 33 మంది హాజరయ్యారని హైదరాబాద్ డిప్యూటి కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.వరంగల్ జిల్లాకు చెందిన గ్రూపు 2 ద్వారా 63 మందినికేటాయించగా అందరు సరిఫికెట్ల వేరిఫికేషన్‌కు హాజరయ్యారని వరంగల్ డిప్యూటి కమిషనర్ జి. అంజన్‌రావు తెలిపారు. సర్టిఫికెట్ల వేరిఫికేషన్ వరంగల్ డిప్యూటి కమి షనర్‌కార్యాలయంలో జరిగినట్లు ఆయన తెలి పారు. హైదరాబాద్‌లో సర్టిఫికెట్ల వేరిఫికే షన్‌లో ఏఈఎస్‌లు స్మితసౌజన్య,మొహన్ బాబు పర్యవే క్షణలో జరగ్గా మరో ఏఈఎస్ శ్రీని వాసరావు కూడ ఈ సర్టిఫికేట్ల వేరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

# విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం కుట్ర

## సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కేంద్రంతో పోరాడాలి: తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 13:** దేశంలో విద్యుత్‌రంగాన్ని ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తే వ్యాపారవేత్త అదానీకే లాభం కలుగుతుందన్నారు. ఇదే జరిగితే ప్రజలు, రైతులు, వినియోగదారులు, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతితో కలిసి రాఘవులు మాట్లాడారు. విద్యుత్ సవరణ చట్టం–2025 పేరుతో ఈనెల 9న కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలను విడుదల చేసిందని రాఘవులు తెలిపారు. 30 రోజులపాటు అభ్యంతరాలను తెలపాలంటూ గడువు విధించిందని.. 2021లో విద్యుత్ చట్టానికి సవరణలను ప్రతిపాదిస్తే తీవ్ర ప్రతిఘటనతో వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. 2022లో మళ్లీ సవరణలు తెస్తే ప్రతిపక్షాలు వ్యతిరేకించాయనీ, దాన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి అప్పగించిందని వివరించారు. అది చట్టరూపం దాల్చలేదన్నారు. పాత అంశాలతోపాటు కొత్తవి జోడించి విద్యుత్ సవరణ చట్టం ప్రతిపాదనలను దుర్మార్గం, ప్రమాదకరంగా రూపొందించిందని విమర్శించారు. కొత్త చట్టం వస్తే సుమోటోగా ఏప్రిల్ ఒకటి నుంచి విద్యుత్ చార్జీల పెంపు అమల్లోకి వచ్చేలా మార్పులు చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రమాదకరమైన మార్పులకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజలు, రైతులు, సంఘాలు ముందుకు రావాలనీ, కేంద్రం తీరుకు నిరసనగా ఉద్యమించాలని రాఘవులు పిలుపునిచ్చారు. తెలంగాణలో కొత్త డిస్కం తేవాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని సీపీడీసీఎల్, ఎన్‌పీ డీసీఎల్ కాకుండా కొత్త డిస్కం ప్రతిపా దనలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాం డ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శిం చారు. బీసీ రిజర్వే షన్లపై రాష్ట్రంలోని కేంద్ర మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తేవాలనీ లేదంటే ఆ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చిన వెస్లీ అక్కడ తాము పోటీచేయడంపై నగర పార్టీతో చర్చిస్తామన్నారు. పోటీ చేయకుంటే బీజేపీని ఓడించే పార్టీకి మద్దతిస్తామని తెలిపారు. ఆర్ఆర్ఆర్ నిర్వాసి తులకు సంబంధించి రైతుల ఆమోదం లేకుండా భూమిని తీసుకోవద్దని, నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిం చాలని, రైతులతో చర్చలు జరపాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

# రూఫ్‌టాప్ సోలార్‌పై నిబంధనలు మార్పు

## రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సమాచారం

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రూఫ్‌టాప్ సోలార్ పాంట్ల విషయంలో కేంద్రం మార్పులు చేసింది. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన (పీఎంఎస్‌జీవై) పథకం కింద ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్లకు సంబంధించి ప్రత్యేక నెట్ మీటరింగ్ ఒప్పందాలు అవసరంలేకుండా నింబం ధనలు సడలింపు చేసింది. సూర్యఘర్ యోజన పథకానికి సంబంధించిన నిబం ధనలు మార్గదర్శకాలను మరింత సరళీకరిం చాలని కేంద్ర విద్యుత్తు శాఖ రాష్ట్రాలకు సమాచారం అందించింది. నెట్ మీటరింగ్ కోసం ప్రత్యేకంగా ఒప్పందాలు చేసుకోనవస రంలేదని స్పష్టం చేసింది, ఇందుకు గాను సూర్యఘర యోజన పోర్టల్‌లోని ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌లో డిజిటల్ ఒప్పందం చేసుకుంటే సరిపోతుందని స్పష్టం చేసింది. కర్ణాటక, గుజరాత్, జార్ఖండ్, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలు డిజిటల్ ఒప్పందాలను విజయవం తంగా అమలు చేస్తున్నాయని వెల్లడించింది. ఇదే విధానాన్ని మిగిలిన రాష్ట్రాలు కూడా అమలు చేయాలని తెలిపింది. అలాగే నెట్ మీటిరింగ్ చార్జీలను ఇప్పటికే 17 రాష్ట్రాలు మాఫీ చేశాయని పేర్కొన్నది. అంతే కాకుండా ఈ సోలార్ ప్లాంట్లకు వసూలు చేస్తున్న నెట్ మీటరింగ్ చార్జీలను కూడా మినహాయించాలని నిర్ణయించినట్లు రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు తెలియచేసింది.

# నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలి

## నారా వారి సారా మాకొద్దు బాబోయ్ అంటూ నినాదాలు



**కొత్తపేట , అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివైయస్ జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు అమూడా మాజీ చైర్మన్, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమ లాగా తయారుచేసి ప్రజల ప్రాణాలను హరిస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కొత్తపేట ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. డేవిడ్ రాజు ఇంటి వద్ద నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని,నారా వారి సారా మాకొద్దు బాబోయ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సిఐతో ముఖ్య నాయ కులు మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చల విడిగా జరుగుతున్న నకిలీ మద్యం విక్రయాలు,బెల్ట్ షాపుల గురించి ముఖ్య నాయకులు క్లుప్తంగా వివరించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగేపలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొత్తపేట నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్, నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 13 (ప్రభాతవార్త)** లైన్స్ క్లబ్ రాజమహేంద్రవరం సేవలలో భాగంగా ప్రెసిడెంట్ లయన్ కిరణ్ కుమారు సారద్యంలో చునీలాల్ జాజు మున్సిపల్ హైస్కూల్లో ఉన్న 400 మంది విద్యార్థులకు కళ్ళ పరీక్షలుచేసి, అందు సుమారు 50 మంది విద్యార్థులకు కంటి దోషములు గుర్తించారు. వారికి సోమవారం లైన్స్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, యానం చీఫ్ గెస్ట్ గా ఎస్తేమెడీ గెస్ట్ గా ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ గ్రంధి వెంకటేశ్వరరావు, స్పెషల్ ఇన్విటీగా రీజియన్ చైర్పర్సన్ లయన్ కొయ్యన కుమారి మరియు జోన్ చైర్ పర్సన్ లైన్ శ్రీరాం గుప్తా తదితరుల పెద్దల సమక్షంలో స్కూల్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి సహకారంతో విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు కంటిలోపాలు తీసుకోవలసిన ఆహారంలో సరైన బలం లేక సరైన పోషణ లేక విటమిన్ ఏ లోపం వల్ల ఇట్లా జరుగుతుందని సంబంధించిన కూరగాయలు, ఆకుకూరలు తినడం వల్ల వీళ్ళు ఈ బాధల నుండి ఉపశమనం జరుగుతుందన్నారు.

ఎస్తేమెడీ గెస్ట్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పిల్లలకి ఈ యొక్క కళ్ళజోడు ప్రాముఖ్యత తెలియజేసి జాగ్రత్తగా వాడుకోవాలని తెలియజేశారు .క్లబ్ అడ్మిన్ లయన్ గ్రంధి లక్ష్మీ వసంత కుమారి పర్యవేక్షణ చేయగా లయన్ నాగిరెడ్డి లయన్ నాగబాబు తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలపై వివక్షత విడనాడాలి : డా.శైలజ రాణి



**సీతానగరం , అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :** ఆడపిల్లలపై వివక్షత విడనాడాలని సీతానగరం పి హెచ్ సి వైద్యాధికారిణి డా.కె.శైలజ రాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో డా.కె.శైలజ రాణి ఆధ్వర్యంలో, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆడపిల్లలను రక్షిద్దాం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. శైలజ రాణి మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా, వారికి మగ పిల్లలతో సమానంగా జీవన, విద్యావ కాశాలు కల్పించి, అన్ని రంగాలలో భాగస్వామ్యం ఉండేలా చూడడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు ఎం.సుధామయి, ఎంపీ హెచ్ఈఓ వై.ఎన్. రాయుడు, పీహెచ్ఎన్ కె. ఆదిలక్ష్మి, ఏఎన్ఎం కె. శారద, వైద్య సిబ్బంది, బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

# మండలంలో విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

**కె గంగవరం , అక్టోబర్ 12 ( ప్రభాతవార్త ) :** గంగవరం మండలంలోని పలు జెడ్ పి పి పాఠశాల లో నూతనంగా 22 మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఎంపీపీ పాఠశాలలో ఒకరు సోమవారం తమ విధుల్లో చేరారు. కోటిపల్లిలో 2, సుందరపల్లి 4, పాముర్రు 3, బట్లపాలిక 5, దంగేరు 3 ,అద్దంపల్లి 1,కూళ్ళ 2, గంగవరం 2, శేరిలంక ఎంపీపీ పాఠశాలలో ఒకరు మొత్తం 23 మంది నూతన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తమ విధుల్లో చేరారని ఎంఈఓ సిహెచ్ ఆంజనేయులు, ఏ నాగరాజు తెలిపారు. వీరికి ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తో పాటు ఎంఈఓ లు అభినందనలు తెలియజేశారు

# వాడపల్లి 'శ్రీవారి' కళ్యాణం - కడురమణీయం

## అంబరాన్నంటిన నాల్గొవ రోజు బ్రహ్మోత్సవాలు

- ఎమ్మెల్యే బండారు తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు
- సింహ వాహనం పై యోగ నరసింహునిగా శ్రీనివాసుడు



**ఆత్రేయపురం , అక్టోబర్ 12 ( ప్రభాతవార్త ) :** ఏడువరాల స్వామిగా వెలుగొందుతున్న కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి.నాలుగవ రోజైన సోమవారం ఉదయం విష్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఋత్వికులు పుణ్యాహవచనము, అష్టకళశారాధన, మహా స్నపనము,ప్రధాన హెూమములు నిర్వహించారు.జగత్ కళ్యాణ నిమిత్తం శ్రీ శ్రీనివాస కళ్యాణం ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో అర్చక స్వాములు, వేద పండితులు కడు రమణీయంగా కళ్యాణం నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తరపున ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, చైర్మన్, ముదునూరి వెంకటరాజు, పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం



దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వస్తి వచనము, ప్రధాన హెూమములు, విశేషార్చన,చతుర్వేద స్వస్తి,దిగ్దేవతా బలిహరణ,నీరాజనమంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం వాహన సేవలో భాగంగా శ్రీనివాసుడు యోగ నారసింహ స్వామి అలంకరణలో సింహ వాహనంపై పురవీధుల్లో స్వామి వారు విహరించారు. ప్రహ్లాద రక్షకుడైన యోగ నారసింహ రూపంలో స్వామివారి దర్శనానికి భక్తజనం పోటెత్తారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు మహిళల కోలాటాల,కేరళ వాయిద్యాలు, సన్నాయి మేళం, వివిధ వేశాధారణలు నడుమ స్వామి వారి వాహన సేవ మాడ వీదులలో అంగరంగ వైభవంగా కొనసాగింది.





## డాక్టర్లకు పిహెచ్సి ఉద్యోగుల సంఘీభావం



**మామిడికుదురు,అక్టోబర్ 13 (ప్రభాతవార్త )** సమస్యల పరిష్కారం కోరుతూ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు విజయవాడలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు పిహెచ్సి ఉద్యోగులు సోమవారం సంఘీభావం తెలిపారు.ఈసందర్భంగా నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.ప్రభుత్వ డాక్టర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మేమూ మీవెంటే అంటూ నినాదాలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ బీవీవీ ప్రసాద్,ఫార్మాసిస్టు జి.దుర్గాప్రసాద్,స్టాఫ్ నర్సు డి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ కు ఎనిమిది అర్జీలు

**సీతానగరం, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ లో ఎనిమిది అర్జీలు అందాయని ఎంపీడీవో ఎం.భారతి తెలిపారు. రఘుదేవపురం గ్రామానికి చెందిన మేడిచర్ల మహాలక్ష్మి స్థలం రీసర్వే చెయ్యాలని అర్జీని అందించారు .చినకొండేపూడికి చెందిన దుగ్గిరాల మురళీకృష్ణ స్థల వివాదంలో మోసం, దాడులపై న్యాయం చేయాలని అర్జీని అందించారు. అలాగే, వలవల వెంకటరాజు తన వాటా స్థలం తక్కువగా ఉందని, సర్వే చేయాలని అర్జీ అందించారు. రాపాకకు చెందిన కటకం నాగమణి తన ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభాన్ని మార్పు చేయాలని ఆర్జీని అందించారు.

# వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం




**ఆత్రేయపురం , అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :** ఆత్రేయపురం మండల సర్వ సభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం పై పలువురు నాయకులు ధ్వజమెత్తారు. ఆత్రేయపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ హాలులో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పిటిసి సభ్యులు బోనం సాయిబాబా మాట్లాడుతూ ప్రజాసమస్యలు ప్రస్తావించడానికి సంబంధిత శాఖల ఇంజనీరింగ్ తదితర ఉన్నత అధికారులు హాజరు కాకపోవడం పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఊరూరు మద్యంబెల్ట్ షాపులు వెలిసాయని, అక్రమ మద్యం ఏరులై పారుతోందని, సార్వ వరి ధాన్యం కొనడానికి అధికారులు అలసత్వం వహిస్తున్నారని వంటి పలు సమస్యలు పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానంగా ఈ సమావేశానికి ఇరిగేషన్, డ్రైనేజీ, హెడ్ వర్క్స్, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులు హాజరుకాకుండా క్రింది స్థాయి అటెండర్లను సమావేశానికి పంపించడం పై సమావేశం తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో ఎంపీడీవో బీకేఎస్ఎస్, వెంకట రామన్, తహసీల్దార్, టీ రాజరాజేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెన్మత్స బంగారు రాజు వెలిచేరు ఎంపిటీసీ, వేముల వెంకన్నబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ లు ఉద్యాన శాఖ వివిధ శాఖల పనితీరుపై మండిపడ్డారు. నిర్వహించారు. మండలంలో రహదారులు ప్రధానంగా బొబ్బర్లంక రోడ్డు అద్వానంగా మారిందని వెంటనే అభివృద్ధి చేయాల్సిందిగా కోరుతూ సమావేశంలో సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పాడుపడిన అంగన్వాడీ కేంద్రాలను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని సభ్యులు కోరారు.

సమావేశంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు పాల్గొని తమ గ్రామాలలో సమస్యలను ప్రభుత్వం అధికారులు ముందు ఉంచారు. ఈ కార్యక్రమాలలో ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, రాంబాబు, చిన్న వెంకటరమణ, సర్పంచులు పాలా నాగేశ్వర రావు, గాదిరాజు రామకృష్ణం రాజు ,జుజ్జవరపు హరిబాబు, కాయల జగన్నాథం, మండల వ్యవసాయ అధికారి భార్గవ్ మహేష్, ఐసిడిఎస్ అధికారిణి పద్మావతి, వెలిచేరు వెటర్నరీ వైద్యులు ఎం సాయి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య ప్రొఫెసర్ వీరాస్వామి కి డాక్టరేట్



**గండేపల్లి , అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న "దాసరి వీరాస్వామి" హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల ఐ.టి. విభాగం ప్రొఫెసర్ డా.ఎ.వి.కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో దాసరి వీరస్వామి సమర్పించిన "థీసిస్ శీర్షిక 'అనలైజింగ్ స్టూడెంట్ అడాప్ట్ బిలిటీ ఇన్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ యూజింగ్ మెషిన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్స్ " అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డా. "దాసరి వీరస్వామి" భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్.డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో.ఎం.బి.శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డా.రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి. సురేష్, వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# బాలికలు విద్యార్థి దశ నుండి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**పిఠాపురం, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :** అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి. పురస్కరించుకొనిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో స్థానిక జగ్గయ్య చెరువు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల నందు ఐసి డిఎస్ ప్రాజెక్ట్ పిఠాపురం,జిల్లా బాలల పరిరక్షణ విభాగం సయుక్తంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం అక్టోబర్ 11న నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఒక అంశంపై అవగాహన కల్పించడం, ఈ సంవత్సరం, బాలికగా నాతోనే మార్పు, రండి ముందుకు అనే అంశంపై అవగాహన కల్పించడం జరిగిందని ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం పై, వివక్షత పై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, బాల్య వివాహాలు వల్ల జరిగే అనర్థాలను నివారించి వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. అమెరికన్ పౌర హక్కుల కార్యకర్త ఎలా రుజ్వేల్ట్ పుట్టిన రోజైన అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలిక దినోత్సవం గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది అని తెలియజేశారు. 2012 సంవత్సరం అక్టోబర్ 11న తొలిసారిగా ఈ దినోత్సవం ను జరపడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వేడుకలు అక్టోబర్ 11 నుండి 18 వరకు జరుగుతాయని ఈ సమావేశాలలో బాలికలకు వ్యాసరచన పోటీలు మరియు ఆటల పోటీలు నిర్వహించి వారికి అధికారులచే బహుమతులు అందజేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్. కె అరుణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలని విద్యార్థి లక్ష్యం వైపు తప్ప వ్యామోహాల వైపు మరల కూడదని తెలియజేశారు. బాలికలు విద్యార్థి దశ నుండి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాలికను రక్షిద్దాం,, బాలికను చదివిద్దాం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని చెప్పారు. ముఖ్య ంగా తల్లిదండ్రులు బాలలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు, అదేవిధంగా బాలలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని పిలుపు నిచ్చారు. ఎవరైనా ఆకతాయిలు బాలలను ప్రేమ పేరుతో వేధించిన లేదా లైంగిక వేధింపులకు గురిచేసిన బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112 కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. మండలంలో పలు పాఠశాలలో బాలికలకు వ్యాసరచన పోటీలు మరియు ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి దుర్గారాణి. ఐసిడిఎస్ సూపర్వైజర్ కె. ఎస్ అరుణ, గురుకులం ప్రిన్సిపల్ పి సుజాత, స్టాఫ్ నర్స్ సి.హెచ్ సుసన్న, తెలుగు టీచర్ శాంతి, అంగన్వాడీ కార్యకర్తలు టి వెంకట లక్ష్మి, పి నాగమణి, మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**సీతానగరం, అక్టోబర్ 13 ( ప్రభాతవార్త ) :** మండలంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సోమవారం అందజేశారు. మిర్తిపాడు గ్రామానికి చెందిన వాకలపుడి హనుమంతరావుకు రూ. 1,13 ,193. సింగవరం గ్రామానికి చెందిన నాగోతు కృష్ణమూర్తికి రూ. 82,950. సంగన వెంకటేశ్వర్లు రూ. 56,910. సీతానగరం గ్రామానికి చెందిన పోలిపర్తి బంగారమ్మకి రూ. 43,823. మునికూడలికి చెందిన ముసలపల్లి మహాలక్ష్మికి రూ. 30,000. విలువైన చెక్కులను అందించారు. చెక్కులను అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు బొడ్డు వెంకటరమణ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలవల రాజా, సర్పంచులు గెడ్డం తిమ్మారావు, సంగన చినపోశయ్య , సోషల్ మీడియా కన్వీనర్ పుక్కాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

## టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్:
# క్వార్టర్స్‌లోనే భారత్ నిష్క్రమణ
### 0-3 తేడాతో హాంకాంగ్ విజయం




**న్యూఢిల్లీ:** ఆసియా టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2025లో భారత పురుషుల విభాగం క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. భువనేశ్వర్‌లో జరిగిన ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల టేబుల్ టెన్నిస్ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో హాంకాంగ్ చేతిలో 0-3 తేడాతో ఓడిపోయింది. క్వార్టర్స్‌లోకి బై లభించిన తర్వాత, ఇద్దరు అరంగేట్ర ఆటగాళ్లతో కూడిన భారత జట్టు బలమైన ప్రత్యర్థులతో పోటీ పడలేకపోయింది. టైలోని మొదటి మ్యాచ్ ఆడుతున్న మనుష్ షా, వాంగ్ చున్ టింగ్ చేతిలో 0-3 తేడాతో ఓడిపోయాడు. ప్రస్తుత భారత జాతీయ ఛాంపియన్, అనుభవజ్ఞుడైన ప్యాడ్లర్ చేతిలో వరుస గేమ్‌లలో 5-11, 9-11, 11-13 తేడాతో ఓడిపోయాడు. భారత పురుషుల సింగిల్స్ ప్యాడ్లర్‌లో అత్యున్నత ర్యాంక్ పొందిన మానవ్ ఠక్కర్ తర్వాతి స్థానంలో నిలిచాడు. అతను చాన్ బాల్డ్విన్ చేతిలో 2-3 తేడాతో ఓడిపోయాడు. ఠక్కర్ మొదటి రెండు గేమ్‌లను 8-11 తేడాతో ఓడిపోయినా, తరువాతి రెండు గేమ్‌లను 12-10, 11-9 తేడాతో గెలిచి నిర్ణయాత్మక జట్టుకు చెక్ పెట్టాడు. అయితే భారత్ కెప్టెన్ బాల్డ్విన్ టాప్ స్పిన్‌ను ఎదుర్కోవడంలో విఫలమై 0-2 తేడాతో వెనుకబడి ఉండటంతో చివరి ఆటను 8-11తో వదులుకున్నాడు. భట్టాచార్జీ తీవ్రంగా పోరాడిన మూడో గేమ్‌ను 14-12 తేడాతో గెలుచుకున్నా తరువాతి రెండు గేమ్‌లను వరుసగా 6-11, 7-11 తేడాతో ఓడిపోయాడు. దీంతో భారత్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది.

## తొలి ఆర్చరీ ప్రీమియర్ లీగ్
# ఛాంపియన్‌గా రాజ్‌పుతానా




**న్యూఢిల్లీ:** తొలి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ ఛాంపియన్‌గా రాజ్‌పుతానా రాయల్స్ నిలిచింది. న్యూఢిల్లీలో జరిగిన ఈ ఆర్చరీ లీగ్‌లో రాజ్‌పుతానా ఉత్కంఠభరితమైన షూటాఫ్‌లో యోధాస్‌ను ఓడించింది. చివరికి రాయల్స్ టైటిల్ పోరులోకి తిరిగి దూసుకుపోవడమే కాకుండా షూటాఫ్‌లో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. టై బ్రేకింగ్ షూటాఫ్‌లో ఇది హిట్ అండ్ మిస్ మ్యాచ్‌గా మారింది. యోధాస్ జట్టు రాయల్స్ కు గట్టి పోటీ ఇచ్చినందుకు మాత్రమే కాకుండా మొత్తం 10 బాణాలతో 80 పాయింట్లు సాధించిన మొదటి జట్టుగా అవతరించింది. తొలి సెట్‌లో ఖడకే వేసిన బాణంతో యోధాస్‌కు తొలి సెట్‌లో 78-77 తేడాతో విజయం లభించింది. అయితే, రాయల్స్ తదుపరి సెట్‌లో 78-75 తేడాతో తిరిగి విజయం సాధించి ఫైనల్‌ను 2-2తో సమం చేసింది. మూడో సెట్‌లో యోధాస్ ఆర్చర్లు చరిత్ర సృష్టించి 80-77తో అపూర్వమైన స్కోరుతో విజయం సాధించారు. నాల్గవ సెట్ ముగిసే సమయానికి మ్యాచ్ కత్తిమీద సాములా సాగింది, యోధాస్‌కు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడానికి గ్రాండేకు 9 పాయింట్లు అవసరం అయినా అతను 8 చేయడంతో రాయల్స్ 78-77తో సెట్‌ను గెలుచుకుని 4-4తో నిలిచింది. దీంతో షూటాఫ్ నిర్వహించగా, గిబ్సన్, డియోటేల్ ఆ లక్ష్యాన్ని రెండుసార్లు ఛేధించడంతో రాజ్‌పుతానా రాయల్స్ విజేతగా నిలిచింది.

# విజయానికి చేరువలో టీమిండియా
### 58 రన్స్ దూరంలో వెస్టిండీస్ ఓటమి!

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ విజయం దిశగా దూసుకువెళుతోంది. 121 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నాలుగో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్ (25), సాయి సుదర్శన్ (30)లు ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 58 పరుగులు అవసరం కాగా చేతిలో 9 వికెట్లు ఉన్నాయి. 121 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. విండీస్ ఎడమ చేతి వాటం స్పిన్నర్ జోమెల్ వారికన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడేందుకు యత్నించి ఆండర్సన్ ఫిలిప్ క్యాచ్ అందుకోవడంతో యశస్వి జైస్వాల్ (8) పెవిలియన్‌కు చేరుకున్నాడు. దీంతో 9 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్‌ను కోల్పోయింది. ఆ తరువాత వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్‌తో కలిసి కేఎల్







రాహుల్ విండీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. వీలు చిక్కినప్పుడల్లా ఈ జోడి బంతిని బౌండరీకి తరలించింది. నాలుగో రోజు మరో వికెట్ పడకుండా రోజును ముగించింది. కాగా ఓవర్‌నైట్ 173/2 స్కోరుతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్ అద్భుతంగా పోరాడింది. మరో 217 పరుగులు జోడించి మిగిలిన 8 వికెట్లను కోల్పోయింది. కాంప్‌బెల్ (115), షై హోప్ (103) శతకాలు చేశారు. జస్టిన్ గ్రీవ్స్ (50), రోస్టన్ ఛేజ్ (40), జైడెన్ సీల్స్ (32) లు రాణించారు.
గ్రీవ్స్, సీల్స్ పదో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, బుమ్రాలు చెరో 3 వికెట్లు, సిరాజ్ 2 వికెట్లు, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ చెరో 1 వికెట్ సాధించారు. అంతకముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఆ తరువాత విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్‌కు 270 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఫాలో ఆన్ ఆడిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులు చేయగా, భారత్ ముందు 121 పరుగుల లక్ష్యం నిలిచింది.




# హరిహరన్‌కు డబుల్ స్వర్ణం

**న్యూఢిల్లీ:** టర్కియే ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో హరిహరన్ అంశకరుణన్ ఆధిపత్యం చెలాయించి డబుల్ స్వర్ణం సాధించాడు. ట్రీసా జాలీ, ఎమ్మార్ అర్జున్‌లతో కలిసి మిశ్రమ, పురుషుల డబుల్స్ టైటిళ్లను గెలుచుకున్నాడు. భారత బ్యాడ్మింటన్ ఏస్ హరిహరన్ ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి ఒకే రోజులో ట్రీసా జాలీతో మిక్స్‌డ్ డబుల్స్, అర్జున్‌తో పురుషుల డబుల్స్ టైటిళ్లను సాధించాడు. ఉత్కంఠభరితంగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో హరిహరన్-ట్రీసా జాలీ 52 నిమిషాల పోరాటం తర్వాత ఇండోనేషియాకు చెందిన ఎం నవాఫ్ ఖోయిరియాన్సా-నహ్యా ముహిఫాను 21-14, 18-21, 21-11 తేడాతో ఓడించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత వెంటనే, హరిహరన్ అర్జున్‌తో కలిసి కోర్టుకు తిరిగి వచ్చి పురుషుల డబుల్స్ ఫైనల్‌లో జపాన్‌కు చెందిన యుటో నోడా-షున్యా ఓటాను 21-13, 21-6 తేడాతో ఓడించి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఈ నెల ప్రారంభంలో అల్ ఇన్ మాస్టర్స్ 2025లో విజయం సాధించిన తర్వాత, ఈ విజయం హరిహరన్, అర్జున్ లకు వరుసగా రెండవ టైటిల్‌ను అందించింది. భారత జంటకు మొదటి రౌండ్‌లో బై లభించినప్పటికీ, రెండో రౌండ్‌లో జపాన్‌కు చెందిన యోషిఫుమి ఫుజిసావా-షుంటారో మెజాకిల నుంచి గట్టి పోటీ ఎదురైంది. అక్కడి నుంచి, వారు ఒక్క గేమ్ కూడా ఓడిపోకుండా టోర్నమెంట్‌లో ముందుకు సాగారు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో హరిహరన్-ట్రీసా పోటీ మొత్తంలో ఒకే ఒక గేమ్‌ను కోల్పోయారు. ఇతర భారత్ ప్లేయర్లలో లక్ష్య శర్మ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, ఆకర్షి కశ్యప్, అదితి భట్ మహిళల సింగిల్స్ రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించారు. మహిళల డబుల్స్‌లో వ్రూషా దుబే-రిధి కౌర్ టూర్, అశ్విని భట్-శిఖా గౌతమ్ కూడా రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు.

## మహిళల వరల్డ్ కప్..
# సెమీఫైనల్స్ సంక్లిష్టం
### 2 విజయాలు, 2 ఓటములతో భారత్

**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల ప్రపంచ కప్-2025లో టీమిండియా సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆస్ట్రేలియాపై 330 పరుగులు చేసినప్పటికీ, భారత మహిళా క్రికెట్ జట్టు మూడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లతో భారత్ మూడో స్థానంలో నిలిచింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన తర్వాత టీం ఇండియా సెమీఫైనల్‌కు ఎలా చేరుకుంటుందనేది ఇప్పుడు ప్రశ్న. భారత్ ఆడిన 4 మ్యాచ్‌ల్లో రెండింటిలో విజయం సాధించగా, మరో రెండింటిలో ఓటమి పాలైంది. దక్షిణాఫ్రికా కూడా 4 పాయింట్లతో ఉన్నా కానీ నెట్ రన్ రేట్ పరంగా వెనుకబడి ఉంది. దానికి ఇంకో మ్యాచ్ మిగిలి ఉంది. ఇంగ్లాండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లతో మిగిలిన




మ్యాచ్‌లు ఉన్నందున టీమిండియా ముందుకు సాగే మార్గం దాని చేతుల్లోనే ఉంది. ఈ రెండు మ్యాచ్‌లలో భారత్ గెలిస్తే, దాని నెట్ రన్ రేట్ ఈ జట్ల కంటే మెరుగ్గా ఉంటే, అది నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి ఎనిమిది పాయింట్లను కలిగి ఉంటుంది. భారత్ మిగిలిన మూడు మ్యాచ్‌లలో గెలిస్తే, అది నెట్ రన్ రేట్‌తో సంబంధం లేకుండా మొదటి నాలుగు స్థానాల్లో స్థానం సంపాదించుకుంటుంది. ఈ విధంగా టీం ఇండియాకు ఇంకా అవకాశం ఉంది. ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయినప్పటికీ, సెమీఫైనల్‌కు చేరుకోవాలనే భారత ఆశలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. అయితే టీమిండియా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడి నుండి గెలవాలి. టీమిండియా తన 3మ్యాచ్‌లలో రెండింటిలో ఓడిపోతే, సెమీఫైనల్‌కు వెళ్లే మార్గం చాలా కష్టమవుతుంది. న్యూజిలాండ్, ఇంగ్లాండ్ వంటి బలమైన జట్లతో ఇంకా ఆడాల్సి ఉండటం టీం ఇండియాకు ఆందోళన కలిగించే అంశం. ఇక అగ్రస్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతోంది. ఈ టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని జట్లు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మాత్రమే. ఆస్ట్రేలియా ఆడిన నాలుగు మ్యాచ్‌లలో మూడింటిలో గెలిచింది, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆస్ట్రేలియా 7 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ తన మూడు మ్యాచ్‌లలో మూడింటిలో గెలిచి 6 పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది.

## ఆల్‌టైమ్ రికార్డు దిశగా
# పసిడి పరుగు




### ప్రొద్దుటూరులో రూ.1,30,200
### హైదరాబాద్‌లో రూ.1,27,920
### అదేబాటలో వెండి ధరలు కూడా
### ఒక్కరోజే రూ.7వేలు పెరుగుదల
### వెండి కిలో రూ.1,97,000కు చేరిక

**ముంబయి, అక్టోబరు 13:** పసిడి ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తూ సరికొత్త గరిష్ఠాలకు చేరుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా 10 గ్రాముల ధర ఏకంగా లక్షా 25 వేల రూపాయల మైలురాయిని దాటి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ధన త్రయోదశి డిమాండ్‌తో ఈ వారాంతంలో పుత్తడి ధర దేశవ్యాప్తంగా రూ.1.30 లక్షలు దాటే అవకాశముందని బులియన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే ప్రొద్దుటూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,30,200 పలుకుతోంది. ఇక హైదరాబాద్‌లో సోమవారంనాడు పుత్తడి ధర రూ.320లు పెరిగి, రూ.1,27,920కు చేరుకుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.300 పెరిగి రూ.1,14,950 పలికింది. అటు కిలో వెండి ధర సోమవారంనాడు ఒక్కరోజే రూ.7 వేలు పెరిగి, రూ.1,97,000లకు చేరింది. ఈ నెల 9వ తేదీన, 10వ తేదీన వరుసగా రెండు రోజులూ రూ.7 వేలు చొప్పున పెరగ్గా, 11వ తేదీన రూ.6 వేలు పెరిగి రూ.లక్షా 90 వేలకు చేరగా, తాజాగా ఆ ధర రూ.1,97,000కు చేరింది.

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, ట్రంప్ టారిఫ్‌లు వెరసి అంతర్జాతీయ విపణిలో బంగారంపై మదుపర్లు ఆసక్తి కనబరచడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా తోడవడంతో పసిడి ధరలకు రెక్కలొచ్చాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది మరికొంతకాలం కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. వీటికి తోడు ధనత్రయోదశి డిమాండ్‌తో బంగారం ధరలు పెరుగుతున్నాయి. గత పది రోజులుగా పెరుగుతూ వస్తున్న పసిడి ధర, సోమవారం కూడా అదే జోరును కొనసాగించింది. బంగారంతో పాటు వెండి ధరలు కూడా పరుగులు పెట్టడం మార్కెట్‌లో కలకలం రేపుతోంది.
మరోవైపు వెండి ధర కూడా భారీగా పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో దాని ధర రూ. 1,97,000కు చేరింది. పండుగలు, శుభకార్యాలతో సంబంధం లేకుండా ధరలు వరుసగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత మార్కెట్ సరళిని బట్టి చూస్తే, సమీప భవిష్యత్తులో బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.
ఇక 2026 ఆరంభం నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.1.50లక్షలకు చేరొచ్చని ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,071.50 డాలర్లుగా ఉంది. ఈ వారాంతానికి ఔన్సు ధర 4,150 నుంచి 4,250 డాలర్లు చేరుకునే అవకాశముందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## వాణిజ్యం



# రెండు రోజుల లాభాలకు బ్రేక్
### నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, అక్టోబరు 13:** దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజులుగా కొనసాగుతున్న లాభాల జోరుకు సోమవారం అడ్డుకట్ట పడింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలు, ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 174 పాయింట్లు, నిఫ్టీ, 58 పాయింట్లు నష్టపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 173.77 పాయింట్లు (0.21 ) క్షీణించి 82,327.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 58 పాయింట్లు (0.23 ) నష్టపోయి 25,227.35 వద్ద ముగిసింది. చైనాపై కఠినమైన సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లను కలవరపెట్టాయి. మళ్లీ అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మొదలవుతుందనే భయాలు మదుపర్లలో అమ్మకాలకు దారితీశాయి. ఆదివారం నాటికి ట్రంప్ తన వైఖరిని కొంత సడలించినప్పటికీ, మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. దీనికి తోడు అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్, ఇటీవలి ర్యాలీల తర్వాత లాభాల స్వీకరణ వంటి అంశాలు కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. సెన్సెక్స్‌లో ప్రధానంగా టాటా మోటార్స్,ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్), పవర్ గ్రిడ్ షేర్లు నష్టపోయి సూచీని కిందకు లాగాయి. మరోవైపు అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడి నష్టాలను కొంతవరకు పరిమితంచేశాయి. రంగాలవారీగా చూస్తే, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 0.78 , నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 0.9 మేర నష్టపోయాయి. అయితే, వీటికి భిన్నంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ 0.35 లాభపడింది. బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 స్వల్పంగా 0.11 లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.17 నష్టపోయింది.
"నిఫ్టీ 25,000 కీలక మద్దతు స్థాయి పైన ఉన్నంతవరకు మార్కెట్ ట్రెండ్ సానుకూలంగానే ఉంటుంది. సూచీ 25,500 నిరోధక స్థాయికి చేరే అవకాశం ఉంది" అని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.




## హెచ్1బి వీసా ఫీజుల పెంపు ఎఫెక్ట్
# టిసిఎస్‌లో ఆ నియామకాల్లేవు
### -తేల్చిచెప్పిన సిఇఒ కృతివాసన్

**ముంబై, అక్టోబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బి వీసాల ఫీజు భారీగా పెంచిన నేపథ్యంలో టిసిఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ముఖ్యంగా ఈ ఏడాది హెచ్-1బి వీసా కింద కొత్త నియామకాలు చేపట్టబోమని టిసిఎస్ సిఇవో కృతివాసన్ స్పష్టం చేశారు. అమెరికాలో తమకు సరిపడా హెచ్-1బి ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. యూఎస్‌లో టిసిఎస్‌లో 32 వేల మందికి పైగా ఉండగా, అందులో దాదాపు 11 వేల మంది హెచ్-1బి వీసాపై వచ్చిన వారేనని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 500 మందిని ఈ వీసాలతో భారత్ నుంచి అమెరికాకు పంపించామని తెలిపారు. అయితే, ప్రస్తుతం ఏడాదిలో హెచ్-1బి కింద కొత్తగా ఉద్యోగ నియామకాల ప్రణాళిక లేదని టిసిఎస్ సిఇవో కృతివాసన్ తేల్చిచెప్పారు. స్థానిక ఉద్యోగుల నియామకాలే యథాతథంగా కొనసాగిస్తామన్నారు. అటు అమెరికాలో కూడా స్థానికులనే తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. హెచ్-1బి వీసా ఉద్యోగులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకోవాలని నిర్ణయించామని, ఎల్-1 వీసాల సదుపాయం కూడా ఉంది, అయితే, అవి పూర్తిగా హెచ్-1బిని భర్తీ చేయలేవు. ఈ నేపథ్యంలోనే టిసిఎస్‌లో కొత్త నియామకాలపై కొంత ప్రణాళిక ప్రకారం చేయనున్నట్లు కృతివాసన్ వివరించారు.

# రిటైల్ ద్రవ్యోల్బణం 1.54 శాతమే
### ఎనిమిదేళ్లలో ఇదే అత్యల్పం

**ముంబయి, అక్టోబర్ 13:** దేశ రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్ మాసంలో 1.54శాతానికి తగ్గింది. ఇది జూన్ 2017 తర్వాత కనిష్ట స్థాయికి చేరుకుంది. ఆగస్టులో 2.07శాతం నుండి ఈ తగ్గుదలకు కూరగాయలు, నూనెలు, పండ్లు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, గుడ్లు వంటి ఆహార ధరలు తగ్గడమే కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వినియోగదారుల ఆహార ధరల సూచిక వార్షికంగా 2.28శాతం తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం వరుసగా నాలుగో నెల కూడా ప్రతికూలంగానే ఉంది. ద్రవ్యోల్బణం తగ్గుదల గ్రామీణ రంగంలో కూడా ప్రతిబింబిస్తుంది. ఆగస్టులో ప్రధాన ద్రవ్యోల్బణం 1.69శాతం నుండి 1.07శాతానికి తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం -0.70శాతం నుండి -2.17శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ప్రధాన ద్రవ్యోల్బణం 2.47శాతం నుండి 2.04శాతానికి తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం -0.53శాతం నుండి -2.47శాతానికి తగ్గింది. మొత్తం మీద తగ్గుదల ఉన్నప్పటికీ, కొన్ని రంగాలు ధరలలో పెరుగుదలను చూశాయి. గృహ ద్రవ్యోల్బణం ఆగస్టులో 3.09శాతం నుండి 3.98శాతానికి పెరిగింది. విద్య ద్రవ్యోల్బణం 3.60శాతం



నుండి 3.44శాతానికి స్వలనవంగా తగ్గింది. ద్రవ్యోల్బణం తగ్గడానికి కాలానుగుణంగా ఆహార పదార్థాల ధరలు తగ్గడం, పప్పు ధాన్యాల ధరలు తగ్గడం, ప్రపంచ మార్కెట్‌లో ఇంధన ధరలు తగ్గడం కారణమని ఆర్థిక వేత్తలు వివరిస్తున్నారు. ప్రధాన ద్రవ్యోల్బణం ఇప్పుడు ఆర్‌బిఐ నిర్దేశించిన 2-6శాతం లక్ష్య బ్యాండ్ కంటే తక్కువగా ఉండటంతో కేంద్ర బ్యాంకు భవిష్యత్ రేటు చర్యలను నిర్ణయించేటప్పుడు సడలింపు ధోరణిని అంచనా వేయవచ్చు.

# ఇపిఎఫ్‌లో వందశాతం ఉపసంహరించుకోవచ్చు
### సిబిటి సమావేశంలో కీలక నిర్ణయం
### ఉద్యోగులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** ఇపిఎఫ్ పథకంలో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ నేతృత్వంలో సోమవారంనాడు సమావేశమైన ఇపిఎఫ్‌వో అత్యున్నత నిర్ణయాధికార సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇపిఎఫ్ చందాదారులను దృష్టిలో పెట్టుకొని సరళీకృత పాక్షి క ఉపసంహరణ పథకానికి ఆమోదముద్ర వేసింది. దీంతో ఈపీఎఫ్‌వో ఖాతా బ్యాలెన్స్‌లో వందశాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంది. అలాగే 13 సంక్లిష్ట నిబంధనలను ఒకే క్రమబద్ధీకరించిన రూల్‌లో విలీనం చేయాలని తీర్మానించారు. ఇపిఎఫ్ పథకంలో పాక్షిక ఉపసంహరణ నిబంధనలను సవరించారు. వాటిని అవసరమైన (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులుగా వర్గీకరించారు. దీంతో సభ్యులు ఇప్పుడు ఉద్యోగి, యజమాని సహకారంతో సహా వారి అర్హత కలిగిన




ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఏర్పడింది. ఇందుకు సంబంధించి విత్‌డ్రా పరిమితులను సవరించారు. విద్య కోసం పది పాక్షిక ఉపసంహరణలు, వివాహం కోసం ఐదుసార్లు పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. అన్ని పాక్షిక విత్‌డ్రాలకు కనీస అవసరం కూడా కేవలం 12 నెలలకు తగ్గించారు. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు కార్మిక మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయాలతో దాదాపు 70 మిలియన్లకు పైగా ఉన్న చందాదారులకు లబ్ధి చేకూరనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.